ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

epaper.vaartha.com WWW.VAARTHA.COM

తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త

నిజామాబాద్

: fb.com/vaartha Digital

Published from Nizamabad, Hyderabad, Vijayawada, Visakhapatnam, Rajahmundry, Guntur, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

5-7-2025 శనివారం సంపుటి: 31 సంచిక: 154 పేజీలు: 10+4 వెల: 6.50


## చర్చలూ ఆగలేదు.. యుద్ధమూ ఆపలేదు

## సిఎం కావాలనే కోరిక అలాగే ఉంది: డికె

5లో

## గొప్ప రాజనీతిజ్ఞుడు రోశయ్య

6లో

- హైదరాబాద్‌లో జరిగిన జయంతి సభలో కొనియాడిన వక్తలు




శుక్రవారం హైదరాబాద్‌లోని ఎల్‌బి స్టేడియంలో జరిగిన సామాజిక న్యాయ సమరభేరి సభలో మాట్లాడుతున్న ఎఐసిసి అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, సిఎం రేవంత్

## ఇందిరమ్మకు ఉన్న ధైర్యం మోడీకి ఏదీ?

### పాక్‌ను రెండుగా చీల్చింది ఇందిరే..

పాక్‌పై యుద్ధం చేయకుండా మోడీని ఆపిందెవరు?

విదేశాంగంలో బిజెపి విఫలం

సామాజిక న్యాయ సమరభేరి సభలో మోడీ, అమిత్‌షాపై నిప్పులు చెరిగిన ఖర్గే

2లో

## 100 అసెంబ్లీ , 15 ఎంపి సీట్లు మావే

### వచ్చే ఎన్నికల్లోనూ కాంగ్రెస్‌దే గెలుపు

రైతులకు ఎవరు మేలు చేశారో అసెంబ్లీలో చర్చిద్దాం రండి..: సామాజిక న్యాయ సమరభేరి సభలో సిఎం రేవంత్



శుక్రవారం హైదరాబాద్‌లో జరిగిన అల్లూరి సీతారామరాజు జయంతి వేడుకలో విల్లు ఎక్కుపెట్టిన రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్

## హనుమాన్ స్ఫూర్తిగా ఆపరేషన్ సిందూర్

### పాక్ ఉగ్రస్థావరాలనే టార్గెట్ చేశాం

### అల్లూరి సీతారామరాజు జయంతి వేడుకలో రక్షణ మంత్రి రాజ్‌నాథ్

**హైదరాబాద్ (మాదాపూర్), జులై 4, ప్రభాతవార్త:** హనుమాన్ స్ఫూర్తిగా ఆపరేషన్ సింధూర్ కొనసాగిందని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అన్నారు. పాకిస్థాన్‌తో పాటు ప్రపంచానికి మన బలమేంటో చూపించామన్నారు. పాక్ ఉగ్ర స్థావరాలను టార్గెట్ చేశాం తప్ప పౌరులను కాదని చెప్పారు. మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు జయంతి సందర్భంగా శుక్రవారం హైదరాబాద్‌లోని శిల్పకళావేదికలో క్షత్రియ సేవా సమితి (తెలంగాణ, ఆంధ్రప్రదేశ్), భారత ప్రభుత్వ సాంస్కృతికశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన వేడుకల్లో కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డితో కలిసిపాల్గొన్నారు. ఈ సంద

>>2



## బ్యాంక్ స్కాం కేసులో అల్లు అరవింద్ ఇడి విచారణ

### వచ్చేవారం మళ్లీ రావాలని ఆదేశం

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జులై4:** తెలుగు సినీ పరిశ్రమలో సంచలనం చోటు చేసుకుంది. ప్రముఖ నిర్మాత, గీతా ఆర్ట్స్ అధినేత అల్లు అరవింద్‌ను ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇడి) అధికారులు విచారించారు. హైదరాబాద్‌కు చెందిన రామకృష్ణ ఎలక్ట్రానిక్స్ సంస్థకు సంబంధించిన రూ.101 కోట్ల బ్యాంక్ రుణ మోసం కేసులో ఆయనను సుమారు మూడు గంటలపాటు ప్రశ్నించి, వాంగ్మూలాన్ని నమోదు చేసుకున్నారు. ఈ పరిణామం టాలీవుడ్ వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. వివరాల్లోకి వెళితే, రామకృష్ణ ఎలక్ట్రానిక్స్, రామకృష్ణ టెలిట్రానిక్స్ సంస్థలు 2017-19 మధ్యకాలంలో యూని యన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

>>2






## సచివాలయం ముట్టడికి నిరుద్యోగుల యత్నం, అరెస్టు

### నిర్బంధించడం అత్యంత దుర్మార్గమైన చర్య : కెటిఆర్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,జులై4:** రాష్ట్ర సెక్రటేరియట్ వద్ద ఉద్రిక్త వాతావరణం నెలకొంది. 2 లక్షల ఉద్యోగాల భర్తీ, జాబ్ క్యాలండర్ విడుదల, మెగా డీఎస్సీ ప్రకటించాలని శుక్రవారం సచివాలయం ముట్టడికి నిరుద్యోగులు యత్నించారు. అప్పటికే భారీగా మోహరించిన పోలీసులు ర్యాలీగా వస్తున్న పలువురు నిరుద్యోగులను అడ్డుకోని మరీ పోలీసు వాహనాల్లో స్థానిక స్టేషన్‌లకు తరలించారు. అలాగే డివైఎఫ్ఐ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో సచివాలయం ముట్టడికి యత్నించారు. ర్యాలీగా ప్లకార్డులు ప్రదర్శిస్తూ ముట్టడికి యత్నించారు. అన్ని ఉద్యోగాల నోటిఫికేషన్లు విడుదల చేయాలని డివైఎఫ్ఐ నాయకులు డిమాండ్ చేశారు. నిరుద్యోగ భృతి రూ.4వేలు ఇవ్వాలని, జాబ్ క్యాలండర్‌ను అమలు చేసి ఉద్యోగ నోటిఫికేషన్ ఇవ్వాలని, రాజీవ్ యువ వికాస్ పథకాన్ని అమలు చేయాలని ఈ సందర్భంగా వారు డిమాండ్ చేశారు.


ఏడాదిలోనే రెండు లక్షల ఉద్యోగాలిస్తామని కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ చేసిన ద్రోహంపై నిలదీసేందుకు వచ్చిన నిరుద్యోగులను అరెస్టు చేయడం అత్యంత దుర్మార్గమైన చర్య అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మండిపడ్డారు. ఇందిరమ్మ రాజ్యంలో సచివాలయం తలుపులు ఎప్పుడూ తెరిచే ఉంటాయని ఊదరగొట్టిన సీఎం రేవంత్ రెడ్డికి నిరుద్యోగుల కష్టాలు కనిపించడం లేదా..? అని ప్రశ్నించారు.

అశోక్ నగర్ చౌరస్తాలో రాహుల్ గాంధీని పిలిపించి మరీ నిరుద్యోగులతో చాయ్ పే చర్చ పెట్టిన రేవంత్‌కు గద్దెనెక్కిన తరువాత జాబ్ క్యాలెండర్ అసలు గుర్తే లేదా..? చలో సెక్రటేరియట్ కార్యక్రమాన్ని భగ్నం చేసేందుకు తెలంగాణ వ్యాప్తంగా అనేక జిల్లాల్లో నిరుద్యోగులు హైదరాబాద్ రాకుండా ముందుగానే నిర్బంధించడమే దారుణమైతే,సచివాలయానికి గోడు చెప్పుకునేందుకు వచ్చిన వారిని కూడా అరెస్టు చేయడం దుర్మార్గం అని కెటిఆర్ మండిపడ్డారు.

## యువకుడి ప్యాంటు జేబులో పేలిన మొబైల్ ఫోన్

3లో



శుక్రవారం ఆసుపత్రిలో కెసిఆర్‌ను పరామర్శించడానికి వచ్చిన బిఆర్ఎస్ నేతలు

# పరామర్శకు వచ్చిన నేతలతో కెసిఆర్ చర్చలు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్, జులై4:** బిఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్ ఆరోగ్య పరీక్షల నిమిత్తం ఆసుపత్రిలో చేరినప్పటికీ రాష్ట్ర రాజకీయాలు, ప్రజా సమస్యలపై దృష్టి సారించారు. సోమాజిగూడ లోని యశోద ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఆయన శుక్రవారం తనను పరామర్శించేందుకు వచ్చిన పార్టీ ముఖ్య నేతలతో సమీక్ష నిర్వహించారు. రాష్ట్రంలో నెలకొన్న తాజా పరిస్థితులపై ఆయన ఆసుపత్రిలోనే సుదీర్ఘంగా చర్చించడం ప్రాధాన్యత సంతరించుకుంది. ఆయనను పరామర్శించేందుకు కెటిఆర్, హరీశ్ రావుతో పాటు పలువురు ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు, పార్టీ సీనియర్ నాయకులు ఆసుపత్రికి తరలివచ్చారు. ఈ సందర్భంగా వారితో ముచ్చటించిన కెసిఆర్, రాష్ట్రంలోని రైతుల ఇబ్బందులు, వ్యవసాయ రంగంలోని సంక్షోభం, సాగునీటి సమస్యలు వంటి అంశాలపై ఆరా తీశారు. ముఖ్యంగా, రైతులకు యూరియా కొరత తీవ్రంగా వేధిస్తోందని, బనకచర్ల విషయంలో ప్రభుత్వ వైఖరి సరిగ్గా లేదని పలువురు నేతలు కెసిఆర్ దృష్టికి తీసుకు వెళ్లినట్లు తెలుస్తోంది. నేతలు వెల్లడించిన క్షేత్రస్థాయి వివరాలను కెసిఆర్ ఓపికగా విన్నారు. ప్రస్తుత పరిణామాలపై వారి నుంచి అభిప్రాయాలు, ఫీడ్‌బ్యాక్ తీసుకున్నారు.

# నిలకడగా కెసిఆర్ ఆరోగ్యం

## ఆందోళన వద్దన్న కెటిఆర్

### ఆసుపత్రికి వెళ్లి తండ్రిని పరామర్శించిన కవిత

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జులై4:** తెలంగాణ మాజీ సిఎం, బిఆర్ఎస్ అధినేత కెసిఆర్ స్వల్ప అస్వస్థతతో హైదరాబాద్‌లోని యశోద ఆసుపత్రిలో ఆసుపత్రిలో చేరిన విషయం తెలిసిందే. ప్రస్తుతం ఆయన ఆరోగ్యం నిలకడగా ఉందని, ఆందోళన చెందాల్సిన అవసరం లేదని యశోద ఆసుపత్రి వర్గాలు, ఆయన కుమారుడు కెటిఆర్ వేర్వేరుగా స్పష్టం చేశారు. గత రెండు రోజులుగా నీరసంగా ఉండటంతో కెసిఆర్‌ను గురువారం సాయంత్రం సోమాజిగూడలోని యశోద ఆసుపత్రికి తరలించారు. ఆయన వ్యక్తిగత వైద్యుడు డాక్టర్ ఎంవీ రావు సూచన మేరకు ఆసుపత్రిలో చేర్పించి వైద్య పరీక్షలు నిర్వహించారు. ప్రాథమిక పరీక్షల్లో కెసిఆర్ రక్తంలో చక్కెర (షుగర్) స్థాయిలు అధికంగా, సోడియం స్థాయిలు తక్కువగా ఉన్నట్లు తేలిందని ఆసుపత్రి వర్గాలు తెలిపాయి. ఈ మేరకు గురువారం రాత్రి హెల్త్ బులెటిన్‌ను విడుదల చేశాయి. చక్కెర, సోడియం స్థాయిలు సాధారణ స్థితికి వచ్చే వరకు కెసిఆర్ వైద్యుల పర్యవేక్షణలో ఆసుపత్రిలోనే చికిత్స పొందుతారని డాక్టర్ ఎంవీ రావు బులెటిన్‌లో పేర్కొన్నారు. ఈ విషయంపై కెసిఆర్ తనయుడు, బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ ఎక్స్ (ట్విట్టర్) వేదికగా స్పందించారు. సాధారణ వైద్య పరీక్షల కోసమే తన తండ్రి ఆసుపత్రిలో చేరారని తెలిపారు. ఆయన ఆరోగ్య సూచికలన్నీ (వైటల్స్) సాధారణంగానే ఉన్నాయని, ఎవరూ ఆందోళన చెందవద్దని విజ్ఞప్తి చేశారు. కెసిఆర్ ఆరోగ్యం గురించి ఆరా తీస్తున్న శ్రేయోభిలాషులు, పార్టీ కార్యకర్తలకు కెటిఆర్ కృతజ్ఞతలు తెలియజేశారు. బిఆర్ఎస్ అధినేత, తెలంగాణ మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్ త్వరగా కోలుకోవాలని మజ్లిస్ పార్టీ అధ్యక్షుడు, హైదరాబాద్ లోక్‌సభ సభ్యుడు అసదుద్దీన్ ఒవైసీ ఆకాంక్షించారు. ఈ మేరకు ఆయన సామాజిక మాధ్యమం ఎక్స్‌లో ట్వీట్ చేశారు. రెండు రోజుల క్రితం స్వల్ప అస్వస్థత కారణంగా కెసిఆర్ సోమాజిగూడ యశోద ఆసుపత్రిలో చేరారు. ఆయన త్వరగా కోలుకోవాలని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ తదితరులు ఆకాంక్షించారు. వైద్యులకు ఫోన్ చేసి ఆరోగ్యంపై ఆరా తీశారు. కొంతకాలంగా తండ్రితో దూరంగా ఉంటున్నారనే ప్రచారం జరుగుతున్న నేపథ్యంలో, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న తన తండ్రి కెసిఆర్‌ను పరామర్శించారు. ఆయన ఆరోగ్య పరిస్థితి గురించి వైద్యులను అడిగి తెలుసుకున్నారు. కుటుంబ సభ్యులతో పాటు పలువురు పార్టీ నాయకులు, కార్యకర్తలు ఆసుపత్రికి చేరుకుంటున్నారు.

# ఇందిరమ్మకు ఉన్న ధైర్యం మోడీకి ఏదీ?



సామాజిక సమరభేరి సభలో డి.సిఎం భట్టితో మాట్లాడుతున్న ఖర్గే

**హైదరాబాద్,జులై 4,ప్రభాతవార్త :** మోడీ లాగా ఇందిరా గాంధీ బయపడలేదు పాకిస్థాన్ విభజించిన ఘనత ఇంధిరాగాంధీకే దక్కుతుందని ఎఐసిసి అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే అన్నారు. శుక్రవారం హైదరాబాద్ జరిగిన సామాజిక న్యాయ సమరభేరి సభలో ఆయన కాంగ్రెస్ గ్రామ స్థాయి నాయకులను ఉద్దేశించి ప్రసంగిస్తూ ఎవరు వచ్చినా బంగ్లాదేశ్‌కు స్వాతంత్రం కల్పిస్తామని ఇందిరాగాంధీ చెప్పింది. చేసి చూపించింది. పాకిస్థాన్‌ను ఇది చేస్తాం, అది చేస్తాం అన్నారు. ఎందుకు చేయలేదు పాకిస్థాన్‌పై యుద్ధంచేయకుండా మిమ్మల్ని ఎవరు ఆపారు? అని నిలదీశారు. క్షమాపణ చెప్పడమే బిజెపి, ఆరెస్సెస్‌లకు తెలిసిన పని ఖర్గే ఎద్దేవా చేశారు. పెహెల్గాంలో సంఘటన జరిగితే అందరం కేంద్రానికి మద్దతు ఇచ్చాం. పెహెల్గాం సంఘటనపై చర్చించేందుకు ఆల్ పార్టీ మీటింగు పెట్టమని డిమాండ్ చేస్తే మీటింగ్ పెట్టారు కానీ మోడీ పాల్గొనలేదని గుర్తుచేసుకున్నారు. విదేశీ వ్యవహారాలు, విధానంలో బిజెపి పూర్తిగా విఫలమైందని విమర్శించారు. మోడీ చెప్పేవన్నీ అబద్ధాలే మోడీ, షా అబద్ధాలు చెప్పి ప్రజలను పిచ్చోళ్లను చేస్తున్నారని దుయ్యబట్టారు. 11ఏళ్ల కింద నల్లధనం తెచ్చి ప్రతి వ్యక్తికి 15 లక్షలు ఇస్తానని మోడీఅన్నాడు ఏమైంది? ఎందుకు తేలేదని ఆయన నిలదీశారు. హైదరాబాద్‌ను మేం అభివృద్ధిచేశాం అంటూ ప్రతి ఒక్కరు చెప్పుకొంటారు కానీ ఇక్కడ బిహెచ్ఇఎల్ ఫ్యాక్టరీపెట్టింది ఎవరు, ఇక్కడ మిథాని వంటి అనే ఫ్యాక్టరీలు పెట్టింది ఎవరు అని ఆయన ప్రశ్నించారు. హైదరాబాద్ రాష్ట్రం విలీనమైన తరువాత ఈ గడ్డపై కేంద్రప్రభుత్వరంగ సంస్థల ఆధ్వర్యంలో ఆనాటి ప్రధానులు నెహ్రూ ఇందిరలు అనేక ఫ్యాక్టరీలు పెట్టి లక్షల మందికి ఉపాధికల్పించడంతో హైదరాబాద్ ఇప్పటి స్వరూపం సంతరించుకొందని ఇది కాంగ్రెస్ ఘనత మాత్రమే అని ఆయన చెప్పుకొచ్చారు. హైదరాబాద్‌లో కనీసం 25 కేంద్ర ప్రభుత్వరంగ సంస్థలను కాంగ్రెస్ ప్రభుత్వాలు తెచ్చాయి హైదరాబాద్‌కి మోడీ చేసింది ఏంటో బిజెపి చెప్పాలి. రాజ్యాంగం నుండి లౌకిక పదాన్ని తొలగించాలని బిజెపి కుట్ర చేస్తుందని ఆయన ఆరోపించారు. సెక్యులర్ అనే పదం రాజ్యాంగంలో ముందునుంచి లేదని దానిని తొలగించాలని ఒక ప్రచారం చేస్తున్నారని కానీ దానిని తొలగించలేరనిఆయన అన్నారు. రాజ్యాంగం నుండి లౌకిక పదాన్ని తీస్తారా మీరు తీయలేరు అని బిజెపికి ఖర్గే చాలెంజ్ విసిరారు. సెక్యులర్ అనే పదం బిజెపి ఎన్నికల ప్రణాళికలో రాసుకున్నారని సెక్యులర్ అనే పదంతో మీకు ఇబ్బంది ఉంటే మీ పార్టీ ప్రణాళిక నుండి తీసేసి చూపెట్టండి అని ఆయన సవాల్ చేశారు. అబద్ధాలు చెప్పి కొందరు ఓట్లు అడుగుతారు మేం అభివృద్ధి, సంక్షేమంచేసి ఓట్లుఅడుగుతాంఅని ఖర్గే చెప్పారు. తెలంగాణలో విద్యా, వ్యవసాయం లాంటి అనేక కీలక రంగాలు అద్భుతంగా పనిచేస్తున్నాయి. ఫ్రీ కరెంట్, ఉచిత బస్సు, సన్న బియ్యం ఇస్తున్నది కాంగ్రెస్ ప్రభుత్వమేగత ప్రభుత్వం అమ్మే బియ్యం ఇచ్చేది. కాంగ్రెస్ ప్రభుత్వం తినే బియ్యం ఇస్తోందని చెప్పారు.

# 100 అసెంబ్లీ , 15 ఎంపి సీట్లు మావే



శుక్రవారం ఎల్‌బి స్టేడియంలో జరిగిన సభకు హాజరైన జనసందోహం

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,జులై4:** ఢిల్లీలో ఉండే మోడీ అయినా, గల్లీలోని కేడీ అయినా.. రైతు సంక్షేమం విషయంలో పార్లమెంట్‌లోనైనా, అసెంబ్లీలోనైనా తేల్చుకునేందుకు రావాలంటూ తెలంగాణ సిఎం రేవంత్ రెడ్డి సవాల్ చేశారు. ఈ క్రమంలో బిఆర్ఎస్, బిజెపి నేతలకు గట్టి సవాల్ విసిరారు. రాబోయే రోజుల్లో అసెంబ్లీ సీట్ల సంఖ్య 150 కి పెరగబోతోందని, మహిళా రిజర్వేషన్ రాబోతోంది.. 60 మంది ఆడబిడ్డలు ఎమ్మెల్యేలు కాబోతున్నారు అని చెప్పారు. మీరు ఢిల్లీకి వెళ్లాల్సిన అవసరం లేదు.. మీ టికెట్ మీ ఇంటికే వస్తుందని చెప్పారు. వచ్చే ఎన్నికల్లో వంద అసెంబ్లీ సీట్లు, 15 ఎంపీలు గెలిపిస్తాం రాష్ట్రంలో మళ్లీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తామని చెప్పారు. ఒకవేళ ఒక్క స్థానం తగ్గినా దానికి తానే పూర్తి బాధ్యత వహిస్తానని ప్రకటించారు. శుక్రవారం ఎల్బీ స్టేడియంలో సామాజిక న్యాయ సమరభేరి సభలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడారు. తెలంగాణలో మాకు తిరుగులేదని అహంకారంతో విర్రవీగుతున్న కల్వకుంట్ల గడీలను బద్దలు కొట్టి మూడు రంగుల జెండా ఎగరేశాం, ఇక్కడే ప్రజా పాలనకు నాంది పలికామని చెప్పారు. ఈ ప్రభుత్వం మూన్నాళ్ల ముచ్చట అని, సంక్షేమపథకాలు అమలు చేయరని, కలిసి ఉండరని చాలా మంది ప్రచారం చేశారు, కానీ నవ్విన వాళ్ల ముందు తలెత్తుకుని నిలబడి.. సంక్షేమ పథకాలు అమలు చేస్తూ తెలంగాణను దేశానికే ఆదర్శంగా నిలబెట్టామని చెప్పారు. 18 నెలల్లో రైతు భరోసా, సన్న వడ్లకు బోనస్, పేదలకు సన్న బియ్యం, రైతు రుణమాఫీ చేసి రైతుల రుణ విముక్తులని చేశాం అని చెప్పారు. 9 రోజుల్లో 9 వేల కోట్లు రైతు భరోసా అందించిన ఘనత ప్రజా ప్రభుత్వానిది అని చెప్పారు. వ్యవసాయాన్ని దండుగ నుంచి పండుగగా మార్చిన ఘనత తమదంటూ రేవంత్ రెడ్డి గర్వంగా చెప్పుకొచ్చారు. 24 గంటల ఉచిత కరెంట్, రుణ మాఫీ సహా రైతు సంక్షేమం కోసం అనేక పథకాలను అమలు చేసి తెలంగాణ వ్యవసాయ రంగాన్ని బలోపేతం చేసినట్లు తెలిపారు. ఈ వేదికగా సవాల్ విసురుతున్నా.. మోడీ వస్తాడో, కిషన్ రెడ్డి వస్తాడో, కెసిఆర్ వస్తాడో రండి.. రైతులకు మేలు చేసింది ఎవరో అసెంబ్లీలో చర్చిద్దాం రండి అని సవాల్ విసిరారు. పేదలకు రూ. 5 భోజనం పెట్టే కార్యక్రమానికి ఇందిరమ్మ పేరు పెడితే. కొందరు సన్నాసులు విమర్శలు చేస్తున్నారు. పేదల సంక్షేమం అంటేనే ఇందిరమ్మ, ఇందిరమ్మ అంటేనే పేదల సంక్షేమం అని చెప్పారు. ఆడబిడ్డలకు ఆర్టీసీలో బస్సులు అద్దెకు అందించి లాభాలు గడించేలా ప్రోత్సహిస్తాం. మహిళా సంఘాలకు పెట్రోల్ బంక్‌లను ఏర్పాటు చేసుకునేలా ప్రోత్సహించాం అని చెప్పారు. ఇందిరమ్మ రాజ్యంలో ఆడబిడ్డలను ఆర్థికంగా నిలబెట్టాం.. ఆత్మగౌరవంతో బ్రతికేలా చర్యలు తీసుకున్నామని చెప్పారు. కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయడమే లక్ష్యంగా ప్రజా పాలనలో ప్రజా ప్రభుత్వం ముందుకు వెళుతోందన్నారు. కిషన్ రెడ్డి, కెసిఆర్‌కు సవాల్ విసురుతున్న.. లెక్క ఒక్కటి తగ్గినా తాను కాళ్లు మొక్కి పదవి నుంచి తప్పుకుంటానని పేర్కొన్నారు. 18 నెలల్లో రాష్ట్రానికి రూ.3 లక్షల కోట్ల పెట్టుబడులు తీసుకొచ్చాం, వంద నియోజకవర్గాల్లో రూ.20 వేల కోట్లతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ ఏర్పాటు చేసేందుకు చర్యలు చేపట్టామని చెప్పారు. ప్రపంచంతో పోటీపడేలా మన విద్యా ప్రమాణాలు ఉండాలని ప్రణాళికలు వేసుకున్నామని పేర్కొన్నారు. యువతకు నైపుణ్యాన్ని అందించేందుకు యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీని ఏర్పాటు చేశామన్నారు. వచ్చే ఒలంపిక్స్ లక్ష్యంగా యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీని ఏర్పాటు చేసుకుంటున్నామని తెలిపారు. 2030 ఒలింపిక్స్‌లో గోల్డ్ మెడల్ సాధించేలా యువతను తీర్చిదిద్దుతామన్నారు. పార్టీ కార్యకర్తలే మా బ్రాండ్ అంబాసిడర్లు, సోషల్ మీడియాలో యుద్ధం ప్రకటించండి ఈ యుద్ధంలో కల్వకుంట్ల కుటుంబం బద్దలు కావాలని పిలుపునిచ్చారు. వచ్చేవి కార్యకర్తల ఎన్నికలు.. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో కార్యకర్తలను గెలిపించుకోవాలని నేతలకు సూచించారు. కార్యకర్తలకు నూటికి నూరు శాతం న్యాయం చేసే బాధ్యత నాదని పేర్కొన్నారు. జనగణనతో పాటు కులగణన చేస్తామని, ఎస్సీ వర్గీకరణ చేస్తామని గతంలో రాహుల్‌గాంధీ మాట ఇచ్చారని, హామీ ఇచ్చినట్టుగానే ఏడాదిలోపే కులగణన, ఎస్సీ వర్గీకరణ చేసి చూపించామని రేవంత్ రెడ్డి గుర్తు చేశారు. 18 నెలల్లో దేశానికే ఆదర్శంగా నిలిచేలా తెలంగాణ మోడల్ ఆవిష్కరించామన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ కార్యకర్తలను గెలిపించుకునే బాధ్యత తాను తీసుకుంటానని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటించారు. ప్రజా సంక్షేమ పథకాలు అమలులో దూసుకుపోతున్న కాంగ్రెస్ పార్టీకి కార్యకర్తలే ప్రభుత్వం తరపున ప్రచారకర్తలుగా మారాలని ఆయన పిలుపునిచ్చారు.

# ఇడి విచారణ

>> నుంచి రూ.101 కోట్ల రుణం తీసుకుని ఎగవేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ రుణ నిధులను సంస్థ యజమానులు సొంత ప్రయోజనాలకు, అక్రమ నగదు బదిలీకి వాడారని ఇడి గుర్తించింది. మొదట సిబిఐ కేసు నమోదు చేయగా, ఆ తర్వాత మనీ లాండరింగ్ కోణంలో ఇడి దర్యాప్తు ప్రారంభించింది. ఈ దర్యాప్తులో భాగంగా రామకృష్ణ ఎలక్ట్రానిక్స్ సంస్థతో అల్లు అరవింద్‌కు చెందిన సంస్థలకు మధ్య కొన్ని అనుమానాస్పద ఆర్థిక లావాదేవీలు జరిగినట్లు ఇడి అధికారులు గుర్తించారు. ఈ లావాదేవీలపై స్పష్టత కోరుతూ అధికారులు ఆయనకునోటీసులు జారీ చేశారు. రెండు రోజుల క్రితం హైదరాబాద్‌లోని ఇడి కార్యాలయానికి హాజరైన అల్లు అరవింద్‌ను అధికారులు సుదీర్ఘంగా ప్రశ్నించారు. ప్రధానంగా బ్యాంకు లావాదేవీలు, ఆస్తుల కొనుగోళ్లకు సంబంధించిన వివరాలు అడిగి తెలుసుకున్నట్లు సమాచారం. విచారణఇంకా పూర్తికానందున, వచ్చే వారం మరోసారి తమ ఎదుట హాజరుకావాలని ఇడి అధికారులు ఆయనకు సూచించినట్లు విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. ఈ కేసులో ప్రధాన నిందితులుగా ఉన్న రామకృష్ణ గ్రూప్ యజమానులు వి. రాఘవేంద్ర, వి. రవి కుమార్‌లతో అల్లు అరవింద్‌కు ఉన్న సంబంధాలపై కూడా ఇడి ఆరా తీస్తోంది.

**అల్లు అరవింద్ స్పందన**

ఈడీ విచారణపై ప్రముఖ సినీ నిర్మాత అల్లు అరవింద్ స్పందించారు. 2017లో ఓ ప్రాపర్టీలో ఒక మైనర్ వాటాదారుడి భాగాన్ని తాను కొనుగోలు చేశానని ఆయన తెలిపారు. ఆ ప్రాపర్టీకి సంబంధించి ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్‌కి కొన్ని సమస్యలు ఉన్నాయని ఆయన అన్నారు. ఆ మైనర్ వాటాదారుడు బ్యాంకు నుంచి రుణం తీసుకొని చెల్లించలేదని ఆయన పేర్కొన్నారు. అకౌంట్స్ బుక్‌లో తన పేరు ఉండటం వల్ల ఇడి విచారణకు పిలిచిందని ఆయన వెల్లడించారు. బాధ్యత గల పౌరుడిగా తాను విచారణకు హాజరయ్యానని తెలిపారు. ఇడి అధికారులు అడిగిన ప్రశ్నలకు సమాధానం ఇచ్చానని అల్లు అరవింద్ తెలియజేశారు.

# మహిళా కమిషన్ ముందు హాజరైన కాంగ్రెస్ నేత ఫిరోజ్ ఖాన్

**హైదరాబాద్ జులై 4 ప్రభాతవార్త:** మహిళలపై అనుచిత వ్యాఖ్యలు చేశారని కాంగ్రెస్ నేత ఫిరోజ్ ఖానుకు మహిళా కమిషన్ నోటీసులు జారీ చేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలోనే ఆయన శుక్రవారం తెలంగాణ మహిళా కమిషన్ ఎదుట హాజరయ్యారు. కమిషన్ ఛైర్‌పర్సన్ నేరెళ్ల శారద సమక్షంలో ఫిరోజ్ ఖాన్ తనుచేసిన వ్యాఖ్యలపై వివరణ ఇచ్చారు. ఈ క్రమంలోనే కమిషన్ ఎలాంటి చర్యలుతీసుకుంటుందో వేచిచూడాల్సి ఉంది. కాగా, కాంగ్రెస్ నేత మొహమ్మద్ ఫిరోజ్ ఖాన్, జూన్ 21న గాంధీ భవన్‌లో జరిగిన ప్రెస్ మీట్‌లో మహిళలను కించ పరిచే వ్యాఖ్యలుచేశారని ఆరోపణలు వచ్చాయి.

## వారం - వర్జ్యం

తేది : 05-07-2025, శనివారం
శ్రీ విశ్వావసు నామ సంవత్సరం,
ఆషాఢ మాసం, ఉత్తరాయణం,
గ్రీష్మ ఋతువు, శుక్ల పక్షం
దశమి సా. 6.59
స్వాతి రా. 7.50
వర్జ్యం రా. 2.06-3.53
దు.తె. 5.40-7.20
శుభసమయం: ఉ. 7.50-8.30, సా. 6.30-7.00
రాహుకాలం - ఉ. 9.00-10.30

## వార్తాఫలం

**మేషం:** బంధువుల నుండి వచ్చిన ఆహ్వానాలు ఆనందం కలిగిస్తాయి. ప్రముఖులతో పరిచయాలు పెరుగుతాయి.

**వృషభం:** వివాహయత్నాలు ఫలిస్తాయి. నూతన వ్యాపారాలు ప్రారంభిస్తారు. వస్తు, వస్త్రాలాభాలు.

**మిథునం:** అనుకోని అవకాశాలు లభిస్తాయి. వాటిని సద్వినియోగం చేసుకోండి. పోటీపరీక్షలలో అనుకూలంగా వుండును.

**కర్కాటకం:** అందరిని మాటలతో ఆకట్టుకొని ముందుకు సాగుతారు. పారిశ్రామిక రంగాల వారికి విజయ వంతమైన కాలం.

**సింహం:** వృత్తి, వ్యాపారాలలో లాభాలు పొందుతారు. ఉద్యోగులు ఆశ్చర్యకరంగా ఇంక్రిమెంట్లు పొందుతారు.

**కన్య :** సేవాకార్యక్రమాలలో చురుకుగా పాల్గొంటారు. సన్నిహితుల నుండి కీలక సమాచారం అందుతుంది.

**తుల :** ఆస్తి వివాదాలు తీరి లబ్ధి పొందుతారు. శత్రువులను సైతం మిత్రులుగా మార్చుకుంటారు.

**వృశ్చికం:** సంగీత సాహిత్యాలపై ఆసక్తి చూపుతారు. ఇంటా బయటా ప్రోత్సాహం లభిస్తుంది.

**ధనుస్సు:** క్రయ విక్రయాలలో ప్రోత్సాహం పొందుతారు. గృహనిర్మాణ ఆలోచనలు కార్యరూపం దాలుస్తాయి.

**మకరం:** వృత్తి, వ్యాపారాలు అభివృద్ధి చెందుతాయి. బంధువులను కలిసి ఆనందంగా గడుపుతారు.

**కుంభం:** జీవిత భాగస్వామి నుండి ఆస్తి లాభం పొందుతారు. ఉద్యోగులకు బాధ్యతలు పెరిగిన సమర్థ వంతంగా నిర్వహిస్తారు.

**మీనం :** శ్రమ ఫలించే సమయం. సంతానం ఉద్యోగయత్నాలు ఫలిస్తాయి. పట్టుదలతో ముందుకు సాగుతారు.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్



శుక్రవారం ట్రినిడాడ్-టొబాగో గౌరవ పురస్కారం అందుకుంటున్న ప్రధాని మోడీ

# ప్రధానిమోడీకి ట్రినిడాడ్ టొబాగో అత్యున్నత పురస్కారం

**పోర్టాఫ్ స్పెయిన్, జులై 4:** ఐదుదేశాలపర్యటనలోభాగంగా ట్రినిడాడ్ టుబాగో దేశ పర్యటనలో ఉన్న ప్రధానిమోడీకి ఆదేశ అత్యున్నత పురస్కారంతో గౌరవించింది. ప్రధానిమోడీ కి 'ఆర్డర్ ఆఫ్‌ది రిపబ్లిక్ ఆఫ్‌ట్రినిడాడ్ అండ్ టొబాగో' పురస్కారం లభించింది. కారికోమ్ భాగస్వామి మాత్రమేకాకుండా ట్రినిడాడ్ టొబాగో భారత్‌తో దశాబ్దాల తరబడి సంస్కృతి సాంప్రదాయాలను పంచుకుంటున్నదని, 140 కోట్లమంది భారతీయుల తరపున తనకు ఈ దేశం అత్యున్నత పురస్కారం ఇవ్వడం తనకు లభించిన అరుదైన గౌరవమని ప్రధానిమోడీ అన్నారు. ట్రినిడాడ్‌టొబాగో ప్రధాని కమ్లా పెర్సాద్ బిస్సెసర్, అద్యక్షుడు కంగాలూల చేతులమీదుగా ఈపురస్కారం అందుకున్నారు. గ్లోబల్ సౌత్ అభ్యున్నతికి ఆదేశాలమధ్య సంబంధాలను మరింతపెంపొందించడంలో భారత ప్రధాని మోడీచేసిన అవిరళ కృషికి నిదర్శనంగా ఈ పురస్కారం ప్రధానంచేస్తున్నట్లు ట్రినిడాడ్‌ప్రధాని కమ్లా పెర్సాద్ పేర్కొన్నారు.

# ట్రినిడాడ్ ప్రధానికి మోడీ స్పెషల్ గిఫ్ట్!



**పోర్ట్ఆఫ్‌స్పెయిన్, జులై 4:** భారత ప్రధాని నరేంద్ర మోడీ, కరేబియన్ దేశమైన ట్రినిడాడ్ అండ్ టొబాగోతో మన దేశానికి ఉన్న బలమైన సాంస్కృతిక, ఆధ్యాత్మిక బంధాలను చాటిచెప్పారు. తన పర్యటనలో భాగంగా ఆ దేశ ప్రధాని కమలా ప్రసాద్ బిస్సెస్సర్‌కు అయోధ్య రామ మందిర నమూనాను ప్రత్యేక కానుకగా అందజేశారు. రెండు రోజుల పర్యటన నిమిత్తం ట్రినిడాడ్ వెళ్లిన ప్రధాని మోడీ గౌరవార్థం ప్రధాని కమలా ప్రసాద్ విందు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మోడీ, అయోధ్య రామాలయ నమూనాతో పాటు పవిత్ర సరయూ నదీ జలాన్ని, ప్రయాగ్‌రాజ్‌లో జరిగిన మహాకుంభమేళా తీర్థాన్ని కూడా వారికి బహూకరించారు. ఈ బహుమతులు భారత్‌ట్రినిడాడ్ మధ్య ఉన్న లోతైన సాంస్కృతిక సంబంధాలను ప్రతిబింబిస్తాయని ప్రధాని మోదీ 'ఎక్స్' (ట్విట్టర్) వేదికగా పేర్కొన్నారు. ఈ విందులో మరో విశేషం కూడా ఉంది. భారతీయ మూలాలున్న ప్రజలు పవిత్రంగా భావించే సోహరి ఆకుపై ఆహారాన్ని వడ్డించారు. పండుగలు, ప్రత్యేక కార్యక్రమాల్లో ఇలా ఆకుపై భోజనం చేయడం అక్కడి సంప్రదాయం. తన పర్యటనలో భాగంగా మోదీ భోజ్‌పురి చౌతాల్ సంగీత ప్రదర్శనను తిలకించారు. కొన్నేళ్ల క్రితం గాంధీ 150వ జయంతి సందర్భంగా 'వైష్ణవ జన తో' గీతాన్ని ఆలపించిన స్థానిక గాయకుడు రాణా మోహిప్‌ను కలిసి అభినందించారు.

# సిఎస్, రాష్ట్ర పోలీస్ శాఖతో 8న కేంద్ర హోం శాఖ సెక్రటరీ భేటీ

**హైదరాబాద్ జులై 4 ప్రభాతవార్త:** కేంద్ర హోం శాఖ సెక్రటరీ గోవింద్ మోహన్ రాష్ట్ర సీఎస్, పోలీస్ శాఖతో 8వ తేదిన భేటికానున్నారు. ఈ సమావేశానికి సబంధించిన షెడ్యూల్ ఖరారైంది. ప్రజా భవన్ లో రాష్ట్ర పోలీస్ శాఖ ఉన్నతాధికారులతో భేటీ కానున్నారు. రాష్ట్ర డీజీపీ, ఏడీజీపీ సీఐడి, ఫోరెన్సిక్, సైబర్ క్రైమ్, నార్కోటిక్స్, డిజాస్టార్ రెస్పాన్స్ అండ్ ఫైర్, జైళ్ళశాఖ అధికారులతో చర్చించనున్నారు. సీఎస్, స్పెషల్ చీఫ్ సెక్రటరీ హోం శాఖ, రెవెన్యూ సెక్రటరీలతో సమావేశం కానున్నారు. ఈ భేటీ పై రాష్ట్రస్థాయి అధికారులతో శనివారం సిఎస్ కార్యాలయంలో సమీక్ష నిర్వహించనున్నారు.

# ఎర్రవల్లి సాగు భూములకు నీళ్లు ఇవ్వండి

## అధికారులను ఆదేశించిన మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి

**హైదరాబాద్ జులై 4 ప్రభాతవార్త:** సిద్దిపేట జిల్లాలోని కొండపోచమ్మ ప్రాజెక్టు కింద ఉన్న ఎర్రవల్లి గ్రామ రైతుల వ్యవసాయ భూములకు నీళ్లు విడుదల చేయాలని నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ఎర్రవల్లి గ్రామరైతులు తమ సమస్యలపై గురువారం రాష్ట్ర వ్యవసాయ రైతు సంక్షేమ కమిషన్ ఛైర్మన్ ఎం. కొదండ ఎరెడ్డిని కలుసుకున్నారు. దాంతో కమిషన్ ఛైర్మన్ వెంటనే మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి దృష్టికి ఎర్రవల్లి రైతుల సాగునీటి సమస్యలను తీసుకువచ్చారు. దాంతో మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి కొండపోచమ్మ సాగర్ ప్రాజెక్టు నుంచి ఎర్రవల్లి రైతుల పంటలకు నీటిని విడుదల చేయాలని అధికారులకు స్పష్టం చేశారు.

# ఆపరేషన్ సిందూర్



శుక్రవారం హైదరాబాద్‌లో అల్లూరి సీతారామరాజు విగ్రహం వద్ద అభివాదం చేస్తున్న రాజ్‌నాథ్ సింగ్

>> ర్భంగా రాజ్‌నాథ్ సింగ్ మాట్లాడుతూ గిరిజనుల కోసం అల్లూరి సీతారామరాజు అనేక పోరాటాలు చేశారని అన్నారు. భారత్ కోసం అల్లూరి సీతారామరాజు లాంటి గొప్ప వీరుడిని ఆంధ్రప్రదేశ్ ఇచ్చిందని, అడవి నుంచి విప్లవం పుట్టించి బ్రిటిష్ వారిని గజగజలాడించిన వ్యక్తి అల్లూరి అని అన్నారు. గెరిల్లా యుద్ధ నైపుణ్యాలతో ఆధునిక ఆయుధాలకు వ్యతిరేకంగా పోరాడిన ధీశాలిఅని, బానిసత్వంతో కాదు ఆత్మాభిమానంతో బతకాలనేది ఆయననుంచి మనం నేర్చుకోవాలన్నారు. అడవి బిడ్డల కోసం అల్లూరి వీరోచిత పోరాటం చేశారని, ఆయన పుట్టిన గ్రామాన్ని పర్యటక ప్రాంతంగా తీర్చిదిద్దుతున్నామని రాజ్‌నాథ్ సింగ్ అన్నారు.

**అల్లూరి చరిత్ర నేటి తరానికి తెలియాలి : కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి**

అల్లూరి సీతారామరాజు చరిత్రను ఈ తరం, నవతరానికి తెలియాలని, అల్లూరి సంఘసంస్కర్త, సామాజిక సంస్కర్త, సాంఘిక దురాచారాలకు వ్యతిరేకంగా ప్రచారం చేసిన మహానుభావుడని, బ్రిటిషర్లపై తిరుగుబాటు చేసి పోరాడిన వీరుడని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి కొనియాడారు. దేశ రక్షణ వ్యవస్థకు నూతన జవసత్వాలు అందించి, భారత సైనిక శక్తి ఏంటో ఆపరేషన్ సిందూర్ ద్వారా ప్రపంచానికి తెలియజేసిన, కల్మషం లేని నాయకుడు, ఆజాతశత్రువు, మాకు అందరికీ ప్రేరణనిచ్చే గొప్ప నాయకుడు రాజ్‌నాథ్ సింగ్ అని తెలిపారు. ఈ సందర్భంగా ఆయనకు ఘన స్వాగతం పలికారు. అల్లూరి సీతారామరాజు జయంతి సందర్భంగా నివాళులర్పిస్తూ, ఈ ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. దేశానికి 75 సంవత్సరాల స్వాతంత్ర్య వేడుకలను ఆజాదీ కా అమృత్ మహోత్సవ్ పేరుతో నిర్వహించాలని నిర్ణయించిన సందర్భంలో, ఆ బాధ్యతలను కేంద్ర సాంస్కృతిక శాఖ మంత్రిగా నాకు అప్పగించారని తెలిపారు. గిరిజన ప్రాంతాల్లోని అనేక స్వాతంత్ర్య సమరయోధుల చరిత్ర పుటల్లో స్థానం లేకుండా పోయిందని, ఈ చరిత్రను సమాజానికి, యువతరానికి అందించాలన్నదే ప్రధాని నరేంద్ర మోడీ ముఖ్య ఉద్దేశ్యమని తెలిపారు. హైదరాబాద్ నగరంలో అల్లూరి సీతారామరాజు జయంతి ఉత్సవాలకు భారత రాష్ట్రపతిని ఆహ్వానించామని తెలిపారు. అల్లూరి సీతారామరాజు జయంతి సందర్భంగా నివాళులు అర్పిస్తూ, జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నామని తెలిపారు.

## మా కంటే పోలీసుల హడావిడి ఎక్కువైంది!

### రాజ్యసభ సభ్యురాలు రేణుకాచౌదరి

**హైదరాబాద్, జూలై 4, ప్రభాతవార్త:** గాంధీభవన్ వద్ద పోలీసుల తీరుపై రాజ్యసభ సభ్యురాలు రేణుకాచౌదరి, మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేమసాగర్ అసహనం వ్యక్తం చేశారు. తమకంటే పోలీసుల హడావిడి ఎక్కువైందంటూ రేణుకాచౌదరి మండిపడ్డారు. మరోవైపు ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు కూడా పోలీసుల వైఖరితో అసహనం వ్యక్తం చేశారు. తమను ఆపుతారా అంటూ పోలీసులపై నేతలు ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ అగ్రనేతలు మల్లికార్జున ఖర్గే, కెసి వేణుగోపాల్, మీనాక్షి నటరాజన్, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గాంధీభవన్‌లో ఉండటంతో వారిని కలిసేందుకు కేడర్ క్యూకట్టింది. ఈ క్రమంలో కేడర్ లోపలికి రాకుండా పోలీసులు అడ్డుకుంటున్నారు.



సిఎం ప్రజావాణిలో దరఖాస్తులు స్వీకరిస్తున్న చిన్నారెడ్డి.

## సిఎం ప్రజావాణికి అందిన దరఖాస్తులు 246

**హైదరాబాద్ (బేగంపేట) జూలై 4, ప్రభాతవార్త:** మహాత్మా జ్యోతిబా ఫూలే ప్రజాభవన్‌లో శుక్రవారం నిర్వహించిన సిఎం ప్రజావాణి కార్యక్రమంలో మొత్తం 246 దరఖాస్తులు అందాయి. వీటిలో పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖకు సంబంధించి 80 దరఖాస్తులు, రెవెన్యూ శాఖకు సంబంధించి 42 దరఖాస్తులు, విద్యుత్ శాఖకు 18 దరఖాస్తులు, పౌర సరఫరాల శాఖకు 8 దరఖాస్తులు, ఇందిరమ్మ ఇళ్ల కోసం 30 దరఖాస్తులు వచ్చాయి. ఇతర శాఖలకు సంబంధించి 68 దరఖాస్తులు అందినట్లు అధి కారులు తెలియజేసారు. సిఎం ప్రజావాణి ఇన్‌చార్జి, రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్‌ఛైర్మన్ డా.జి.చిన్నారెడ్డి, దరఖాస్తులు స్వీకరించి ప్రజల సమస్యలు విని సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడి పలు సమస్యలను పరిష్కరించారు.

## పైరసీ నియంత్రణకు కఠినచర్యలు


### త్వరలో ప్రత్యేక కమిటీ

### ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ దిల్‌రాజు

**హైదరాబాద్, జూలై 4, ప్రభాతవార్త:** సినీ చిత్ర పరిశ్రమకు పైరసీ పెద్ద సవాల్‌గా మారిందని, దీని నియంత్రణకు కఠిన చర్యలు తీసుకుంటామని తెలంగాణ ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ దిల్‌రాజు స్పష్టం చేశారు. చిత్ర పరిశ్రమకు ప్రధానంగా వీడియో పైరసీ చాలా నష్టాన్ని కలిగిస్తోందన్నారు. ఈ మేరకు హైదరాబాద్‌లో ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఎండి సిహెచ్ ప్రియాంకతో కలిసి మీడియాతో మాట్లాడుతూ ఇందుకోసం త్వరలో ఒక ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. దీనిపై ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం, డిప్యూటీ సీఎం విక్రమార్కతో పలు మార్లు కీలక సమావేశాలు నిర్వహించినట్లు చెప్పారు. అదేవిధంగా సినిమా పరిశ్రమ ఎదుర్కొంటున్న వివిధ సమస్యలను దృష్టిలో ఉంచుకుని, వాటి పరిష్కారానికి అవసరమైన సమగ్ర కార్యాచరణను సిద్ధం చేస్తున్నట్లు వివరించారు. ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ నోడల్ ఏజెన్సీగా ఫిల్మ్ ఛాంబర్ అఫ్ కామర్స్ సైబర్ సెల్, పోలీస్ శాఖల ప్రతినిధులతో కమిటీ ఏర్పాటు చేసే అలోచన చేస్తున్నామని వెల్లడించారు. అంతేకాకుండా సినిమా షూటింగ్‌లకు అన్‌లైన్ అనుమతులపైన చరించనున్నట్లు తెలియచేశారు. సినీ పరిశ్రమ అభివృద్ధికి తెలంగాణ ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. అందరం కలిసి సమిష్టిగా సినీ రంగాన్ని ముందుకు తీసుకెళ్లాల్సిన అవసరం ఉందని చెప్పారు. చిత్ర పరిశ్రమలో ఎదుర్కొంటున్న సమస్యలను ఎవరైనా తమ దృష్టికి తీసుకువచ్చినట్లయితే వాటి పరిష్కారానికి కృషి చేస్తామని పేర్కొన్నారు.

## యువకుడి ప్యాంటు జేబులో పేలిన మొబైల్ ఫోన్

**హైదరాబాద్ (అత్తాపూర్) జూలై 4, ప్రభాతవార్త :** యువకుడి ప్యాంటు జేబులో మొబైల్ ఫోన్ పేలి తీవ్ర గాయాలు అయిన సంఘటన రాజేంద్రనగర్ పోలీసులు పరిధి లోని చోటుచేసుకుంది. అత్తాపూర్‌లో శుక్రవారం బైకుపై శ్రీని వాస్ అనే యువకుడు వెళ్తు న్నాడు. ఈ క్రమంలో ప్యాంటు జేబులో ఉన్న వివో మొబైల్ ఫోన్ వేడెక్కడంతో బైక్‌ను పక్కకి ఆపి ఫోన్ బయటకు తీసే లోపల పేలిపోయింది. ఒక్కసారిగా మంటలు రావడంతో వెంటనే బేబులో నుంచి ఫోన్ తీశాడు. తీవ్రగాయాలు కావడంతో సమీ పంలోని ఆస్పత్రికి వెళ్లి చికిత్స చేయించుకున్నాడు. వెంటనే అప్రమత్తం కాకపోయి ఉంటే తొడ కండరాల్లోకి తీవ్రగాయాలయ్యే అవకాశం ఉండేదని వైద్యులు తెలిపారు.



పేలిన మొబైల్‌ఫోన్

## ఉక్రెయిన్‌పై వందల డ్రోన్లు, క్షిపణులతో రష్యా దాడులు



**క్యీవ్, జూలై 4:** ఉక్రెయిన్‌పై రష్యా మరోసారి విరుచుకుపడింది. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, రష్యా అధ్యక్షుడు పుతిన్ మధ్య యుద్ధ నివారణపై సుదీర్ఘ చర్చలు జరిగిన గంటల వ్యవధిలోనే మాస్కో సేనలు దాడులకు దిగడం కలకలం రేపింది. శుక్రవారం నాడు ఉక్రెయిన్ రాజధాని కీవ్‌తో పాటు పలు నగరాలపై రష్యా డ్రోన్లు, క్షిపణులతో భీకర దాడికి పాల్పడింది. ఈ దాడుల్లో భాగంగా మొత్తం 539 డ్రోన్లు, 11 క్షిపణులను ప్రయోగించినట్లు ఉక్రెయిన్ వాయుసేన వెల్లడించింది. కీవ్‌లో జరిగిన దాడిలో పోలండ్ దౌత్య కార్యాలయ భవనం దెబ్బతిన్నట్లు అధికారులు తెలిపారు. అయితే, ఈ ఘటనలో ఎవరికీ ఎలాంటి ప్రాణ నష్టం జరగలేదని స్పష్టం చేశారు. దాడుల సమయంలో బాంబుల నుంచి రక్షించుకోవడానికి స్థానిక ప్రజలు సురక్షిత ప్రాంతాలకు పరుగులు తీస్తున్న దృశ్యాలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయ్యాయి. రష్యా దాడుల కారణంగా ఉక్రెయిన్‌లోని మొత్తం 8 ప్రాంతాల్లో తీవ్ర విధ్వంసం జరిగినట్లు ఉక్రెయిన్ ప్రభుత్వం పేర్కొంది. ఈ దాడుల్లో సుమారు 40 అపార్ట్‌మెంట్లు, పలు పాఠశాలలు ధ్వంసమయ్యాయని తెలిపింది. అదేవిధంగా రైల్వే మౌలిక సదుపాయాలు కూడా దెబ్బతిన్నాయని వెల్లడించింది. రైల్వే ట్రాక్‌లు, సిగ్నలింగ్ వ్యవస్థకు నష్టం వాటిల్లడంతో పలు రైళ్లను వేరే మార్గాల్లో మళ్లించినట్లు ఉక్రెయిన్ రైల్వే శాఖ ఒక ప్రకటనలో వివరించింది. ఇదిలా ఉంటే ఉక్రెయిన్‌రాజధాని క్యీవ్‌లోని పోలండ్ దౌత్యకార్యాలయం దెబ్బతిన్నదని ఉక్రెయిన్‌ప్రకటించింది. ఎలాంటిప్రాణనష్టం మాత్రం లేదని వివరించింది. ఓపక్క అమెరికా అద్యక్షుడు డొనాల్డ్‌ట్రంప్, రష్యా అధ్యక్షుడు పుతిన్‌తో సుదీర్ఘచర్చలు జరుపుతున్న తరుణంలోనే రష్యా ఉక్రెయిన్‌పై విరుచుకుపడటంచూస్తుంటే కాల్పుల విరమణకు రష్యా సుతరాము ఇష్టపడటంలేదని తెలుస్తోంది.

# పదకొండేళ్ల పాలనలో ఎమర్జెన్సీపై ఎందుకు మాట్లాడటం లేదు?

### బిజెపికి ఎఐసిసి అధ్యక్షుడు మల్లికార్జునఖర్గే సూటిప్రశ్న

### 90 సీట్లతో రాష్ట్రంలో తిరిగి అధికారంలోకి వస్తాం

### పిసిసి విస్తృతస్థాయి సమావేశంలో మహేష్‌కుమార్‌గౌడ్

**హైదరాబాద్, జూలై 4, ప్రభాతవార్త:** యాభై ఏళ్ల క్రితం జరిగిన ఎమర్జెన్సీ గురించి మాట్లాడే బిజెపి నేతలు పదకొండేళ్ల వారి పాలనలోని ఎమర్జెన్సీ పరిస్థితులు గురించి ఎందుకు మాట్లాడటం లేదని ఎఐసిసి చీఫ్ మల్లికార్జుఖర్గే ప్రశ్నించారు. గాంధీభవన్‌లో శుక్రవారం టిపిసిసి అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్ అధ్యక్షతన జరిగిన విస్తృత స్థాయి సమావేశంలో ముఖ్యఅతిథిగా ఎఐసిసి అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే, ఎఐసిసి ప్రధాన కార్యదర్శి కె.సి వేణుగోపాల్, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, తెలంగాణ వ్యవహారాల ఇన్‌చార్జ్ మీనాక్షి నటరాజన్, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, ఎఐసిసి కార్యదర్శి విశ్వనాధన్, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భం గా మేనిఫెస్టో అమలులో కాంగ్రెస్ ప్రభుత్వ కృషి అభినందనీయమని ఆయన అన్నారు. హామీలను అమలు చేసే ఏకైక పార్టీగా కాంగ్రెస్ చరిత్రలో నిలిచి పోతుందని చెప్పారు. తెలంగాణ లో పరిపాలన బావుందని పార్టీ కార్యకర్తల పనితీరు బావుందని ఆయన కితాబునిచ్చారు పార్టీ మీ అందరికీ ఇచ్చిన పదవులను సద్వినియోగం చేసు కోవాలని సూచించారు. సంస్థాగతంగా ఉన్న మరికొన్ని పదవులు కూడా పార్టీ కోసం కష్టపడి పనిచేసిన వారికే సమర్థులకు పదవులు ఇవ్వాల్సిందిగా టీపిసిసి చీఫ్ కి సూచిస్తున్నా అని ఆయన తెలిపారు. పార్టీ నేతలు ఇష్టానుసారం మాట్లొద్దు పార్టీ నియమ నిబంధనలకు కట్టుబడి ఒకే తాటిపై నిలవాలి అని అన్నారు. తెలంగాణలో అమల వు తున్న సంక్షేమ పథకాలు అభివృద్ధి కార్యక్రమాలకు ప్రజలు సంతృప్తి చెందుతున్నారని కాంగ్రెస్ మరోసారి 90 సీట్లతో అధికారంలోకి రావడం ఖాయమని టిపిసిసి చీఫ్ మహేష్ కుమార్‌గౌడ్ ధీమా వ్యక్తం చేశారు. పిసిసి చీఫ్, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ ఎఐసిసి అధ్యక్షులు మల్లికార్జునఖర్గే, కాంగ్రెస్ అగ్రనేతలు సోనియాగాంధీ, రాహుల్‌గాంధీ, ఎఐసిసి ప్రధాన కార్యదర్శి కె.సి వేణుగోపాల్ ఆశీర్వాదం, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చొర వతో రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్ష పదవి వరించిందని ఆయన అన్నారు. సామాజిక న్యాయం కాంగ్రెస్ పార్టీతోనే సాధ్య మని ఆయన తెలిపారు. సామాజిక న్యాయానికి కట్టు బడి కాంగ్రెస్ పారీ నలుగురు దళితులకు కేబినెట్ లో చోటు కలిపించిందని చెప్పారు. మరో దళితబిడ్డకు స్పీకర్ పదవి ఇచ్చి గౌరవించిందని ఆయన అన్నారు. కొత్తగా నియమితులైన మీ అందరికి పార్టీ చక్కని అవకాశం కల్పించింది. సద్వినియోగం చేసు కోవల్సిన బాధ్యత మీ అందరిపై ఉందన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో




# రాజ్యాంగాన్ని మార్చాలని బిజెపి కుట్రలు

### సామాజిక న్యాయసూత్రం అజెండాగా రాష్ట్రంలో పరిపాలన
### అభివృద్ధిని జీర్ణించుకోలేక ప్రభుత్వంపై
### బురదజల్లుతున్న బిఆర్ఎస్, బిజెపి పార్టీలు
### ఎల్‌బి స్టేడియంలో డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క

**హైదరాబాద్, జూలై 4, ప్రభాతవార్త:** దేశంలో ప్రస్తుతం ఒక సైదాంతిక పోరాటం జరుగుతుంది రాజ్యాంగాన్ని రక్షించాలని కాంగ్రెస్, ఇండియా కూటమి ఒక పక్కన, రాజ్యాంగాన్ని మార్చాలని బిజెపి, ఎన్డీఏ కూటమి మరో పక్కన పోరాటం చేస్తున్నాయని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు అన్నారు. శుక్రవారం ఆయన ఎల్బీ స్టేడియంలో పిసిసి ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన సామాజిక న్యాయ సభలో ప్రసంగించారు. గ్రామ శాఖ అధ్యక్షులతో సాక్షాత్తు ఏఐసిసి అధ్యక్షులు నేరుగా మాట్లాడేందుకు పిసిసి ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఏర్పాట్లు జరిగాయని తెలిపారు. భారత రాజ్యాంగం అంటే అది కేవలం ఒక పుస్తకం కాదు కొన్ని దశాబ్దాలుగా శతాబ్దాలుగా ఈ దేశ ప్రజల ఆలోచనలు, పూజ్య బాపూజీ, డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్, పూలే ఆలోచనలని రాజ్యాంగంలో పొందుపరిచి ప్రజల అవసరాల కోసం రూపొందించిన ఒక అద్భుత గ్రంథం భారత రాజ్యాంగం అని తెలిపారు. భారత రాజ్యాంగమే లేకపోతే ఈ దేశంలో పేదలు ,సామాన్యులు, గిరిజనులు, దళితులకు, బలహీన వర్గాలకు ఎటువంటి హక్కులు ఉండేవి కావు హక్కులు కేవలం రాజులు, రాజ్యాధికారం అనుభవించే కొద్ది మంది పెద్దలకు మాత్రమే దక్కేవి అన్నారు. అటువంటి పరిస్థితుల్లో దేశంలోని ప్రతి పౌరునికి సమాన హక్కులు, గౌరవాన్ని కల్పిస్తూ ఈ దేశ సంపద, అవకాశాలు దేశంలోని ప్రజలందరికీ సమానంగా ఉండాలని కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో గాంధీజీ, బాబాసాహెబ్ అంబేద్కర్ అందించిన అద్భుత గ్రంథం రాజ్యాంగం అన్నారు.ఇంతటి పవిత్ర గ్రంధాన్ని అమలు చేయాలని కాంగ్రెస్ పార్టీ నాయకులు పెద్ద ఎత్తున దేశవ్యాప్తంగా ముందుకు పోతున్నారు, రాజ్యాంగాన్ని నిలబెట్టుకోవడమే మనందరి భవిష్యత్తు అని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తెలిపారు.భారత రాజ్యాంగానికి చిన్న ఇబ్బంది జరిగిన దేశంలోని సామాన్యులు హక్కులు కోల్పోయే పరిస్థితి ఈ దేశంలో దాపురిస్తాయి అన్నారు. అద్భుత గ్రంథమైన రాజ్యాంగ స్ఫూర్తితో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన పిలుపు మేరకు రాష్ట్ర ప్రజల అందరి ఆశీర్వాదంతో రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన నాటి నుంచి ఈరోజు వరకు ఆ సామాజిక న్యాయ సూత్రాన్ని అమలు చేసేందుకు అనేక రకాల సంక్షేమ కార్యక్రమాలను రాష్ట్రంలో తీసుకువచ్చిందని డిప్యూటీ సీఎం వివరించారు. రాష్ట్రంలోని ప్రతి గ్రామం నుంచి వచ్చిన పార్టీ నేతలు ప్రజా ప్రభుత్వం ఏడాదిన్నర కాలంలో చేపట్టిన అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను గడపగడపకు తీసుకువెళ్లాలని పిలుపునిచ్చారు. పది సంవత్సరాలపాటు ఈ రాష్ట్రాన్ని పరిపాలించిన టిఆర్ఎస్ అడ్డగోలుగా దోపిడీకి పాల్పడింది, బిజెపి ఈ రాష్ట్ర ప్రజలను పట్టించుకోలేదు ప్రస్తుతం ప్రజా ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను జీర్ణించుకోలేక అవాకులు చవాకులు పేలుతున్నారని విమర్శించారు.

## అసెంబ్లీ మీడియా అడ్వయిజరీ కమిటీ ఏర్పాటు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి,హైదరాబాద్, జూలై 4:** తెలంగాణ అసెంబ్లీ మీడియా అడ్వయిజరీ కమిటీ (ఎంఏసీ)ని రాష్ట్ర శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, శాసన మండలి ఛైర్మన్ సుఖేందర్ రెడ్డి ఏర్పాటు చేశారు. కమిటీ ఛైర్మన్‌గా ఐరెడ్డి శ్రీనివాస్ రెడ్డి, కోఛైర్మన్‌గా పోలోజు పరిపూర్ణాచారిని నియమించారు. ఈ కమిటీలో 13 మంది సభ్యులు ఉంటారని రాష్ట్ర శాసన సభ సంయుక్త కార్యదర్శి సీహెచ్. ఉపేందర్ రెడ్డి శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ కమిటీ కాలపరిమితి రెండేళ్లు అని పేర్కొన్నారు. ఈ కమిటీలో ఐతరాజు రంగరావు, బొడ్లపాటి పూర్ణచంద్రరావు, లక్కడి వెంకట్ రామ్‌రెడ్డి, పోలంపల్లి ఆంజనేయులు, ఎం.పవన్‌కుమార్, భీమనపల్లి అశోక్, బుర్ర ఆంజ నేయులుగౌడ్, సురేఖ అబ్బూరి, మహమ్మద్ నయీం వజాహత్, బసవ పున్నయ్య, ప్రమోద్‌కుమార్ చతుర్వేది, సుంచు అశోక్, బి.హెచ్ ఎం.కే గాంధీలను సభ్యులుగా నియమించారు.

## వాయిస్ ఫర్ ది వాయిస్‌లెస్ సదస్సు

### పాల్గొన్న సుప్రీంకోర్టు జస్టిస్ సూర్యకాంత్, సిఎం రేవంత్‌రెడ్డి

**హైదరాబాద్, జూలై 4, ప్రభాతవార్త:** బాలలను లైంగిక నేరాలపట్ల రక్షించడం, వారి హక్కులు వాయిస్ ఫర్ ది వాయిస్‌లెస్ అనే అంశంపై శని, ఆది వారాల్లో 2 రోజులు పాటు రాష్ట్రస్థాయి స్టేక్‌హోల్డర్ల సదస్సు మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల సంస్థలో నిర్వహిస్తున్నారు. శుక్రవారం జరిగిన ప్రారంభోత్సవ సదస్సులో సుప్రీంకోర్టు జస్టిస్ సూర్యకాంత్ ముఖ్యఅతిధిగా హాజరయ్యారు. ముఖ్య మంత్రి రేవంత్‌రెడ్డి, హైకోర్ట్ చీఫ్‌జస్టిస్ సుజోయ్‌పాల్, డీజీపీ జితేందర్, ప్రభుత్వ మహిళా, శిశు సంక్షేమ శాఖ కార్యదర్శి అనిత రామచంద్రన్ ,యూనిసెఫ్ చీఫ్ ఫీల్డ్ ఆఫీసర్ డాకట్ జలాలెం టిఫన్స్, రాష్ట్ర లీగల్‌సెల్ అథారిటీ కార్యదర్శి పంచాక్షరీలు కూడా హాజరవు తారు. వివిధ అంశాలపై ఈ రెండు రోజుల సదస్సులో జరిగే చర్చల్లో పలువురు ప్రముఖులు పాల్గొంటారు.

# ఎవరు వెళ్లినా పార్టీకి పోయేదేం లేదు

### రాజ్యాంగాన్ని కాంగ్రెస్ ఖూనీ చేసింది

### బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు



**హైదరాబాద్, జూలై 4, ప్రభాతవార్త:** తెలంగాణ బిజెపిలోని అసమ్మతి నేతలపై ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు మరోసారి హాట్ కామెంట్స్ చేశారు. బిజెపిలో ఎంత పెద్ద నాయ కుడు అయినా పార్టీ సిద్ధాంతానికి, క్రమశిక్షణకు కట్టుబడి ఉండాల్సిందేనని స్పష్టం చేశారు. పార్టీ నిబంధనలను, క్రమశిక్షణను మీరితే చర్యలు తప్పవని హెచ్చరించారు. పార్టీ కంటే ఎవరూ ఎక్కువ కాదని,ఎవరు పార్టీ నుంచి వెళ్లిపోయినా పెద్ద నష్టమేం లేదని తేల్చి చెప్పారు.ఒకప్పుడు భారతీయ జనసంఫ్ వ్యవస్థాపకుడు బల్ రాజ్ మధోక్ కూడా పార్టీ నియమాలను మీరితే సస్పెండ్ చేశారనే విషయాన్ని అందరూ గుర్తుపెట్టు కోవాలన్నారు. అయితే ఇటీవల పార్టీకి రాజీనామా చేసిన గోషామహల్ ఎమ్మెల్యే రాజా సింగ్ గురించే రామచందర్‌రావు పరోక్షంగా ఈ వ్యాఖ్యలు అని రాజకీయ వర్గాల్లో చర్చ నడు స్తోంది. న్యాయాన్ని, రాజ్యాంగ విలువలను ఖూనీ చేసింది కాంగ్రెస్‌పదే పదే ప్రజలను మభ్యపెట్టే నినాదాలు చెప్పే కాంగ్రెస్.. వాటికి విరుద్ధంగా పనిచేయడమే తన నిజమైన ధోరణి. సామాజిక న్యాయానికి తూట్లు పొడుస్తున్న కాంగ్రెస్ 'సామాజిక న్యాయ సమరభేరి' అంటూ మరోసారి తెలంగాణ ప్రజ లను మాయ చేయాలని రామ చందర్‌రావు ఆరోపిం చారు. ఏడాదిన్నర పాలనలో ఒక్క హామీని కూడా సమర్థంగా అమలు చేయ లేక పోయిన ప్రభుత్వం.. ప్రజలకు ఏం సమాధానం చెబుతుందని ప్రశ్నిం చారు. జై బాపు అంటూ నినాదాలు చేస్తున్న కాంగ్రెస్ పార్టీ,గాంధీజీ కలల గ్రామ స్వరాజ్యాన్ని నిర్వీర్యం చేసిందని ఆయన విమర్శించారు. రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికలు జరపకపోవడం, గ్రామాభివృద్ధి పనుల బిల్లులకు రూ.1,200 కోట్లు పెండింగ్ లో పెట్టడం ఇవన్నీ గాంధీజీ స్ఫూర్తికి విరుద్ధమన్నారు. 'జై భీమ్' అంటూ నినదిస్తున్న కాంగ్రెస్, వాస్త వంగా లగచర్ల, కొండగల్ వంటి ప్రాంతాల్లో గిరిజనుల భూములు లాక్కొని,పోడు భూములపై బుల్డోజర్లు పంపి,ఎస్టీ రైతులపై కేసులు బనాయించి, గురుకులాల మూసివేతలతో దుర్మార్గంగా వ్యవహరించిందన్నారు. "జై సంవిధాన్' అని పఠించే ముందు కాంగ్రెస్ పార్టీ తన చరిత్రను గమనిం చాలన్నారు. 1975లో ఎమర్జెన్సీ విధించి ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసిన పార్టీకి రాజ్యాంగంపై బోధనలు చెప్పే అర్హత లేదన్నారు.ఇవన్నీ మరిచినట్టుగా మల్లికార్జున ఖర్గే తెలంగాణకు వచ్చారు.కానీ ప్రజల మనసులో ఉన్న అసలైన ప్రశ్న ఒక్కటే.. ఖర్గే, కాంగ్రెస్ పార్టీ ఏ మొహం పెట్టుకుని సభ నిర్వహిస్తోందని నిలదీశారు. ఇంకా దోచుకోవడానికి ఏమి మిగిలింది? కర్ణాటక, హిమాచల్‌ప్రదేశ్, తెలంగాణ.. ఈ మూడు రాష్ట్రాలూ కాంగ్రెస్ దోపిడీకి అక్షయపాత్రలుగా మారాయని ఆయన ఆరోపించారు. తెలంగాణలో 6 గ్యారంటీలు,13 హామీలు అంటూ భారీగా హడావుడి చేసిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటివరకు ఏ హామీని పూర్తిస్థాయిలో అమలు చేయలేకపోయిందన్నారు. కుల గణన పేరిట బిసిలకు అన్యాయం చేసి, ముస్లింలను బిసి కోటాలో చేర్చడమే కాంగ్రెస్ సామాజిక న్యాయమా అని ప్రశ్నించి ఆయన కాంగ్రెస్ హామీలు మాటలకే పరిమితమై పోయాయని, మాయ నినాదాలతో ప్రజలను మోసం చేయడమే ఈ ప్రభుత్వ ధోరణి అన్నారు. కాంగ్రెస్ ఈ సభ నిర్వహించేది సామాజిక న్యాయం కోసం కాదు.. సామాజిక న్యాయానికి తూట్లు పొడవడానికే. తెలంగాణ ప్రజలు మళ్లీ మోసపోరని ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

## గ్రామ, రాష్ట్ర కమిటీలతో చారిత్రాత్మక సమావేశం

### పిసిసి చీఫ్ మహేష్‌కుమార్‌గౌడ్

**హైదరాబాద్, జూలై 4, ప్రభాతవార్త:** దేశ చరిత్రలో మొదటిసారిగా గ్రామ స్థాయి అధ్యక్షులు మొదలు కొని రాష్ట్ర స్థాయి కార్యవర్గ సభ్యులకు దిశా నిర్దేశం చేయడానికి ఎఐసిసి అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే ఒక బహిరంగ సభలాంటి సమావేశం పెట్టడం నిజంగా చారిత్రాత్మకం అని టిపిసిసి చీఫ్ మహేష్‌కుమార్ అన్నారు. సామాజిక న్యాయ సమరభేరి సభలో టిపిసిసి చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ మల్లికార్జున్ ఖర్గే సామాన్యస్థాయి నుంచి పార్టీ అత్యున్నత స్థాయికి చేరినారని ఆయన కొనియాడారు. కర్ణాటకలోని బీదర్‌లో ఒక దళిత కుటుంబంలో జన్మించి, బాల్యంలోనే మత కలహాల్లో తల్లిని కోల్పోయారని వివరించారు. ఆ ఘటన ఆయనను జీవితాంతం సెక్యులరిజం, సామాజిక న్యాయం, సామరస్యానికి ప్రతీకగా నిలిచేలా మలిచిందని గుర్తుచేశారు. విద్యార్థి దశ రాజకీయాలు, కార్మిక సంఘాల ఉద్యమాల వరకు ఖర్గే ఎప్పుడు కూడా ప్రజలతో సంబంధాలను కొనసాగిస్తూ వస్తున్నారని అన్నారు. ఖర్గే వరుసగా తొమ్మిది సార్లు ఎమ్మెల్యేగా, అనంతరం లోక్‌సభ, రాజ్యసభ సభ్యుడిగా ఎన్నుకోబడ్డారు. రైల్వే, కార్మిక, సామాజిక న్యాయం వంటి కీలక శాఖలకు మంత్రిగా పని చేశారు. శరత్‌పవార్‌తోపాటు ఖర్గే సుదీర్ఘ రాజకీయ అనుభవం కలిగిన వ్యక్తులని దేశంలో వీరిని మించిన సీనియర్లు లేరని అన్నారు.


BEFORE THE HON'BLE DEBTS RECOVERY TRIBUNAL-II
1ST FLOOR, TRIVENI COMPLEX, ABIDS, AT: HYDERABAD,
O.A. No. 143 OF 2025

ICICI BANK LIMITED ...Applicant
AND
TUSHAR ADHIKESHAVAN PILLAY ...Defendant(s)

SUMMONS BY WAY OF PAPER PUBLICATION

To,
1. Tushar Adhikeshavan Pillay S/o. Manikyam Pillay Adhikeshavan, Aged about: 43 Year, Occ. Business, R/o: H. No. 5-100735, Plot No. 230, Road No. 06, Shridham Hills, Near More Super Market, Ameenpur, Medak Dist 502032 TS
Also At: Tushar Adhikeshavan Pillay S/o. Manikyam Pillay Adhikeshavan, Aged about: 43 Year, Occ. Business, R/o. Plot No. 41, Hitech City Madhapur, Hyderabad- 500081 TS ...Defendants

Please take the summons in the above O.A.No. 143 of 2025 filed by the Applicant for Recovery of money Rs. 44,17,871.64 Ps/- against you. The Hon'ble Tribunal ordered summons to you by way of paper publication in "VARTHA" a Telugu Daily newspaper, and posted the matter on 04.08.2025 In accordance with sub-section (4) of section 19 of the Act, you, the defendants, are directed as under:
i) To show cause within thirty days of the service of summons as to why the relief prayed for should not be granted;
ii) To disclose particulars of properties or assets other than properties and assets specified by the applicant under serial number 3A of the Original application; You are restrained from dealing with or disposing of secured assets or such other pending hearing and disposal of the application for attachment of properties;
iii) You shall not transfer by way of sale, lease or otherwise, except in the ordinary course of his business any of assets over which security interest in created and/or other assets and properties specified or disclosed under serial number 3A of the original application without the prior approval of the Tribunal;
V) You shall be liable to account for the sale proceeds realized by the sale of secured assets of other assets and properties in the ordinary course of business and deposit such sale proceeds in the account maintained with the bank or financial institutions holding security interest over such assets.
You are hereby required to show cause on 04.08.2025 at 10.30 am at Debts Recovery Tribunal-II, 1st floor, Triveni Complex, Abids, Hyderabad- 500001, in person or by an Advocate duly instructed as to why the relief prayed for should not be granted.
Take notice that in case of default, the Application will be heard and determined your absence 02nd Day of July,2025.

(By order of the Court)
Registrar
Debts Recovery Tribunal- II
Hyderabad


## పొలిటికల్ పార్టీలకు ఇసి షోకాజ్ నోటీసులు జారీ

**హైదరాబాద్, జూలై 4, ప్రభాతవార్త :** రాష్ట్ర ఎన్నికల సంఘం కీలక నిర్ణయం తీసుకుంది. ఎన్నికల సంఘం నుంచి రాజకీయ పార్టీగా గుర్తింపు పొంది గత 6సంవత్సరాలుగా ఏ ఎన్నికల్లో పోటీ చేయని పార్టీలను రాజకీయపార్టీల జాబితానుంచి తొలగించేందుకు సిద్ధమైంది.ఈమేరకు మీ పార్టీల పేరును రిజిస్టర్డ్ పార్టీల జాబితానుంచి ఎందుకు తొలగిం చకూడదో వివరణ ఇవ్వాలంటూ తెలంగాణలోని13 పొలిటికల్ పార్టీలకు శుక్రవారం రాష్ట్రఎన్నికలసంఘం షో కాజ్ నోటీసులు జారీ చేసింది.ఈ విషయంలో చర్యలు తీసుకు నేందుకు ఈ 13పార్టీలకు నోటీసులు ఇవ్వాలని ఆయా జిల్లాల ఎన్నికల అధికారులు, జిల్లా కలెక్టర్లకు రాష్ట్ర ఎన్నికల సంఘం సూచించింది.పార్టీల

## రాష్ట్రంలో రిజిస్టర్డ్ రాజకీయ పార్టీల జాబితా నుంచి 13 పార్టీల తొలగింపు

పేరుతో దినపత్రికల్లో ప్రకటనలు, సోషల్ మీడియాలో ప్రచారం చేయడంతో పాటు సంబంధింత పార్టీని జాబితా నుంచి తొలగించాలా వద్దా అనే దానిపై స్పష్టమైన సిఫార్సులతో కూడిన ప్రతిపాదనలను ఈ నెల 10వతేదీ లోపు సమర్పించాలనిఆదేశించింది.

జిల్లా అధికారుల నుంచి వచ్చే నివేదికను కేంద్రఎన్నికల కమిషన్‌కు పంపనున్నట్లు రాష్ట్రఎన్నికల ప్రధానాధికారి సుదర్శన్‌రెడ్డి పెర్కొన్నారు. ఎన్నికల కమిషన్ నుంచి షోకాజ్ నోటీసులు అందుకున్న పార్టీలు ఇవే... తెలంగాణ కార్మిక రైతు రాజ్యం పార్టీ (పార్టీ కార్యాలయం ఉన్న జిల్లా హన్మకొండ),ఇండియన్ మైనార్టీస్ పొలిటికల్ పార్టీ (హైదరాబాద్), జాగో పార్టీ( హైదరా బాద్), నేషనల్ పీపుల్స్ కాంగ్రెస్ (హైదరాబాద్), తెలంగాణ లోక్‌సత్తా పార్టీ (హైదరాబాద్), యువ పార్టీ(హైదరాబాద్), బహుజన్ సమాజ్ పార్టీ (అంబేద్కర్ పూలే) మేడ్చెల్ మల్కాజిగిరి, తెలంగాణ స్టూడెంట్స్ యునైటెడ్‌ఫర్ నేషన్ పార్టీ(మేడ్చల్ మల్కాజిగిరి), ఆంధ్రప్రదేశ్ సమైక్య సమితి పార్టీ( రంగారెడ్డి), జాతీయ మహిళా పార్టీ (రంగారెడ్డి), యువ తెలంగాణ పార్టీ(రంగారెడ్డి), తెలంగాణ ప్రజా సమితి (కిషోర్‌రావు వరంగల్).

# మహబూబాబాద్ జిల్లాలో ఘోరప్రమాదం

### ఎదురుదురుగా ఢీకొన్న రెండు లారీలు.. ముగ్గురు సజీవదహనం



**మహబూబాబాద్ బ్యూరో, ప్రభాతవార్త:** రెండు లారీలు ఎదురుదురుగా ఢీకొని ముగ్గురు సజీవ దహనం అయిన విషాదకర సంఘటన శుక్రవారం తెల్లవారు జామున మహబూబాబాద్ జిల్లాలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలం ఎల్లంపేట స్టేజ్ సమీ పంలో జాతీయ రహదారి 563పై తెల్లవారు జామున ఎదురెదురుగా వస్తున్న గ్రానైట్ లారీ, కోళ్ల దాన బస్తాల లారీ ఢీ కొనడంతో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. దీంతో రెండు లారీ క్యాబిన్ లలో ఇరుక్కున్న ఇద్దరు డ్రైవర్లు, ఒక క్లీనర్ మంటల్లో సజీవ దహనం అయ్యారు. మరో వ్యక్తికి తీవ్రగాయాలు కావడంతో ఆసుపత్రికి తరలించారు. స్థానికులు అగ్నిమాపక శాఖకు సమాచారం ఇవ్వడంతో సిబంది వచ్చి మంటలు అర్పారు. పోలీస్ లు సంఘటన స్థలానికి చేరుకొని ప్రమాద సంఘటన ను పరిశీలించి దర్యాప్తు చేస్తున్నారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.


తెలంగాణ ప్రభుత్వం
గుండ్ల పోచంపల్లి మునిసిపాలిటీ కార్యాలయం, మేడ్చల్ - మల్కాజిగిరి జిల్లా
mc.gundlapochampally@gmail.com

క్ర.సం.1. నిట్ నం. E1/49/NIT/MCG/2024-25 వివరణ : GPM లో రూఢీ అయిన పని చేపట్టడం (01) అంచనా వల: 10.00 లక్షలు. బిడ్స్ స్వీకరణకు ప్రారంభ/చివరి తేదీ మరియు సమయం : డౌన్‌లోడ్ ప్రారంభ తేది: 04.07.2025 మ.03.20గం. బిడ్ స్వీకరణకు చివరి తేది మరియు సమయం: 11.07.2025 మ.3.20గం. తదుపరి వివరాలకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండర్ ప్లాట్ ఫారం అనగా https://tender.telangana.gov.in వీక్షించండి లేదా గుండ్లపోచంపల్లి మున్సిపల్ కార్యాలయం సంప్రదించండి.
సం/-. కమిషనర్, గుండ్లపోచంపల్లి మునిసిపాలిటీ.
DIPR.NO. 4623-PP/CL/ADVT/1/2025-26 తేది: 04.07.2025

తెలంగాణ ప్రభుత్వం
పెద్ద అంబర్‌పేట మునిసిపాలిటీ కార్యాలయము, రంగారెడ్డి జిల్లా
ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండర్ ప్రకటన
Lr.No. MCA/E1/159/2025-6 తేది: 03.07.2025
పెద్ద అంబర్‌పేట మునిసిపాలిటీలో నిర్వహణ పనులకు MPLADS/జనరల్ నిధి క్రింద రూ.30.00 లక్షల విలువైన అభివృద్ధి పనులు (6 సం.లు) చేపట్టడానికి నమోదిత కాంట్రాక్టర్ల నుండి https://tender.telangana.gov.in/ ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండర్ ప్లాట్‌ఫారంపై ఇందుమూలముగా ఆన్‌లైన్ టెండర్లు కోరబడుతున్నవి. దానిలో నిర్వహణ పనులకు బిడ్ ముగింపు తేదీ, ప్రారంభం యొక్క తేదీ నుండి మూడు రోజులు ఉంటుంది మరియు మిగిలిన పనులకు తేదీల యొక్క షెడ్యూల్ ఈ విధంగా:- 1) బిడ్ యొక్క ప్రారంభం: 05.07.2025 ఉ.10.00 గం. వద్ద. 2) బిడ్ ముగింపు: 12.07.2025 మ.2.00 గం. వద్ద. 3) బిడ్ మూల్యాంకనం: 12.07.2025 మ.2.30 గం. వద్ద. మరి ఏ ఇతర వివరాలకైనా మునిసిపల్ కమిషనర్ వారిని కార్యాలయ వేళలలో సంప్రదించవచ్చును.
సం/- మునిసిపల్ కమిషనర్, పెద్ద అంబర్‌పేట మునిసిపాలిటీ
DIPR.No.4575-PP/CL/Advt/1/2025-26, తేది: 04.07.2025

వార్త

చక్కగా ఆలోచించడం, మితంగా మాట్లాడటం, మితంగా తినడం అలవర్చుకోవాలి.

-ఆర్. షోకాల్డ్

# జిన్‌పింగ్ ప్రస్థానానికి తెర!

బీజింగ్ ప్రీమియర్‌గా ఇన్నాళ్లూ ఏకచ్ఛత్రాధిపత్యం వహించిన చైనా అధ్యక్షుడు జీ జిన్‌పింగ్ ఎక్కడున్నారో వెతుక్కోవడానికి చైనా ప్రజలు ఆపసోపాలు పడుతున్నారు. పన్నెండేళ్ల పాటు ఆయన పాడిందే పాట, ఆడిందే ఆట. ఏ దేశం మీద ఎలాంటి వ్యూహాలు పన్నినా, ఎలాంటి విధానాలు అవలంబించినా ఆయన మాటకు ఎంతో విలువుండేది. ఎందుకో ఆయన ఈ మధ్య చైనా అంతర్గత పాలనా మండలి సమావేశంలో అంతకన్నా అత్యంత కీలక సమావేశాల్లోనూ కనపడటం లేదు. ఆయన గొంతు వినపడడం లేదు. త్వరలో జరగనున్న 'బ్రిక్స్' శిఖరాగ్ర సదస్సులో ఆయన పాల్గొంటారా లేదా! అన్న అంశంపై రకరకాల ఊహాగానాలు వెలువడుతున్నాయి. బ్రెజిల్, రష్యా, భారత్, చైనా, దక్షిణాఫ్రికా, ఈజిప్టు, ఇథియోపియో, ఇరాన్, సౌదీ అరేబియా, యుఎఇల వంటి దేశాలతో కొనసాగుతున్న 'బ్రిక్స్' శిఖరాగ్ర సదస్సు బ్రెజిల్‌లోని రియో డి జనీరోలో జులై ఐదు నుంచి ఎనిమిది వరకు జరుగుతుంది. భారతప్రధాని నరేంద్రమోడీ కూడా పాల్గొంటారు. నిజానికి ఈసారి భారత్, చైనా అధ్యక్షుడు కలిసినప్పుడు ఎన్నో సౌహార్ద్ర సంబంధాలపై మాట్లాడుకోవాల్సి ఉంది. పాకిస్థాన్‌కు చైనా ఎంత దగ్గరనుకున్నా చూసి చూసి ఎవరికోసమో భారత్‌తో పేజీ తెచ్చుకోదు. చైనాకు అధ్యక్షుడెవరైనా వారిని చైనా కమ్యూనిస్టు పార్టీ చెప్పుచేతల్లోనే నడిపిస్తుంది. పాలనా వ్యవహారాల్లోనూ పార్టీ ఆదేశాలు లేకుండా అడుగు ముందుకు కదలదు. కొంత కాలంగా జీ జిన్‌పింగ్ ఆచూకీ తెలియనివ్వకుండా చైనా జాగ్రత్త పడుతోందంటే అక్కడ అధ్యక్ష మార్పు తప్పదేమో అనే సంకేతాలను ప్రపంచానికి పంపుతున్నట్లు అనుకోవాలా? అంటే ఔననే మాటే వినిపిస్తోంది. గత 'బ్రిక్స్' సమావేశంలో మోడి, జిన్‌పింగ్‌లు స్నేహపూర్వక వాతావరణంలో సఖ్యతతో మాట్లాడుకున్నాక భారత్, చైనాల మధ్య సజావుగానే వ్యవహారాలు నడుస్తున్నాయి. అందుచేత ఈసారి 'బ్రిక్స్' సమావేశాల్లో వారిద్దరి భేటీ జరిగితే ఇరుదేశాల మధ్య మరింత సఖ్యత వెల్లివిరుస్తుందని భావిస్తున్న తరుణంలో ఓ పెద్దాయన పాత్ర కనుమరుగవడం విశేషంగా చెప్పుకోదగినదే. చైనాలో జిన్‌పింగ్ చేపట్టిన సంస్కరణల నేపథ్యంలో ఆయన్ని ఈ శకపురుషునిగా అభివర్ణించిన సందర్భాలున్నాయి. సంస్కరణాభిలాషిగా చెప్పుకుంటారు. పరిపాలనాదక్షుడు కూడా. ఎంతున్నా ఎంతన్నా ఎలాంటి వారినైనా చైనా కమ్యూనిస్టు పార్టీ పక్కన పెట్టేయగలదు. దీనంతటికీ కారణం చైనాలో సామాజిక పరిస్థితుల్లో మార్పు వస్తోందని గమనించిన పార్టీ ఎలాంటి నిర్ణయం తీసుకోడానికైనా వెనుకాడదు. అక్కడి జీవన ప్రమాణాలు పడిపోవడంతో ప్రభుత్వం మీద జనానికి అసహనం పెరిగిపోతోంది. ప్రభుత్వంపై అసంతృప్తి చాపకింద నీరులాపెరుగుతోంది. కొన్ని ప్రాంతాల్లో నిరసన ప్రదర్శనలు జరుగుతున్నందున పార్టీ ప్రజల పక్షాన ఆలోచించడం తప్పడం లేదని ఓ వాదన. అంతేకాదు కమ్యూనిస్టు పార్టీ ఎంతబలంగా ఉన్నా అక్కడా పార్టీ నేతల్లో విబేధాలూ ఉంటాయి. రాజకీయాలు జరుగుతుంటాయి. పార్టీ వివిధకోణాల్లో ఆలోచించడానికి అంతర్గత రాజకీయాలు కూడా కారణమవుతుంటాయి. గత కొంతకాలం నాడు జరిగిన సందర్భాలను ఇప్పుడు గుర్తుచేసుకోవాలి. 2022లో సిపిసి మహాసభల నుంచి మాజీ అధ్యక్షుడు జింటావోను అవమానకర రీతిలో సాగనంపడానికి ప్రధాన కారణం జీ జిన్‌పింగ్ అనే అపప్రథ ఉంది. అది కమ్యూనిస్టుపార్టీల ఆలోచనా విధానమొక్కటేఎలాంటి మార్పునైనా ప్రకటిస్తుంది. అయినా జిన్‌పింగ్ మీదనే జింటావో తొలగింపు అపనింద పడింది. ఈసారిజింటావో వంతు వచ్చి జిన్‌పింగ్ ఉద్వాసనకు దారి చూపిస్తున్నారని చర్చ జరుగుతోంది. ఈ నేపథ్యంలోనే మరికొన్ని విషయాలు జిన్‌పింగ్ ఉద్వా సన ఖాయమనే భావనలను సృష్టించింది. జిన్‌పింగ్ మద్దతుదారులను, ప్రధానంగా జనరల్స్‌ను కీలక బాధ్యతల నుంచి తప్పిస్తున్నారు. జిన్‌పింగ్‌ను తప్పించేందుకు పార్టీ వ్యూహాత్మక వైఖరిని అవలంబిస్తోందని చెప్పాలి. ఇవన్నీ క్రోడీకరించి చూస్తే రేపోమాపో జిన్‌పింగ్ ఉద్వా సన సమాచారాన్ని పార్టీ అందించినాఆశ్చర్యపోనక్కర్లేదు. ఎవరున్నా ఎవరులేకున్నా కమ్యూనిస్టు దేశాల్లో 'పాలనాశూన్యత' అనే అంశానికి ప్రాధాన్యతఉండదు. చైనాలో జరుగుతున్నదీ అదే! ఈనెల 5-8 తేదీల్లో జరిగే 17వ బ్రిక్స్ సదస్సుకు జిన్‌పింగ్ హాజరుకాబోవడం లేదనే వార్త కమ్యూనిస్టు దేశాలనేకాక ప్రపంచ దేశాలను కదిలించింది. ఈ సదస్సుకు జీ జిన్‌పింగ్‌కు బదులు ప్రధాని లీక్వియాంగ్ హాజరవుతారని చైనా విదేశాంగ ప్రతినిధి వివరించారు. గత కొద్దిరోజులుగా జిన్‌పింగ్ ప్రభుత్వ పాలనలో స్వయం గా జోక్యం చేసుకుంటున్నారో లేదో అధికార నిర్ణయాల చర్చలోఉంటున్నారో లేదో తెలియదు కాని బహిరంగ అధికార కార్యక్రమాల్లో మాత్రం పాల్గొనడంలేదు. అలాగే జిన్‌పింగ్ ఫొటోలతోనూ, ప్రసంగాలతోనూ సందేశాలతో నూ నిండిపోయి కనిపించే 'పీపుల్స్ డైలీ' పత్రిక ప్రథమ పేజీలుకనీసం ఆయన ఫొటోలు లేకుండానే వెలుడుతున్నాయి. ఆయనకున్న వ్యక్తిగతభద్రతా సిబ్బందిని బాగా తగ్గించారు. ఆయన తండ్రి స్మారక కేంద్రానికి ఉన్న అధికా రిక హోదాను తొలగించారు. ద్వైపాక్షిక సమావేశాల్లోనూ జిన్‌పింగ్ ప్రస్తావన వినిపించడం లేదు. చైనాకు వచ్చే విదేశీ అధికార ప్రతినిధులు కానీ, పాలకులు కానీ వచ్చిన ప్పుడు చైనా కమ్యూనిస్టుపార్టీ సీనియర్ నేతలే ఆతిథ్యమిచ్చి సాగనంపుతున్నారు. జిన్‌పింగ్ జాడలేకపోవడంతో చైనా పాలనలో ఆయన శకం ముగిసిందనే సంకేతాలు వెలువడుతున్నాయి.

కొద్దిపాటి నిర్లక్ష్యం కూడా ఒక్కోసారి పెద్దపెద్ద సమస్యలను సృష్టిస్తుంది.



ఫ్రాంక్లిన్

కాలానికి మంచి, చెడు అని రెండు రకాలు లేవు. అలా మనం అనుకుంటామంతే.



నెపోలియన్

# ప్రజావాక్కు



## సమస్యగా మారుతున్న ఇ-వేస్ట్

**ఈ డిజిటల్** యుగంలో సాంకేతికత వేగంగా అభివృద్ధి చెందుతున్నప్పటికీ, ఎలక్ట్రానిక్ వ్యర్థాలు(ఈవేస్ట్) ఒక తీవ్రమైన సమస్యగా మారుతోంది. మొబైల్, కంప్యూటర్, టీవీ, ఫ్రిజ్ వంటి పరికరాల వినియోగం వేగంగా మారుతూఉండటం ఈసంక్షోభాన్ని మరింతపెంచుతోంది. కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి ప్రకారం, భారతదేశంలో 2023వ సంవత్సరంలో సుమారు 17 లక్షల టన్నుల ఈవేస్ట్ ఉత్పత్తి అయింది. అయితే, దీనిలో కేవలం 30 మాత్రమే అధికారికంగా ప్రాసెస్ చేయబడింది. మిగిలిన వ్యర్థాలు అనధికారిక రంగాల్లో సరైన భద్రతా చర్యలు లేకుండా నిర్మూలించబడుతున్నాయి. దీని వల్ల వాయు, జల, మట్టికాలుష్యం వంటి తీవ్రమైన సమస్యలు ఏర్పడుతున్నాయి. ఈవ్యర్థాలలో సీసం, పాదరసం, క్యాడ్మియం వంటి విషపదార్థాలు ఉంటాయి.

-సి.హెచ్. ప్రతాప్, శ్రీకాకుళం

## నిప్పులేందే పొగరాదు

**కాళేశ్వరం** కమిషన్ విచారణకు కెసిఆర్ హాజరై వివరణ ఇచ్చుకోవలసి వచ్చింది. అంతకు కెసిఆర్ మేనల్లుడు కూడా విచారణకు హాజరైఅధికారులు అడిగిన ప్రశ్నలకు జవాబులు ఇవ్వవలసి వచ్చింది. ఈ కార్‌రేసులో కోట్ల రూపాయల అవినీతికి పాల్పడ్డారంటు కెసిఆర్‌తనయుడిపై ఆరోపణలు వచ్చాయి. ఇక లిక్కర్ స్కాంలో కెసిఆర్ తనయ ఏకంగా జైలుకి వెళ్లవలసి వచ్చింది. ఇవీ కెసిఆర్ కుటుంబ చరిత్ర 9ఏళ్ల పాటుఅధికారంలో ఉండిరాష్ట్రాన్ని కెసిఆర్ కుటుంబం దోచుకుందని ప్రతిపక్షాల నాయకులు నిందిస్తున్నారు. అయితే తమపై వచ్చినవన్నీ నిందలేకాని నిజాలు కావని బిఆర్ఎస్ నాయకులు అంటున్నారు. వీరిలో ఎవరు కరెక్ట్, ఎవరు రాంగ్. ఏవి ఏమైనా పాలకులు నిజాయితీగా ఉండాలి.

-ఎం.శ్రీనివాస్, హైదరాబాద్

## లెక్చరర్ హోదా కల్పించాలి

**తెలంగాణ** రాష్ట్రంలో విద్యారంగంలో నూతన సంస్కరణలు ప్రవేశపెట్టాలని ప్రభుత్వం భావించడం చాలా సంతోషకరం. 12వ తరగతివరకు పాఠశాలవిద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహించాలి అని ప్రభుత్వం భావిస్తుంది. రాష్ట్రంలో ఉన్న జూనియర్, గురుకుల కళాశాలలో పని చేస్తున్న లెక్చరర్‌లకు ప్రత్యేకహోదా కల్పించాలి.

-ఈదునూరి వెంకటేశ్వర్లు, వరంగల్ జిల్లా

## వీరు అవినీతిపరులేనా?

**గత యేడాది** జరిగిన అసెంబ్లీ లోక్‌సభ ఎన్నికల సమయంలో బిజెపి అగ్రనాయకులు రాష్ట్రానికి వచ్చి అవినీతికి తెలంగాణ కేరాఫ్ అడ్రస్‌లా అయిందని ఇంతటి అవినీతి ప్రభుత్వాన్ని ఎప్పుడూ ఎక్కడా తాము చూడలేదని ముఖ్యమంత్రి కెసిఆర్ అవినీతి సామ్రాట్ అని ఆయన కనుసన్నల్లోనే అవినీతి జరుగుతోందని, ఆయన భాగోతాన్ని బయటపెడతామని కెసిఆర్ జైలుపాలు చేస్తామని, కెసిఆర్‌పై ఎన్నో విమర్శలు చేస్తూ నిప్పులు చెరిగారు. అలాగే కాంగ్రెస్ మాజీ మంత్రులు, ఎంపిలు అవినీతి పరులని వారిపై కూడా తరచూ విమర్శలు చేస్తుంటారు. వీరిని అది చేస్తాం, ఇది చేస్తాం ఏదో చేస్తాం అంటూ ఒంటికాలుపై లేస్తుంటారు. అయితే కెసిఆర్‌ని గాని, కాంగ్రెస్ నాయకులను గాని బిజెపివాళ్లు ఏమీ చేయలేకపోతున్నారు. దర్యాప్తు సంస్థలతో వారు చేసిన తప్పులు బహిర్గతం చేయాలి. వారికి శిక్ష పడేలా చేయాలి.

-ఎమ్.ఎస్.శర్మ, హైదరాబాద్

## ప్రొఫెసర్ పోస్టులను భర్తీ చేయాలి

**నేడు దేశంలోని** అనేక ప్రతిష్టాత్మక యూనివర్సిటీలలో ఐఐటీయన్ ఐటీ విద్యా సంస్థలలో సగానికి పైగా ప్రొఫెసర్ ఉద్యోగాలు భర్తీకి నోచుకోకపోవడం మూలంగా ఆయా ఉన్నత విద్యా సంస్థలలో విద్యాబోధనకు తీవ్రప్రతిబంధక పరిస్థితులు తలెత్తుతున్నాయి. విద్య, మహిళలు, పిల్లలు, యువత, క్రీడలపై ఏర్పాటు చేసిన పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ పార్లమెంటులో ప్రవేశపెట్టినఉన్నత విద్యాశాఖ 2025-26డిమాండ్స్ ఫర్ గ్రాంట్స్ నివేదిక ఈ విషయాన్ని వెల్లడి చేసింది. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఖాళీలని గుర్తించి ప్రొఫెసర్ పోస్టులను బర్తీ చేయాలి.

-కామిడి సతీష్ రెడ్డి, భూపాల్ పల్లి జిల్లా

## న్యాయ విచారణ చేపట్టాలి

మెయింటనేన్స్ లేక గాలిలోనే ప్రాణాలను కలిపేస్తున్న విమాన ప్రమాదాలు, ట్రాఫిక్ రూల్స్ పాటించకుండా పాతబడిన బస్సులలో, రైళ్లలోప్రమాదాలలో కోల్పోతున్న ప్రాణాలు. మొన్న సీగాచి లోజరిగిన రియక్టర్ పేళ్లలు. మానేజ్మెంట్ ఎలాంటి రియాక్టర్లును చిరకాలంగా వాడుతోంది, మైంటెనెన్స్‌కి పనికి వచ్చేవేనా, లేదా డిసకార్డ్ చేసి కొత్తవి పెట్టాలా. వీటి గురించి ఎవ్వరూ మాట్లాడరు. ముందు ప్రాణాలు పొట్టన పెట్టుకుంటున్నారు. న్యాయవిచారణజరపించరు. ఇదిఅసలుజరగనే జరగదు.

-గార్లపాటి సీతారామయ్య, హైదరాబాద్

మనవి

ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)

# గిట్టుబాటు కాకపోతే జరుగుబాటెట్లా?

***ఎన్నో సమస్యలతో అతలాకుతలమవుతున్న రైతాంగంపై కూలీల కొరత మోయలేని భారంగా తయారైంది. ఉపాధి హామీ పథకం ఏమేరకు, ఎంతవరకు ఉపయోగపడిందో ఏమోకానీ వ్యవ సాయరంగంపై తీవ్రప్రభావం చూపుతున్నది. వ్యవసాయరంగం మీదనేకాదు దాని అనుబంధ రంగాలైన పాడి, కోళ్ల పరిశ్రమలపై కూడా తీవ్రంగా పడింది. కేవలం కూలీల కొరతతో సాగు కావాల్సిన దేశవ్యాప్తంగా లక్షలాది ఎకరాలకు చెందిన రైతులు కాడి కింద పెట్టారు. ఎంత సాగు చేస్తే అంత నష్టం అన్నట్లు తయారైంది పరిస్థితి. వ్యవసాయానికి మంగళం పాడేందుకే రైతులు సిద్ధమైతే పరిస్థితి ఏమిటో విజ్ఞతతో ఆలోచించాలి. పొలాలు బీడుపడితే దేశం కడుపు నిండదు. పండించేవారు లేకపోతే పాలించేవారికి ముద్దపుట్టదనే విషయాన్ని విస్మరించకూడదు.***

దామెర్ల సాయిబాబ

భూమిని నమ్ముకున్నవారు ఎన్నటికీ చెడిపోరనేది పాత కాలపు నమ్మకంగా మారిపోయింది. గ్రామాల్లోఉంటూ భూమిపైనే ఆధారపడుతూ వ్యవసాయమే ఏకైక జీవనాధారంగా బతకడం ఒక శాపంగా పరిణమిస్తున్న దురదృష్టపు రోజులు దాపురించాయి. రైతు సంక్షేమమే ధ్యేయంగా వారి అభ్యున్నతికి ఏమి చేయడానికి అయినా వెనుకాడమని రాజకీయ పార్టీల నేతలు ఎంతగా చెబుతున్నా రైతులకు చేయూతనిచ్చేందుకు ఎన్ని కార్యక్రమాలు చేపడుతున్నా వ్యవసాయదారుల పరిస్థితి ఏమాత్రం మెరుగుపడడం లేదు. ఒకపక్క ప్రకృతి సహాయ నిరాకరణ, మరొకపక్క తోటి మానవుడు చేస్తున్న దోపిడీ, దగాలతో అన్నదాతలు రోజురోజుకు కృంగిపోతున్నారు. పిట్టల్లా రాలిపోతున్నారు. ఆత్మహత్యల పరంపరం కొనసాగుతూనే ఉన్నది. తెలుగు రాష్ట్రాలతోసహా దేశవ్యాప్తంగా ప్రధానంగా వ్యవసాయం గిట్టుబాటుకాక అప్పులు తీర్చే మార్గంలేక ఎందరో అన్నదాతలు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. తాము చేసే కష్టానికి తగినట్టుగా పండించిన పంటలకు గిట్టుబాటు ధర ఇప్పించమని దశాబ్దాల తరబడి పాలకులను వేడుకుంటున్నారు. ఐదేళ్లలో రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేస్తామని ప్రకటించిన కేంద్ర పాలకులు ఆదాయం సంగతి దేవుడెరుగు, పెట్టుబడిని రెండు మూడు, రెట్లు పెంచారని రైతులు వాపోతున్నారు. వాస్తవంగా వ్యవసాయరంగంలో పెట్టుబడులు విపరీతంగా పెరిగాయి. ఎరువులు, క్రిమిసంహారక మందుల దగ్గర నుంచి కూలీల రేట్లతోపాటు ప్రతి దశలోనూ ఖర్చులు ఊహించని రీతిలో పెరిగిపోయాయి. గతంలో ఒక ఎకరం వరిపొలం దుక్కి దున్నేందుకు గంటకు ఆరేడు వందల రూపాయలు ట్రాక్టర్‌కు చెల్లించేవారు ఇప్పడది పద్నాలుగు వందల నుండి పదిహేడు వందల తీసుకొంటున్నారు. కేంద్రం పెంచిన డీజల్ పెట్రోల్ ధరలు వ్యవసాయ రంగంపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. ఈ ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి కేంద్ర పాలకులు వరితోపాటు పద్నాలుగు పంటలకు కనీస మద్దతు ధరలు గత నెలలో ప్రకటించారు. అవి ఏమాత్రం ఆశాజనకంగా లేవు. క్వింటాలుకు వరికి అరవైతొమ్మిది రూపాయలు, జొన్నలకు మూడువందల ఇరవైఎనిమిది, సజ్జలకు నూటయాభై, మొక్క జొన్నలకు నూటయాభై, కందిపప్పుకు నాలుగు వందల యాభై, మినుములకు నాలుగువందలు, పెసర్లకు ఎనభైఆరు రూపాయలు, పొద్దుతిరుగుడుకు నాలుగువందల నలభైఒక్కటి పెంచారు. గతయేడాదితో పోలిస్తే ఇదితక్కువే. వాస్తవంగా ఒక వరి పంటనే తీసుకున్నా క్వింటాలు వరి ఉత్పత్తికి జాతీయ సగటు ఉత్పత్తి వ్యయం మూడువేల నూటముప్ఫైఐదు రూపాయలుగా రైతు సంఘాలు అంచనా వేస్తున్నాయి. కానీ కేంద్రం తాజాగా వరికి ప్రకటించిన కనీస మద్దతు ధర రెండువేల మూడువందల అరవైతొమ్మిది రూపాయలు మాత్రమే. అలాగే పత్తికి క్వింటాలుకు పదహారువేల రూపాయలు ప్రకటించాలని తెలంగాణ ప్రభుత్వం ప్రతిపాదిస్తే కేంద్రం ఏడువేల ఏడువందల పదిరూపాయలకు మాత్రమే పరిమితమైంది. దాదాపు అన్ని పంటలకు ఇదే పరిస్థితని చెప్పొచ్చు. తెలంగాణ ప్రభుత్వం వరికి క్వింటాల్‌కు ఐదువందల రూపాయలు ప్రకటించడం తెలంగాణలోని రైతులకు కొంతలో కొంత ఊరట కల్గించింది. మొత్తం మీద వ్యవసాయంలో లాభాల మాట అటుంచి పెట్టుబడులు వెళ్లని పరిస్థితులు దాపురించాయి. రాబోయే సీజన్‌లో విత్తనాల కొరత ఉండదు, సకాలంలో రుణాలను పంపిణీ చేస్తాం, ఎరువుల సమస్య రానేరాదు, అవసరానికి

## ఒక్క మాట

మించి అన్ని గోదాముల్లో నిల్వ ఉంచుతాం, ఏ రైతు విత్తనాలు, ఎరువులకు ఇబ్బంది పడకుండా చూస్తాం, నకిలీ, నాసిరకంపై ఉక్కుపాదం మోపి రైతులు మోసపోకుండా పకడ్బందీగా చర్యలు తీసుకుంటామని ఖరీఫ్ ముందు పాలకులు పెద్దపెద్ద మాటలు చెప్పడం ఆనవాయితీ అయిపోయింది. ఆ తర్వాత పరిస్థితి యథాతథమే. ఇదేదో ఈ ప్రభుత్వాలు వచ్చిన తర్వాత మొదలైందని చెప్పడం లేదు. ఏనాటినుంచో జరుగుతున్నది. అందుకే వ్యవసాయం రోజురోజుకు సంక్షోభంలో కూరుకుపోతున్నది. అధికారంలో ఉన్నవారు మాత్రం పైకి ఏమనలేకపోయినా ఇందుకు తాము బాధ్యులం కాదన్నట్లుగా వ్యవహరించడం ఆనవాయితీగా మారిపోయింది. ప్రతిపక్షంలో ఉన్నవారు ఈ ప్రభుత్వం చేస్తున్న హత్యలేనంటూ విమర్శలు కురిపించడం, పరామర్శించడం పరిపాటైపోయింది. వాస్తవంగా రైతుల సమస్యలు కొత్తగా పుట్టుకొచ్చినవి కాదు. నాయకులకు తెలియనివి కూడా కావు. అసలు వ్యవసాయ ప్రణాళిక ప్రారంభం నుండే లోపాలతో మొదలవుతున్నది. వ్యవసాయ, బ్యాంకు తదితర సంబంధితశాఖల ఉన్నతాధికారులు ఖరీఫ్ ప్రారంభానికి ముందే ఒక ప్రణాళికను తయారు చేసి సుదీర్ఘంగా చర్చించి ముసాయిదాను తయారు చేస్తారు. ఎరువులు ఎంత కావాలి? బ్యాంకుల నుంచి రుణాలు ఎంత ఇవ్వాలి? తదితర అంశాలన్నీ చర్చించి, పొందుపరిచి పక్కాప్రణాళిక తయారు చేసి ఆమోద ముద్ర వేస్తారు. అయితే ఈ ప్రణాళికను ఎవరికోసం ఉద్దేశించబడిందో, ఎవరు ఆచరించాలో ఆ రైతులకే తెలియదు. ఆ రైతు ప్రతినిధులకు అందులో ప్రవేశం ఉండదు. వారిని సంప్రదించే పద్ధతి కూడా లేదు. అధికారులు రాత్రింబవళ్లు కష్టపడి తయారు చేసిన ప్రణాళిక వాస్తవంగా సాగుకుచాలా సందర్భాల్లో పొంతన ఉండడం లేదు. వర్షాలు, నీటి ఆధారాన్ని బట్టి ఏయేరకం పంటలు ఎప్పుడు వేయాలి? ఏ విత్తనం వాడాలి. తదితర అంశాలు రైతులే ఆయా ప్రాంతాల పరిస్థితులను బట్టి నిర్ణయించుకుంటున్నారు. అందరూ ఊహించినట్టుగా రోహిణికార్తెలో వర్షాలు ఆరంభమై మృగశిర ఆరుద్ర కార్తెల వరకు చెరువులు, కుంటల్లోకి నీరు వస్తే వేసే వంగడాలు వేరు. ఆ వర్షాలు ఆలస్యమై నీరు సమృద్ధిగా లేకపోతే విత్తేవిత్తనాలు, పంటలు వేరు. ఇలా వర్షాల పరిస్థితులను బట్టి సాగు చేసుకుంటారు. ఇవన్నీ అధికారులకు తెలియంది కాదు. జీతభత్యాలు తీసుకుంటున్నారు కనుక వారిపాటికి వారు ఏవో తయారు చేసి ప్రభుత్వానికి సమర్పిస్తుంటారు. అందుకే క్షేత్రస్థాయిలో జరుగుతున్న ఈ ప్రణాళికలకు కొన్ని సందర్భాల్లో సంబంధం లేకుండాపోతుంది. పత్తిపెట్టవద్దు, ప్రాణం మీదకు తెచ్చుకోవద్దని ఎన్ని విధాలుగా చెప్తున్నా కూడా చావో బతుకో పత్తిలోనే తేల్చుకోవాలనే ధ్యేయంతో పత్తిసాగువైపే మొగ్గుచూపుతున్నారు. ఆత్మహత్యలు చేసుకుంటున్న రైతుల్లో పత్తి, మిర్చి తదితర వాణిజ్యపంటల రైతులే ఎక్కువ శాతం మంది ఉన్నారనే విషయం రికార్డులే వెల్లడిస్తున్నాయి. ఇక నకిలీ, నాసిరకం విత్తనాలు రైతుల ప్రాణాలు తీస్తున్నాయి. శ్రమంతా చేసి తలతాకట్టుపెట్టి, పెట్టుబడి అంతా పెట్టిన తర్వాత ఆ విత్తనం నకిలీదో, నాసిరకమై పంట దెబ్బతింటే ఆ రైతు ఒక్కసారిగా కుప్పకూలిపోతున్నాడు. అంతెందుకు గత ఐదేళ్లలో ఏయే విత్తనాల కంపెనీలు ఎన్నివేల క్వింటాళ్లు సరఫరా చేశాయో, వారికున్న మౌలిక వసతులు ఏమిటి? వారుఎక్కడి నుండి విత్తనాలు సేకరించారు? తదితర అంశాలుపరిశీలిస్తే, పరిశోధిస్తే విస్తుపోయే విషయాలు వెలుగులోకి వస్తాయి. ప్రతిసారి ఈ సీజన్‌లో నకిలీ, నాసిరకం విత్తనాలు విస్తృతంగా సరఫరా కావడం అధికారులకు పట్టుబడడం, కేసులు పెట్టడం జరుగుతున్నది. రైతులను మోసం చేసిన వ్యాపార సంస్థలపై చర్యలు తీసుకునేందుకు చట్టాలున్నా అవి దళారులకు ఉపయోగపడే విధంగా ఉన్నాయని ఆరోపణలు వినిపిస్తున్నాయి. వాటిని సవరించి రైతులను దగా చేసిన వ్యాపారులను ఉక్కుపాదంతో అణచివేసే విధంగా చట్టాన్ని సవరిస్తామని గత రెండు, మూడు దశాబ్దాలుగా పాలకులు చెబుతున్నా ఇంతవరకు ఆచరణకు నోచుకోలేదు. ఇలాంటి ఎన్నో సమస్యలతో అతలాకుతలమవుతున్న రైతాంగంపై కూలీల కొరత మోయలేని భారంగా తయారైంది. ఉపాధి హామీపథకం ఏమేరకు, ఎంతవరకు ఉపయోగపడిందో ఏమోకానీ వ్యవ సాయరంగంపై తీవ్రప్రభావం చూపుతున్నది. వ్యవసాయరం గం మీదనేకాదు దాని అనుబంధ రంగాలైన పాడి, కోళ్ల పరి శ్రమలపై కూడా తీవ్రంగా పడింది. కేవలం కూలీల కొరతతో సాగు కావాల్సిన దేశవ్యాప్తంగా లక్షలాది ఎకరాలకు చెందిన రైతులు కాడి కింద పెట్టారు. ఎంత సాగు చేస్తే అంత నష్టం అన్నట్లు తయారైంది పరిస్థితి. వ్యవసాయానికి మంగళం పాడేందుకే రైతులు సిద్ధమైతే పరిస్థితి ఏమిటో విజ్ఞతతో ఆలోచించాలి. పొలాలు బీడుపడితే దేశం కడుపు నిండదు. పండించేవారు లేకపోతే పాలించేవారికి ముద్దపుట్టదనే విషయాన్ని విస్మరించకూడదు. •

# ప్రాణాంతక వ్యాధులకు అపరిశుభ్రతే కారణం!

బుగ్గన మధుసూదనరెడ్డి

వర్షాకాలం రానే వచ్చింది, ఇక మనమంతా వ్యక్తిగత పరిశుభ్రత పాటించడంతో పాటు మన ఇంటిని, మన ఇంటి పరిసరాలను సైతం అత్యంత శుభ్రంగా పెట్టుకోవాల్సిన అవశ్యకత ఎంతైనా వుంది. ఎందుకంటే మనం ఈ వర్షాకాలంలో ఏమాత్రం అపరిశుభ్రతకు తావు ఇచ్చినా ఇంటి ఆవరణలోని గుంతలలోను, మనం తీసి పారేసిన వస్తువుల లోను మురికినీరు నిల్వ ఉండేందుకు ఏమాత్రం అవకాశం ఇచ్చినా అవి దోమలకు ఆనవాలుగా మారడంతో పాటు అవి మన ఇంటిలో తిష్టవేసి తద్వారా డెంగ్యూ, మలేరియా, చికెన్ గున్యా, డయేరియా వంటి వ్యాధులు మనపై దాడి చేసి మన రోగ నిరోధక వ్యవస్థను అత్యంత దారుణంగా చేసేందుకు ఎక్కువగా అవకాశం ఉంటుంది. ముఖ్యంగా దోమకాటు వల్ల ప్రబలే డెంగ్యూ వ్యాధి అత్యంత ప్రమాదకరమైనది. ఇది మనకు పొరపాటున సోకితే మాత్రం మనకు తీవ్ర తల నొప్పులు, కండరాల, కీళ్ల నొప్పులు రావడంతో పాటు, విరోచనాలు, వాంతులు, చర్మంపై దురదలు వంటివి ఏర్పడి ఒక్కొక్కసారి ఆ వ్యాధికి సకాలంలో చికిత్స తీసుకోకపోతే అది మనకు ప్రాణాంతకరంగా సైతం మారే ప్రమాదం పొంచి వుంది. ముఖ్యంగా ఈ సీజనల్ వ్యాధులు మన ఇంటిలోని చిన్నారులపై ఎక్కువగా ప్రభావం చూపి వారి ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతూ ఉంటాయి. అదేవిధంగా మన ఆరోగ్యాన్ని అస్తవ్యస్తం, అధోగతిపాలు చేసే ఈ సీజనల్ వ్యాధులు మన దరి



చేరకుండా ఉండాలంటే ఎప్పటికప్పుడు మన చేతులను శుభ్రం చేసుకుంటూ, మన ఇంటిలోకి దోమలు ప్రవేశించడానికి వీలులేకుండా దొంతెరలు, జెట్ వంటివి వాడుకుంటూ తగు జాగ్రత్తలు పాటిస్తే అది మనకు, మన కుటుంబ సభ్యుల ఆరోగ్య పరిరక్షణకు ఎంతగానో తోడ్పడుతుంది. అలాకాకుండా మనం తగు జాగ్రత్తలు తీసుకోకుండా ఎలా పడితే ఆలా వ్యవహరించి మన ఆరోగ్యం విషయంలో అత్యంత నిర్లక్ష్య వైఖరి అవలంబిస్తే మాత్రం అది మొదటికే మోసం వచ్చి డెంగ్యూ, మలేరియా, చికెన్‌గున్యా, డయేరియా వంటి వ్యాధులకు చేజేతులారా మనమే రహదారి చూపి అనవసరంగా ఆయా జబ్బులను కొని తెచ్చుకొని హాస్పిటల్స్ చుట్టూ తిరుగుతూ జేబులకు చిల్లులు పెట్టుకోవాల్సిన దుస్థితి దాపురించడం తథ్యం. ఏదిఏమైనా ఆరోగ్యమే మహాభాగ్యం అని మన పెద్దల నానుడిని ఎల్లవేళలా గుర్తుచేసుకుంటూ ఆరోగ్యాన్ని మరో పదికాలాల పాటు కాపాడుకోవాలంటే మాత్రం ఈ వర్షాకాలంలో ప్రబలే సీజనల్ వ్యాధులు మన దరి చేరకుండా అత్యంత అప్రమత్తంగా మసలుకోవడం ఇంటికి, వంటికి మంచిది. ఏమైనా ఈ వర్షాకాలంలో ఆరోగ్యం పట్ల ఏమాత్రం అశ్రద్ధ, నిర్లక్ష్యం కనబరచినా సీజనల్ వ్యాధులు చుట్టుముట్టి మనల్ని ఆసుపత్రుల పాలుచేయడంతో పాటు వేలాది రూపాయలు హారతి కర్పూరంలా ఖర్చు అయిపోయి ఆర్థికంగా సైతం చితికిపోయే ప్రమాదం పొంచి వుంది. కాబట్టి పరిశుభ్రత అనే ఆయుధానికి పెద్దపీటవేసి మనతోపాటు మన కుటుంబ సభ్యుల ఆరోగ్య పరిరక్షణకు పాటుపడదాం! •

# భారత్‌లో తగ్గిన బాలికల జననాల రేటు



మేకిరి దామోదర్

మన దేశం జనాభా పరంగా ఈ ఏడాది ప్రపంచంలోనే నెంబర్ వన్ (మొదటి) స్థానంలో కొనసాగుతోందని ఐక్యరాజ్య సమితి తెలిపింది. ఈ ఏడాది చివరి కల్లా జనాభా 146 కోట్ల చేరుకుంటుందని అంచనా వేసింది. అయితే జననాల రేటు నిర్దేశిత స్థాయి కంటే దిగువకు పడిపోయిందని వెల్లడించింది. గత నలభై ఏళ్ల తర్వాత తగ్గుముఖం పట్టినట్టు నివేదిక తెలుపుతుంది. భారత్‌లో జననాల రేటు1.9 శాతంగా ఉంది. ఏ దేశంలోనైనా సగటు రీప్లేస్మెంట్ రేటు కనీసం 2.1 శాతంగా ఉండాలి. కానీ భారత్‌లో సంతాన ఉత్పత్తి రేటు పడిపోయింది. జననాల రేటు తగ్గిపోయినప్పటికీ, భారతదేశ జనాభా సంఖ్య నిలకడగా కొనసాగుతుంది. ఇలా ఇంకొన్నాళ్లు కొనసాగి ఆ తర్వాత నుంచి జనాభా తగ్గుదల మొదలయ్యే అవకాశం ఉందని విశ్లేషించింది. మన దేశ జనాభాలో వయసుల వారిగా 68 శాతం జనాభా 15 నుంచి 64 ఏళ్లలోపు వయో వర్గానికి చెందినవారు. ఇది వర్కింగ్ ఏజ్ గ్రూప్, అత్యధిక జనాభా వర్కింగ్ ఏజ్ గ్రూపులో ఉండటం అనేది భారత్‌కు కలిసి వచ్చే అంశం. ఈ వయసులోని వారికి తగినన్ని ఉపాధి అవకాశాలు, ప్రభుత్వ విధానపరమైన మద్దతు లభిస్తే భారత్ ఆర్థికంగా మంచి పురోగతి సాధిస్తుంది. అలాగే 10 నుంచి 24 ఏళ్లలోపు వారు 26శాతం. 0 నుంచి 14 ఏళ్లలోపు వారు 24శాతం. 10 నుంచి 19 ఏళ్లలోపు వారు 17 శాతం మంది ఉన్నారు. అదేవిధంగా 65 ఏళ్లకు పైబడిన వారు భారత దేశంలో కేవలం 7శాతం మంది ఉన్నారు. ప్రజల ఆయుర్దాయాలు పెరుగుతున్నందున రాబోయే కొన్ని రోజుల్లో 65 ఏళ్ల పైబడిన వయోవర్గంలోని వృద్ధుల సంఖ్య మరింత పెరగవచ్చు. 2025 నాటికి భారతదేశంలోని పురుషుల సగటు ఆయుర్దాయం 71 ఏండ్లు కాగా, మహిళల సగటు ఆయుర్దాయం 74 ఏళ్లుగా ఉంది. మనదేశ మహిళల వల్లే ఈ మార్పు 1971 దశకం నాటికి మనదేశ మహిళల సగటు సంతానోత్పత్తి రేటు ఐదుగురు పిల్లల్ని కనడం. కానీ ఇప్పుడు పరిస్థితి మారిపోయింది. మహిళలు సగటున ఇద్దరు పిల్లలకే జన్మనిస్తున్నారు. ప్రెగ్నెన్సీ సమయంలో సంభవించే మరణాలు తగ్గిపోయాయి. ఈ విషయంలో వివిధ రాష్ట్రాలలో కులాలు, ఆదాయ వర్గాలు తేడాలు ఉన్నాయి. సంతానం ఎంతమంది ఉండాలనే దానిపై స్వేచ్ఛగా నిర్ణయం తీసుకునే హక్కు ప్రతి ఒక్కరికి ఉంది. అలాగే తెలంగాణ రాష్ట్రంలో బాలురుతో పోలిస్తే బాలికల జననాలు గణనీయంగా తగ్గుతున్నాయి. 2022లో ప్రతి 1000 మంది బాలురకు 907 మంది అమ్మాయిలు మాత్రమే జన్మించారు. ఈ మేరకు బాలురు, బాలికల జననాల నిష్పత్తి జాబితాలో తెలంగాణ దేశంలో దిగువ నుంచి మూడో స్థానంలో ఉంది. తెలంగాణ



తరువాత బీహార్ (891), మహారాష్ట్ర (906)లు మాత్రమే ఉన్నారు. ఏపీలో ఇది (938)గా నమోదయింది. ఈమేరకు దేశవ్యాప్తంగా 2022లో జనన మరణాల నివేదికను కేంద్ర జనాభా లెక్క విభాగం విడుదల చేసింది. అందులోని ప్రధాన అంశాలు 2022లో రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో బాలురు కంటే బాలికల జననాలు ఎక్కువగా ఉన్నవి. ముచ్చటగా మూడు మాత్రమే. ఆ మేరకు ప్రతి వెయ్యి మంది బాలురకు అత్యధికంగా నాగాలాండ్లో 1,068మంది. అరుణాచల్ ప్రదేశ్‌లో 1,036, లద్దాఖ్‌లో1,027 మంది బాలికలు జన్మించారు. కానీ తాజాగా 2023-24లోకి వచ్చేసరికి దేశంలో విద్యావంతులు పెరుగుతున్న లైంగిక వివక్ష, కరడుగట్టిన పితృస్వామ్య భావజాలం సమాజాన్ని వదిలిపోవడం లేదు. దాంతో అబ్బాయిల కంటే అమ్మాయిలు తక్కువ సంఖ్యలో ఉంటున్నారు. 2023-24 జాతీయ సగటు 1000 బాలురుకు/బాలికలు (930)తో పోలిస్తే చాలా రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో ఆడ శిశువుల జననాలు తక్కువే. అవి ఏవంటే (వెయ్యి మంది అబ్బాయిలకు అమ్మాయిల సంఖ్య) లక్షదీవులు 831, అండమాన్ నికోబార్ 832, బీహార్ 882, మహారాష్ట్ర 915, చండీగఢ్ 916, తెలంగాణ 917, హర్యానా 917, ఢిల్లీ 918, నాగాలాండ్ 919, పంజాబ్ 928, దాద్రా, నగర్ హవేలీ, ధమణ్, దీవ్ 924, గుజరాత్ 925, మధ్యప్రదేశ్ 929, మణిపూర్ 929, వెయ్యి మంది అబ్బాయిలకు గాను పైవిధంగా కేంద్ర పాలిత ప్రాంతాలు, వివిధ రాష్ట్రాల్లో అమ్మాయిల వ్యత్యాసం కొనసాగుతుండడం భారత సమాజానికి శ్రేయస్కరం కానే కాదు. (లోకసభలో కేంద్రం వెల్లడించిన వివరాలు) 2022లో తెలంగాణలో వెయ్యి మంది బాలురకు 907 మంది బాలికలతో తక్కువ నిష్పత్తి నమోదయింది. దేశంలో బాలురు 52.4 శాతం ఉంటే, బాలికలు 47.6 శాతంగా ఉంది. ఇలా బాలికల జననాల రేటు తగ్గిపోవడం ప్రమాదకర సంకేతమే. మహిళలను గౌరవించాలి, అన్ని చోట్ల వారికి సమాన అవకాశాలు కల్పించాలన్న ఉపన్యాసాలు మన దేశంలో వినసొంపుగా వినిపిస్తుంటాయి. సమస్త రంగాల్లో స్త్రీల భాగస్వామ్యం పెరగాలని అప్పుడే అభివృద్ధి పథంలో మనం దూసుకుపోతామని ప్రభుత్వాలు నిత్యం ప్రచారం చేస్తుంటాయి. కానీ ముఖ్యంగా సమాజంలో గుణాత్మక మార్పులకు సాహకారం చేసి రాజకీయ రంగంలో స్త్రీల వాటా వారి జనాభాకు తగినట్టుగా ఉందా! ప్రపంచ ఆర్థిక వేదిక తాజాగా విడుదల చేసిన లింగ సమానత్వ సూచి నేటికీ లేదని చెప్తుంది. అమలుకు నోచుకోని మహిళా రాజకీయ రిజర్వేషన్లు చూస్తున్నాం. ఆర్థిక కార్యకలాపాల్లో స్త్రీ, పురుషుల భాగస్వామ్యం, అందుకు లభిస్తున్న అవకాశాలు, విద్య, ఆరోగ్యం, జీవనస్థితిగతులు, రాజకీయ సాధికారత ప్రాతిపదికలుగా 148 దేశాల కేటాయించిన ర్యాంకుల్లో ఇండియా 131 స్థానంలో చతికిలబడింది. ఆధునిక సాంకేతిక యుగంలో కూడా ఇంకా వెర్రితలలు వేస్తున్న లింగ వివక్ష, పురుష ఆధిపత్య చట్రంలోంచి బయట పడలేకపోతున్న సమాజంలో బాలికల నిస్సహాయతకు అర్థం పడుతుంది. సమాజం, ప్రభుత్వాలు బాలికల జననాల రేటు తగ్గి పోతూ స్త్రీ పురుష నిష్పత్తిలో అగాధం పెరిగిపోతే సృష్టికి ప్రమాదం. సమానత్వం సుదూర స్వప్నం కారాదు?. దీన్ని నివారించేందుకు అవగాహన, చైతన్యం పెంచు కోవాల్సిన ఉమ్మడి బాధ్యత చాలా ఉంది. •

# చర్చలూ ఆగలేదు..యుద్ధమూ ఆపలేదు

## ట్రంప్-పుతిన్ మధ్య మరో దఫా చర్చలు

## కాల్పుల విరమణకు సుముఖంగాలేని పుతిన్



**వాషింగ్టన్, జూలై 4:** అమెరికా అధ్యక్షుడిగా ట్రంప్ అధికారం చేపట్టిన నాటి నుంచి రష్యాతో యుద్ధ విరమణ చేయించడానికి నానా తంటాలు పడుతున్నారు. ఈ క్రమంలో పుతిన్‌ను ఆకాశానికి ఎత్తేస్తున్నారు. కానీ, గతంలో గూఢచర్య సంస్థలో పనిచేసిన నేపథ్యం ఉన్న రష్యా అధినేత వద్ద ట్రంప్ ఎత్తులు పారడం లేదు. అమెరికా అధ్యక్షుడికి గౌరవం ఇస్తూనే ఉక్రెయిన్ విషయంలో పట్టువిడవడం లేదు. తాజాగా అలాంటి ఘటనే చోటుచేసుకుంది. రష్యా అధినేత పుతిన్ గురువారం ఏజెన్సీ ఫర్‌స్ట్రాటజిక్ ఇనీషియేటివ్స్ అనే సంస్థ నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్నారు. అదే సమయంలో అమెరికా అధ్యక్షుడితో ఫోన్‌కాల్ మాట్లాడాలని షెడ్యూల్ ఫిక్స్ అయింది. ఈ క్రమంలో ఆయన సదస్సు మధ్యలోనే తాను అమెరికా అధ్యక్షుడితో మాట్లాడాల్సి ఉందంటూ అర్ధాంతరంగా వేదికపై నుంచి లేచివెళ్లిపోయారు. 'దయచేసి మీరు కోప్పడొద్దు. మనం చాలా అంశాలపై మాట్లాడుకోవాలని నాకు తెలుసు. కానీ, ఆయన్ను వెయిట్ చేయించడం ఇబ్బందికరం. ఆయన బాధపడొచ్చు కూడా' అంటూ బహిరంగ వేదికపై మైకులో పుతిన్ చెప్పారు. ఇప్పుడు ఆ విడియో ఆన్‌లైన్‌లో వైరల్‌గా మారింది. ట్రంప్ అంటే విపరీతమైన గౌరవం ఉన్నట్లు ఈ సంఘటన కనిపిస్తుండగా వాస్తవానికి చర్చల్లో మాత్రం పుతిన్ ఒక్క అంగుళం కూడా వెనక్కి తగ్గలేదు. అమెరికా కాలమానం ప్రకారం గురువారం ఉదయం 10గంటలకు ఉక్రెయిన్ యుద్ధం తదితర అంశాలపై పుతిన్-ట్రంప్ సుమారు గంటసేపు చర్చలు జరిపారు. ఇంత చేసినా వారు ఏ నిర్ణయానికి రాలేదు. ఈ విషయాన్ని స్వయంగా ట్రంప్ ఆతర్వాత అంగీకరించారు. ఈ విషయమై జర్నలిస్టులతో ఆయన చెబుతూనే 'మేము ఈరోజు ఎటువంటి పురోగతి సాధించలేదు. ఫోన్‌కాల్‌లో సుదీర్ఘంగా మాట్లాడుకొన్నాం. ఇరాన్ విషయం సహా పలు అంశాలపై మాట్లాడుకొన్నాం. మీకు తెలుసు కదా ఉక్రెయిన్ అంశం చర్చకు వచ్చింది. ఆ విషయంలో నేను ఏమాత్రం సంతృప్తిగా లేను. ఏమాత్రం పురోగతి సాధించలేదు' అని ట్రంప్ నిరాశ వ్యక్తం చేశారు.

**రష్యా వెనక్కి తగ్గదు: క్రెమ్లిన్**

ఇక పుతిన్ సహాయకుడు యూరీ ఉషాకోవ్ మాట్లాడుతూ ఇరువురు నాయకులు సూటిగా చర్చించుకొన్నారు. తక్షణమే కాల్పుల విరమణ చేపట్టాలని ట్రంప్ సూచించినా పుతిన్ తిరస్కరించారు. ఈ యుద్ధానికి కారణమైన మూల సమస్యల విషయం రష్యా లక్ష్యాలను సాధించడానికి కట్టుబడి ఉన్నట్లు తేల్చిచెప్పారు. అదే సమయంలో దౌత్య మార్గంలో అంతిమంగా పరిష్కరించుకొనేందుకు సిద్ధంగా ఉన్నట్లు చెప్పారు. యుద్ధవిరమణ కోసం ట్రంప్-పుతిన్ చర్చించుకోవడం ఇది ఆరోసారి.

**సమావేశం ముగిసింది.. దాడి మొదలైంది..**


ట్రంప్ బాధ పడతారు అంటూ పుతిన్ హడావుడిగా వెళ్లినా ఉక్రెయిన్‌పై కఠినవైఖరిలో ఏమాత్రం సడలింపు లేదు. అమెరికా అధ్యక్షుడితో సమావేశం ముగిసిన కొద్దిసేపటికే ఉక్రెయిన్ రాజధాని కీవ్‌సహా 13 ప్రదేశాలను లక్ష్యంగా చేసుకొని మాస్కో భారీగా క్షిపణులు, డ్రోన్లతో దాడి చేసింది. దీనిలో 14 మంది తీవ్రంగా గాయపడ్డారు. కింజాల్ హైపర్‌సోనిక్ క్షిపణులను రష్యా వాడినట్లు ఉక్రెయిన్ వాయుసేన పేర్కొంది. వీటితోపాటు బాలిస్టిక్ క్షిపణులు కూడా ప్రయోగించినట్లు వెల్లడించింది. మొత్తం రెండు విడతల్లో ఈ దాడి జరిగింది.



## నౌకాదళ ఏవియేషన్ పైలట్‌గా

# తొలి మహిళ ఆస్తాపూనియా

**న్యూఢిల్లీ, జూలై 4:** భారత నావికాదళంలోనికి మొట్టమొదటిసారిగా ఫైటర్ బృందంలోనికి శిక్షణ పొందిన సబ్ లెఫ్టినెంట్ ఆస్తా పూనియా నియమితులయ్యారు. భారత యుద్ధనౌకల ఏవియేషన్ విభాగంలోనికి మొట్టమొదటి మహిళా పైలట్‌గా ఆమెను నియమిస్తున్నట్లు నౌకాదళ చీఫ్‌ప్రకటించారు. అంతేకాకుండా పూనియాతోపాటే లెఫ్టినెట్ అతుల్‌కుమార్‌దుల్ ప్రతిష్టాత్మకమైన వింగ్స్ ఆఫ్ గోల్డ్ ధృవపత్రాన్ని అందుకున్నారు. నావికాదళ సిబ్బంది అసిస్టెంట్ చీఫ్‌నుంచి ఆమె ఈ పురస్కారం అందుకున్నారు. ఆస్తాపూనియా నియామకంతో భారత నౌకాదళం యుద్ధనౌకలపైకి కూడా మహిళా పైలట్లు తొలిసారిగా నియమితులయినట్లు అసిస్టెంట్ చీఫ్ జనక్ బేవ్లీ ప్రశంసించారు. పూనియా ఇటీవలే సెకండ్ బేసిక్ హాక్ కన్వర్షన్ కోర్టును విశాఖపట్టణంలోని ఐఎన్ఎస్ డేగాలో పూర్తిచేసారు. ఇప్పటికే మహిళలు నావికాదళం ఎయిర్‌ఫోర్స్ ఆపరేషన్లలోను, ఎంఆర్ ఎయిర్‌క్రాఫ్ట్‌లు, హెలికాప్టర్లు వంటివాటిలో మహిళలను నియమించారు. ఆస్తాపూనియా ఫైటర్ పైలట్ బృందంలోకి రావడంతో నావికాదళ ఏవియేషన్ విభాగంలో నారిశక్తిని ప్రతిబింబిస్తోందని అంతేకాకుండా ఎలాంటి వివక్ష లేకుండా సమానత్వం, సంస్కృతి సాంప్రదాయాలు, మహిళలకు లభించే అవకాశాలను ప్రోత్సహిస్తున్నట్లు భారత నౌకాదళం ఒక ప్రకటన విడుదలచేసింది. 2016లోనే భారతీయ వైమానికశాఖ ముగ్గురు మహిళా అధికారులను నియమించింది. అవని చతుర్వేది, భావనా కాంత్, మోహనాసింగ్‌లు యుద్ధవిమానాల పైలట్లుగా నియమించింది. ఆ తర్వాత ఇపుడు నౌకాదళం ఎయిర్‌ఫోర్స్ ఆపరేషన్లలో కూడా నియమించిన తర్వాత యుద్ధనౌకల్లోకి ఫైటర్ పైలట్లుగా మహిళలు రావడం ఇదే తొలిసారి అని నౌకాదళ విభాగం ప్రకటించింది.



## దలైలామా ఎంపిక విషయంలోకి రాకండి

### భారత్‌కు చైనా హెచ్చరిక

**బీజింగ్, జూలై 4:** టిబెట్ ఆధ్యాత్మిక గురువు దలైలామా వారసుడి ఎంపికపై నిర్ణయం తీసుకునే హక్కు ఆయనకే ఉందని భారత్ ఇటీవల స్పష్టం చేసిన విషయం తెలిసిందే. తాజాగా దీనిపై స్పందించిన చైనా టిబెట్ విషయల్లో భారత్ జోక్యం చేసుకోవడంతగదని, ఇరు దేశాల మధ్య సంబంధాలు దెబ్బతినకుండా చూసుకోవాలని పరోక్ష హెచ్చరికలు చేసింది. అంతకుముందు ఇదే అంశంపై కేంద్రమంత్రి కిరణ్ రిజిజు మాట్లాడుతూ దలైలామా వారసుడిని నిర్ణయించే అధికారం, అందులో జోక్యం చేసుకొనే హక్కు ఎవరికీ లేదని లేదన్నారు. ఆ నిర్ణయం పూర్తిగా ఆయన చేతుల్లోనో లేదా ఆ సంస్థ పరిధిలోనో ఉందన్నారు. దీనిపై తాజాగా చైనా విదేశాంగ శాఖ స్పందిస్తూ అంతర్గత విషయాల్లో జోక్యం చేసుకోవడానికి టిబెట్ అంశాన్ని వాడుకోవడం భారత్ ఆపివేయాలని ఆశిస్తున్నామని పేర్కొంది. దలైలామా వారసుడిని ఆమోదించే హక్కు తమకు వారసత్వంగా కొనసాగుతోందని తెలిపింది. మరోవైపు తన వారసత్వంపై లామా టెంజిన్ గ్యాట్సో (14వ దలైలామా) ఇటీవల స్పందిస్తూ తన మరణాంతరం ఇది కొనసాగుతుందని ప్రకటించారు. భవిష్యత్తు గురువును (పునర్జన్మ పొందిన బాలుడిని) గాడెన్ ఫోడ్రాంగ్ ట్రస్టు మాత్రమే గుర్తిస్తుందని, మరెవరికీ ఈ విషయంలో జోక్యం చేసుకునే అధికారం లేదని పరోక్షంగా చైనాకు తేల్చి చెప్పారు. అయినా చైనా మాత్రం తన మొండి వాదనను కొనసాగిస్తూనే ఉంది.

# దేవభూమిలో ప్రకృతి విలయం

## 69 మంది మృతి, రూ.400 కోట్ల నష్టం



**సిమ్లా, జూలై 4:** దేవభూమిగా పేరొందిన హిమాచల్‌ప్రదేశ్‌ను భారీ వర్షాలు, ఆకస్మిక వరదలు అతలాకుతలం చేస్తున్నాయి గత రెండు వారాలుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న కుండపోత వానలకు రాష్ట్రం చిగురుటాకులా వణికిపోతోంది. ఈ ప్రకృతి విపత్తు కారణంగా జూన్ 20 నుంచి జూలై 3 మధ్యకాలంలో సుమారు 69 మంది ప్రాణాలు కోల్పోయారు. రాష్ట్రవ్యాప్తంగా రూ. 400 కోట్లకు పైగా ఆస్తి నష్టం వాటిల్లినట్లు ప్రాథమికంగా అంచనా వేశారు. వరదల తీవ్రతకు మండీ జిల్లా అత్యధికంగా ప్రభావితమైంది. ఇక్కడ ఆకస్మిక వరదలకు అనేక ఇళ్లు పేకమేడల్లా కూలిపోగా, వందలాది వాహనాలు నీటి ప్రవాహంలో కొట్టుకుపోయాయి. "క్లౌడ్ బరస్ట్ (కుండపోత) తర్వాత సర్వం కోల్పోయామని ఓ స్థానికుడు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం ఆర్మీ, స్థానిక పోలీసులు, విపత్తు ప్రతిస్పందన దళాలు సహాయక చర్యల్లో నిమగ్నమయ్యాయి. రాష్ట్ర విపత్తుల నిర్వహణ అథారిటీ ప్రత్యేక కార్యదర్శి డీసీ రాణా మాట్లాడుతూ, "ప్రస్తుతం మా ప్రధాన దృష్టి సహాయక చర్యలు, పునరుద్ధరణ పనులపైనే ఉంది. నష్టం అంచనాకు మరింత సమయం పడుతుందని తెలిపారు. మండీ జిల్లాలో కూలిపోయిన మౌలిక సదుపాయాల పునరుద్ధరణకు సీనియర్ ఇంజనీర్లు, అధికారులను పంపినట్లు ఆయన వివరించారు. ఈ విపత్తుల వెనుక వాతావరణ మార్పుల ప్రభావం ఉందని అధికారులు పేర్కొంటున్నారు. గ్లోబల్ వార్మింగ్, వాతావరణ మార్పుల పర్యవసానమే ఈ ఘటనలు. దీని ప్రభావం హిమాచల్‌పైనా పడిందని రాణా అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా రూ.400 కోట్లకు పైగా ఆస్తి నష్టం వాటిల్లినట్టు హిమాచల్ ప్రదేశ్ రాష్ట్ర విపత్తు నిర్వహణ అథారిటీ ప్రాథమికంగా అంచనా వేసింది. మృతుల సంఖ్య ఇంకా పెరిగే అవకాశం ఉందని అధికారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తునాగ్ సబ్‌డివిజన్‌లో రోడ్లు కొట్టుకుపోయి రాకపోకలు పూర్తిగా నిలిచిపో యాయి. విద్యుత్, తాగునీటి సరఫరా వ్యవస్థలు దెబ్బతిన్నాయి. ఒక్క మండి జిల్లాలోనే సుమారు 40 మంది గల్లంతైనట్లు సమాచారం. అక్కడి ఒక గ్రామం పూర్తిగా నాశనమైందని అధికారులు తెలిపారు. బాధితుల కోసం సహాయక శిబిరాలను ఏర్పాటు చేసి, భారత వైమానిక దళం హెలికాప్టర్ల ద్వారా ఆహార ప్యాకెట్లను జారవిడుస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా 250కి పైగా రోడ్లు మూసుకుపోగా, 500కు పైగా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు, సుమారు 700 తాగునీటి పథకాలు దెబ్బతిన్నాయి. మరోవైపు, సిమ్లాలోనూ వర్షాల కారణంగా తీవ్ర ఇబ్బందులు తలెత్తుతున్నాయి. భారీగా వర్షం కురుస్తోంది. మా తరగతి గదుల్లోకి నీళ్లు వస్తున్నాయి. బట్టలు, పుస్తకాలు తడిసిపోతున్నాయి. ఇళ్ల దగ్గరే ఉండమని మా టీచర్లు చెబుతున్నారు. పాఠశాల చుట్టూ ఉన్న చెట్లు ఎప్పుడు కూలిపోతాయోనని భయంగా ఉందని సిమ్లాకు చెందిన తనుజా ఠాకూర్ అనే విద్యార్థిని తన ఆవేదనను వ్యక్తం చేసింది. రాష్ట్ర, కేంద్ర బలగాలు ఎన్‌డీఆర్‌ఎఫ్, ఎస్‌డీఆర్‌ఎఫ్, పోలీసులు, హోంగార్డులు సమన్వయంతో సహాయక చర్యలు కొనసాగిస్తున్నారు. 7వ తేదీ వరకు రాష్ట్రంలో భారీ వర్షాలు కురుస్తాయని భారత వాతావరణ శాఖ హెచ్చరించడంతో అధికారులు అప్రమత్తంగా ఉన్నారు.



## సరిహద్దుల్లో ఒక్కరుకాదు ముగ్గురు శత్రువులు

### డిప్యూటీ ఆర్మీ చీఫ్ రాహుల్ ఆర్.సింగ్

**న్యూఢిల్లీ, జూలై 4:** భారత్‌కు ఒక సరిహద్దులో ఏకంగా ముగ్గురు విరోధులు ఉన్నారని డిప్యూటీ చీఫ్ ఆఫ్ ఆర్మీస్టాఫ్ లెఫ్టినెంట్ జనరల్ రాహుల్ ఆర్.సింగ్ అన్నారు. బోర్డర్‌లో ఎదురుగా పాకిస్థాన్ కనిపిస్తున్నప్పటికీ, దాని వెనుక చైనా ఉందన్నారు. శుక్రవారం ఢిల్లీలో ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఛాంబర్స్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ (ఫిక్కీ ) ఆధ్వర్యంలో న్యూ ఏజ్ మిలిటరీ టెక్నాలజీస్ అనే అంశంపై నిర్వహించిన సదస్సులో రాహుల్ ఆర్.సింగ్ ప్రసంగించారు. పాక్ వినియోగిస్తున్న సైనిక ఉత్పత్తుల్లో 81 శాతం చైనావే అని రాహుల్ ఆర్.సింగ్ అన్నారు. భారత్‌తో సైనిక ఘర్షణ జరిగినప్పుడల్లా పాక్‌కు చైనా నుంచి అన్ని రకాల సాయం, సైనిక టెక్నాలజీ అందుతోందన్నారు. ఆపరేషన్ సిందూర్ సమయంలోనూ అలాగే జరిగిందని ఆయన గుర్తుచేశారు. ఓ వైపు భారత్, పాక్ డైరెక్టర్ జనరల్ ఆఫ్ మిలిటరీ ఆపరేషన్స్ (డీజీఎంఓ)లు చర్చలు జరుపుతుంటే, మరోవైపు భారత్ క్షిపణులు ప్రయోగిస్తున్న లొకేషన్ల సమాచారం చైనా నుంచి పాక్‌కు చేరిందన్నారు. చైనాకు లైవ్ ల్యాబ్‌లా మారిన పాక్ చైనా తయారు చేస్తున్న కొత్తకొత్త ఆయుధాలు, నిఘా వ్యవస్థలకు లైవ్ ల్యాబ్‌లాగా పాక్ మారిందని రాహుల్ ఆర్.సింగ్ చెప్పారు. తమ ఆయుధాలను పాక్ గడ్డపై చైనా టెస్ట్ చేయిస్తోందని, ఇతర దేశాల ఆయుధాలతో పోల్చి చూసుకుంటోందని తెలిపారు. ఇటీవలే భారత్‌తో సైనిక ఘర్షణ వేళ తుర్కియే నుంచి కూడా పాక్‌కు కీలకమైన సైనిక సహాయం లభించిందని ఆయన పేర్కొన్నారు. యుద్ధాన్ని మొదలుపెట్టడం సులభమేనని, కానీ దాన్ని కంట్రోల్ చేయడం మాత్రం కష్టతరమైన అంశమని రాహుల్ ఆర్.సింగ్ వ్యాఖ్యానించారు. భారత్ పాక్ యుద్ధాన్ని ఆపేందుకు చాలాపెద్ద మాస్టర్ స్ట్రోక్‌లా డీజీఎంఓల స్థాయి చర్చలు పనిచేశాయన్నారు. ఆపరేషన్ సిందూర్ నుంచి కొన్ని పాఠాలను నేర్చుకోవాల్సిన అవసరం ఉందని డిప్యూటీ చీఫ్ ఆఫ్ ఆర్మీ స్టాఫ్ రాహుల్ ఆర్.సింగ్ అన్నారు. ఆపరేషన్ వేళ దేశ అత్యున్నత నాయకత్వం నుంచి స్పష్టమైన, వ్యూహాత్మక సందేశం అందరికీ అందిందని ఆయన చెప్పారు. కొన్నేళ్ల క్రితం వరకు ఉగ్రదాడులు జరిగితే భారత్ ఓర్చుకునేదని, ఇప్పుడు ఎప్పటికప్పుడు బలమైన సమాధానాన్ని ఇస్తోందన్నారు. పాక్, పాక్ ఆక్రమిత కశ్మీర్ పీవోకేలలోని ఉగ్రవాద స్థావరాలపై భారత్ అత్యంత కచ్చితత్వంతో దాడి చేసిందని తెలిపారు. ఈ ఆపరేషన్ కోసం మొత్తం 21 శత్రు టార్గెట్లను ఎంపిక చేయగా, వాటిలో 9 టార్గెట్లను అప్పటికప్పుడు ఫైనలైజ్ చేసి దాడులు మొదలుపెట్టామన్నారు. శత్రు టార్గెట్ల ఎంపిక, దాడి ఒకేరోజు జరిగాయని రాహుల్ ఆర్.సింగ్ చెప్పారు. భారత్‌లో మరింత విస్తారంగా గగనతల రక్షణ వ్యవస్థలను మోహరించాల్సిన అవసరం ఉందని ఆయన చెప్పారు. ఈసారి ఆపరేషన్ సిందూర్ వేళ భారీ జనాభా ఉండే ప్రాంతాల్లో గగనతల రక్షణ వ్యవస్థలను అంతగా మోహరించలేకపోయామని, మరోసారి ఇలాంటి అంశంలో మనం సన్నద్ధంగా ఉండాలన్నారు.

## ముస్లింలను ఓటు బ్యాంకుగా చూస్తోన్న కాంగ్రెస్: కేంద్ర మంత్రి కిరణ్‌రిజిజు



**న్యూఢిల్లీ, జులై 4:** భారత్‌లో మైనారిటీలు అనుభవిస్తున్న వసతులు ప్రపంచంలో ఏ దేశ ప్రజలూ అనుభవించడం లేదని కేంద్ర మైనారిటీ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రిజిజు అన్నారు. గత 75 ఏళ్లుగా ముస్లిం సామాజిక వర్గానికి చెందిన ప్రజలను కాంగ్రెస్ పార్టీ ఓ ఓటు బ్యాంకుగా చూస్తోందని విమర్శించారు. దీనివల్ల వారికి నష్టం చేకూరుతోందని కాంగ్రెస్ మాత్రం లబ్ధి కలుగుతోందని అన్నారు. శుక్రవారం ఆయన హజ్ యాత్రపై సమీక్ష నిర్వహించారు. అనంతరం మాట్లాడుతూ మైనారిటీల్లో చాలా మంది ఇప్పటికీ పేదవారిగానే ఉండిపోవడానికి కాంగ్రెస్ కారణమన్నారు. ఇందుకు స్వస్తి పలకాల్సిన అవసరముందని, ఇప్పటికైనా కాంగ్రెస్ తీరు మార్చుకోవాలని హితవు పలికారు. మరోవైపు బీహార్ ఎన్నికలపైనా రిజిజు స్పందించారు. ఎఐఎంఐఎం రాష్ట్ర అధ్యక్షుడు అఖ్తరుల్ ఇమాన్ ఇటీవల ఆర్జేడీ అధినేత లాలూ ప్రసాద్ యాదవ్‌కు లేఖ రాసిన సంగతి తెలిసిందే. రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో ఎఐఎంఐఎంను మహాఘట్‌బంధన్‌లో చేర్చుకోవాలని ఆ లేఖ సారాంశం. దీనిపై రిజిజు మాట్లాడుతూ మేం లౌకికవాదులం. కులం, మతం ఆధారంగా రాజకీయాలు చేయం. అలాంటి పార్టీలు మతపరమైనవి. భారత్‌లో అన్ని మతాల ప్రజలు సురక్షితంగా, సమాన హక్కులతో జీవిస్తున్నారు. ఆ కూటమిలో ఎఐఎంఐఎం చేరినా పెద్ద ప్రభావం ఉండబోదు. కానీ మతాల ఆధారంగా రాజకీయాలు చేయడం సరికాదు అని అన్నారు.



## టెహ్రాన్‌లో దిగిన తొలి విదేశీ విమానం

**టెహ్రాన్, జూలై 4:** ఇరాన్, ఇజ్రాయెల్ పరస్పర దాడుల నేపథ్యంలో రణరంగంలా మారిన పశ్చిమాసియాలో పరిస్థితులు క్రమంగా సద్దుమణుగుతున్నాయి. టెలిఅవీవ్ దాడుల నేపథ్యంలో అంతర్జాతీయ వైమానిక సేవలను నిలిపివేసిన ఇరాన్ తాజాగా వాటిని పునరుద్ధరించింది. 20 రోజుల నిషేధం తర్వాత టెహ్రాన్‌లోని ఇమామ్ ఖొమేని అంతర్జాతీయ విమానాశ్రయంలో తొలిసారిగా విదేశీ విమానం ల్యాండ్ అయ్యింది. ఈ మేరకు స్థానిక మీడియా వెల్లడించింది. అంతకుముందు యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యుఎఇ) నుంచి ఫ్లయింగ్ దుబాయ్ సంస్థకు చెందిన విమానం భారీ భద్రత నడుమ ల్యాండ్ అయినట్లు ఇరాన్ పౌర విమానయాన శాఖ వెల్లడించింది. ఇరాన్ వైమానిక రంగం స్థిరత్వం సాధించే దిశగా అడుగులు వేసేందుకు దోహదపడుతుందని పౌర విమానయాన శాఖ అధికార ప్రతినిధి మెహ్దీ రమేజానీ మీడియాకు వెల్లడించారు. అంతర్జాతీయ విమానాలు ఇరాన్‌లో సురక్షితంగా ల్యాండ్ అయ్యేలా అవసరమైన చర్యలు చేపడతామని, ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకొని క్రమంగా సర్వీసుల సంఖ్యను పెంచుతామని ఆయన తెలిపారు.



## సిఎం కావాలన్న కోరిక అలాగే ఉంది

### కర్ణాటక ఉపముఖ్యమంత్రి డికె శివకుమార్!

**బెంగళూరు, జులై 4:** కర్ణాటక రాజకీయాల్లో సిఎం మార్పుపై ఇటీవల తీవ్ర చర్చ జరిగింది. కాంగ్రెస్ అధిష్టానం బుజ్జగింపులతో డిప్యూటీ సిఎంగా ఉన్న డికె శివకుమార్ సర్దుకుపోవడంతో ప్రస్తుతానికి సమస్య తీరిపోయింది. అయితే సిఎం కావాలన్న తన కోరిక అలాగే ఉందనే అర్థంలో డికె తాజాగా వ్యాఖ్యలు చేశారు. తన రాజకీయ ఆకాంక్షలపై మీడియా అడిగిన ప్రశ్నకు బదులిచ్చారు. ప్రయత్నాలు ఫలించకపోయినా , నేను బలంగా కోరుకున్న దాని కోసం చేసిన ప్రార్థనలకు సమాధానం దొరక్కుండాపోదు. అయితే రాజకీయాల గురించి చర్చించే సందర్భం ఇది కాదు. రాష్ట్రానికి మంచి జరగాలి అంటూ తన ఆకాంక్షలను నేరుగా బయటపెట్టకుండా సమాధానం చెప్పారు. డికె. మల్లికార్జున ఖర్గే తమకు జాతీయ అధ్యక్షుడని, ఆయన సూచనల ప్రకారం పార్టీ కోసం పనిచేస్తామన్నారు. ఇటీవల కర్ణాటక కాంగ్రెస్ ఎమ్మెల్యే ఇక్బాల్ హుసేన్ ఓ కార్యక్రమంలో మాట్లాడుతూ మరో రెండు, మూడు నెలల్లో ప్రస్తుత ఉప ముఖ్యమంత్రి డికె శివకుమార్ కర్ణాటక ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించే అవకాశముందన్నారు. ఆ వ్యాఖ్యలు తీవ్ర చర్చనీయాంశమయ్యాయి. అయితే అయిదేళ్లు తానే ముఖ్యమంత్రిగా కొనసాగుతానని సిద్ధరామయ్య స్పష్టం చేయడంతో ఆ ఊహాగానాలకు చెక్ పడింది. ఆ సమయంలో డికె ఆసక్తికర వ్యాఖ్యలు చేసిన సంగతి తెలిసిందే. ఆయనకు అండగా ఉండటం తప్ప నాకు ఇంకో ఆప్షన్ లేదు. నేను ఆయనకు మద్దతు ఇవ్వాలి. అధిష్టానం ఏది చెబితే అది చేయాలి అని మీడియాతో మాట్లాడిన సంగతి తెలిసిందే. 2023లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల తర్వాత ముఖ్యమంత్రి పదవిపై రాష్ట్ర కాంగ్రెస్‌లో తీవ్ర స్థాయిలో చర్చ జరిగింది.

## తమిళనాడు సిఎం అభ్యర్థిగా టివికె విజయ్!



**చెన్నై, జూలై 4:** తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల కోసం తమిళగ వెట్రి కజగం (టీవీకే) పార్టీ ఇప్పటి నుంచే సమాయత్తం అవుతోంది. ఇందులో భాగంగా ఆ పార్టీ శుక్రవారం అధికారికంగా నటుడు, తమ పార్టీ వ్యవస్థాపకుడైన విజయ్‌ను ముఖ్యమంత్రి అభ్యర్థిగా ప్రకటించింది. ఈ సందర్భంగా విజయ్ మాట్లాడుతూ తమ పార్టీ ఎప్పుడూ బీజేపీతో పొత్తు పెట్టుకోదని స్పష్టం చేశారు. బహిరంగంగానే కాదు, లోపాయికరంగా కూడా కాషాయ పార్టీతో పొత్తు పెటుకోమని ఆయన తేల్చిచెప్పారు. బీజేపీని సైద్ధాంతిక శత్రువుగా అభివర్ణించిన విజయ్, వారితో ఎప్పటికీ చేతులు కలపనని పేర్కొన్నారు. బీజేపీ మరెక్కడైనా విష బీజాలు నాటవచ్చు. కానీ తమిళనాడులో కాదు. మీరు తమిళనాడులో అన్నాదురై, పెరియార్‌లను వ్యతిరేకించలేరు, అవమానించలేరు. అసలు మీరు తమిళనాడులో గెలవలేరు. బీజేపీతో కలవడానికి టీవీకే పార్టీ డీఎంకే, ఏఐఏడీఎంకే కాదని విజయ్ అన్నారు. తమిళనాడు అసెంబ్లీ ఎన్నికలకు ముందు పొత్తులపై నిర్ణయం తీసుకునే పూర్తి అధికారం విజయ్‌కు అప్పగిస్తూ టీవీకే పార్టీ కీలక నిర్ణయం తీసుకుంది. అంతేకాదు టీవీకే పార్టీ సభ్యులను, సభ్యత్వాన్ని మరింత విస్తరించాలని నిర్ణయించింది. రాష్ట్రంలో ఏకంగా 2 కోట్ల మందిని తమ పార్టీలో చేర్చుకోవాలని లక్ష్యంగా పెట్టుకుంది.

## వింద వినోదాల్లో మునిగిన మాల్యా, లలిత్‌మోడీ



**లండన్, జూలై 4:** భారత చట్టాల నుంచి తప్పించుకుని లండన్‌లో తలదాచుకుంటున్న వివాదాస్పద వ్యాపారవేత్తలు లలిత్ మోదీ, విజయ్ మాల్యా విందువినోదాలతో ఎంజాయ్ చేస్తున్నారు. తాజాగా లండన్‌లో జరిగిన ఓ విలాసవంతమైన పార్టీలో వీరంతా కలిసి పాటలు పాడుతూ ఎంజాయ్ చేస్తున్న వీడియో సోషల్ మీడియాలో వైరల్ అయింది. భారత్‌లో తీవ్రమైన ఆర్థిక నేరారోపణలు ఎదుర్కొంటున్న ఈ ఇద్దరూ ఇలా బహిరంగంగా సంబరాలు చేసుకోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఐపీఎల్ మాజీ కమిషనర్ లలిత్ మోదీ స్వయంగా ఏర్పాటు చేసిన ఈ పార్టీకి సుమారు 310 మందికి పైగా అతిథులు హాజరయ్యారు. ఈ వేడుకలో విజయ్ మాల్యాతో కలిసి లలిత్ మోదీ, ఫ్రాంక్ సినాత్రా పాడిన ప్రఖ్యాత ఖిఐ డిడ్ ఇట్ మై వేఖి (నేను నా పద్ధతిలోనే చేశాను) అనే పాటను ఆలపించారు. వెస్టిండీస్ మాజీ క్రికెటర్ క్రిస్ గేల్ కూడా ఈ పార్టీలో పాల్గొని లలిత్ మోదీ, మాల్యాతో దిగిన ఫోటోను సోషల్ మీడియాలో పంచుకున్నాడు. ఈ వీడియోను స్వయంగా లలిత్ మోదీనే తన ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేయడం గమనార్హం. ఈ వీడియో ఇంటర్నెట్‌ను బ్రేక్ చేయదని ఆశిస్తున్నా. కచ్చితంగా ఇది వివాదాస్పదమే. కానీ నేను చేసేది అదే" అంటూ ఆయన పెట్టిన క్యాప్షన్ వారి ధిక్కార వైఖరిని స్పష్టం చేస్తోంది. లలిత్ మోదీ మనీ లాండరింగ్ సహా పలు ఆర్థిక అవకతవకల ఆరోపణలతో 2010 నుంచి లండన్‌లోనే ఉంటున్నారు. మరోవైపు, కింగ్‌ఫిషర్ ఎయిర్‌లైన్స్ అధినేత విజయ్ మాల్యా భారత బ్యాంకులకు సుమారు 9,000 కోట్ల రూపాయల రుణాలు ఎగ్గొట్టి లండన్‌కు పారిపోయారు. ఆయనపై కూడా మోసం, మనీలాండరింగ్ కేసులు ఉన్నాయి. వీరిని భారత్‌కు రప్పించేందుకు ప్రయత్నాలు జరుగుతుండగా, వారు మాత్రం ఇలా విలాసవంతమైన జీవితం గడుపుతూ కనిపించడం చర్చనీయాంశంగా మారింది.

## ట్రంప్ బిగ్ బ్యూటిఫుల్ బిల్లుకు ప్రతినిధుల సభ ఆమోదం




**వాషింగ్టన్, జూలై 4:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తన రెండోసారి పదవీకాలంలో అత్యంత ప్రధాన రాజకీయ విజయాన్ని అందుకున్నారు. అమెరికా స్వాతంత్ర్య దినోత్సవానికి ఒక రోజు ముందు, ఆయన ప్రతిష్ఠాత్మకంగా భావిస్తున్న పన్నులు, వ్యయాల బిల్లుకు కాంగ్రెస్‌లో స్వల్ప మెజారిటీతో ఆమోదం లభించింది. ప్రతినిధుల సభలో ఉత్కంఠభరిత ఓటింగ్‌లో ఈ బిగ్ బిల్లుకు అనుకూలంగా 218 ఓట్లు, వ్యతిరేకంగా 214 ఓట్లు పడ్డాయి. దీంతో ట్రంప్ తన అజెండాను ముందుకు తీసుకెళ్లేందుకు మార్గం సుగమమైంది. ఈ విజయంపై ట్రంప్ తన సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ ట్రూత్ సోషల్ లో స్పందిస్తూ, ఇది అత్యంత ప్రభావవంతమైన బిల్లుల్లో ఒకటి. ప్రపంచంలోనే అమెరికా ఇప్పుడు హాటెస్ట్ దేశం అని వ్యాఖ్యానించారు. ఈ బిల్లుపై శుక్రవారం సాయంత్రం 5 గంటలకు అధ్యక్షుడు సంతకం చేస్తారని ప్రెస్ సెక్రటరీ కరోలిన్ లెవిట్ తెలిపారు. బిల్లులోని ప్రధానాంశాల పరంగాచూస్తే ఈ బిల్లు ద్వారా ట్రంప్ తన ఎన్నికల వాగ్దానాలను నెరవేర్చుకోనున్నారు.

సైనిక వ్యయాన్ని పెంచడం, వలసదారులను వెనక్కి పంపే కార్యక్రమానికి నిధులు సమకూర్చడం, పన్నుల ఉపశమనాన్ని పొడిగించేందుకు 4.5 ట్రిలియన్ డాలర్లు కేటాయించడం వంటివి ఇందులో ప్రధానాంశాలు. అయితే, ఈ బిల్లు వల్ల దేశ జాతీయ అప్పు మరో 3.4 ట్రిలియన్ డాలర్లు పెరుగుతుందని అంచనా. అదే సమయంలో పేదల కోసం ఉద్దేశించిన ఫుడ్ అసిస్టెన్స్ కార్యక్రమం, మెడికేర్‌ఆరోగ్య బీమా పథకాలకు భారీగా కోతలు విధించనున్నారు. దీనివల్ల సుమారు 17 మిలియన్ల మంది బీమా కవరేజీనికోల్పోవచ్చని నిపుణులు భావిస్తున్నారు. బిల్లు ఆమోదం పొందకుండా అడ్డుకునేందుకు డెమొక్రాటిక్ పార్టీ నేత హకీమ్ జెఫ్రీస్ దాదాపు తొమ్మిది గంటలపాటు ప్రసంగించి సభా కార్యక్రమాలను ఆలస్యం చేసే ప్రయత్నం చేశారు.

ఈ బిల్లు అమెరికా ప్రజల జీవితాలను నాశనం చేస్తుంది. ఇది ఒక అసహ్యకరమైన, ప్రమాదకరమైన బిల్లు అని ఆయన తీవ్రంగా విమర్శించారు. రిపబ్లికన్ పార్టీలోనూ కొంత వ్యతిరేకత వ్యక్తమైనప్పటికీ, స్పీకర్ మైక్ జాన్సన్ చివరి నిమిషంలో అసమ్మతి నేతలను ఒప్పించి బిల్లు నెగ్గేలా చేయడంలో సఫలమయ్యారు.

# గొప్ప రాజనీతిజ్ఞుడు రోశయ్య

## రోశయ్య 92వ జయంతి సభలో శాసనమండలి ఛైర్మన్ సుఖేందర్‌రెడ్డి

### యువ రాజకీయ నాయకులు రోశయ్యను ఆదర్శంగా తీసుకోవాలి: స్పీకర్ ప్రసాద్‌కుమార్

### పాలనలో ఆరితేరిన నేత : చాగంటి




చాగంటి కోటేశ్వరరావును సన్మానిస్తున్న సుఖేందర్‌రెడ్డి, ప్రసాద్‌కుమార్, శ్రీధర్‌బాబు, కృష్ణారావు, పొన్నం, కెవిపి, మామిడి హరికృష్ణ, శివసుబ్బారావు, దామోదర్‌గుప్తా తదితరులు




రోశయ్యకు ఘన నివాళులర్పిస్తున్న సుఖేందర్‌రెడ్డి, ప్రసాద్‌కుమార్, శ్రీధర్‌బాబు, కృష్ణారావు, పొన్నం, కెవిపి, విజయలక్ష్మి, మామిడి హరికృష్ణ, సుజాత, శివసుబ్బారావు తదితరులు

**హైదరాబాద్ (రవీంద్రభారతి), జూలై 4, ప్రభాతవార్త :** రోశయ్య మాట్లాడితే ఇంకా వినాలన్న భాషాప్రావీణ్యం, చెప్పే విషయాల్లో గొప్ప రాజకీయ చతురత ప్రస్ఫుటమౌతుందని, ఆయన ప్రసంగాలు నేటితరానికి స్ఫూర్తిదాయకమని తెలంగాణ శాసనమండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి అన్నారు. రాష్ట్రాలు విడిపోయినా తెలుగుజాతంతా ఒక్కటే... అన్నదమ్ముల్లా కలిసే ఉందామని పిలుపునిచ్చారని తెలిపారు. రోశయ్య జయంతిని అధికారికంగా నిర్వ హించ డమంటే విధానాలు సిద్ధాంతాలు వేర్వేరైనా మనిషిని మనిషి గౌర వించుకోవాలని, తెలంగాణ ప్రజల మనోభావాలు, ప్రేమాభిమానాలను, ఇచ్చే గౌరవాన్ని అర్థం చేసుకోవాలన్నారు. చివరిగా రోశయ్య అంతర్యాన్ని ఆవిష్క రించారు. అస్థవ్యస్థమైపోతున్న నేటి రాజకీయాల్లో యువ రాజకీయ నాయకులు రోశయ్యను ఆదర్శంగా తీసుకోవాలని, ఆయన వద్దనుండి తానెన్నో విషయాలు నేర్చుకున్నానని తెలంగాణ శాసనసభ సభాపతి గడ్డం ప్రసాద్‌కుమార్ సూచించారు. రాష్ట్ర ప్రభుత్వ భాషా సాంస్కృతిక శాఖ, కొణిజేటి రోశయ్య మెమోరియల్ ట్రస్ట్ హైదరాబాద్ సంయుక్త ఆధ్వర్యంలో ప్రభుత్వ భాషా సాంస్కృతికశాఖ సంచాలకుడు డా. మామిడి హరికృష్ణ నిర్వహణలో శుక్రవారం రవీంద్ర భారతిలో ప్రభుత్వపరంగా కొణిజేటి రోశయ్య 92 జయంతి, ప్రవచనకర్త చాగంటి కోటేశ్వరరావు ఘనసత్కార కార్యక్రమాలు వైభ వోపేతంగా జరి గాయి. ప్రభుత్వం అధికారికంగా తొలిసారి నిర్వహించిన కొణిజేటి రోశయ్య 92వ జయంతికి ముఖ్యఅతిథులుగా గుత్తా సుఖేందర్‌రెడ్డి, గడ్డం ప్రసాద్‌కుమార్‌లు, విశిష్ట అతిథులు రాష్ట్ర మంత్రులు జూపల్లి కృష్ణారావు, దుద్దిళ్ళ శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్, కాంగ్రెస్ నాయకులు వివేక్, కెవిపి.రామచంద్రరావు, డా. సముద్రాల వేణు గోపాలాచారి, ఆత్మీయ అతిథులు డా. అలేఖ్య పుంజాల, జి.వి.వెన్నెల, నగర మేయర్ గద్వాల విజయలక్ష్మి, కోలేటి దామోదర్‌గుప్తా, ఉప్పల శ్రీనివాస్‌గుప్తా, కల్వ సుజాత, ఎమ్మెల్యే ఎమ్మెల్సీలు, ట్రస్టీలు కొణిజేటి శివసుబ్బారావు, కొణిజేటి శ్రీమన్నారాయణమూర్తి, పైడా కృష్ణప్రసాద్, సభ్యులు కొణిజేటి అనిరుధ్, అమరవాది లక్ష్మీనారాయణ, కొణిజేటి హర్ష, సీల్‌వెల్ సీఎండి బండారు సుబ్బారావు తదితరులు పాల్గొని రోశయ్య ఫోటోగ్యాలరీని దర్శించిన రోశయ్య చిత్రపటానికి పుష్పాంజలితో ఘననివాళులర్పించారు.

ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్‌బాబు మాట్లాడుతూ రోశయ్య జీవితం అందరికీ ఆదర్శనీయమని, సహమంత్రులుగా ప్రజల కోసం బాగా పనిచేయాలని ప్రోత్సహిస్తూ ముందుకు నడిపేవారని, ఆ బాటలోనే తాము నడుస్తున్నాం... నడుస్తామని, యువతరం కూడా ఆయన చూపిన బాటలో నడవాలని సూచించారు. ముందుగా డా. మామిడి హరికృష్ణ స్వాగతోపన్యాసంలో రోశయ్య స్ఫూర్తి మన గుండెల్లో మనస్సులో నిలుపుకొని ఆయన ఏ విలువలు, లక్ష్యాల కోసం, ప్రభుత్వాలు అమలుచేసే అన్ని ఆర్థిక విధానాల అంతిమలక్ష్యం మానవాభివృద్ధియే కావాలని పరితపించారో దాన్ని సఫలీకృతం చేద్దామని పిలుపునిచ్చారు. అనంతరం జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ ప్రతీఒక్కరి రోశయ్య జీవితాన్ని ఆదర్శంగా తీసుకోవాలని, రాజకీయాల్లో విభిన్న అత్యున్నత పదవులను నిర్వహించి వాటికే వన్నెతెచ్చిన రాజకీయ చతురుడు, పరిపాల నాదక్షుడని ఆర్థికశాఖ మంత్రిగా ఆయన 16 పర్యాయాలు రాష్ట్ర బడ్జెట్‌ను ప్రవేశపెట్టి ప్రభుత్వానికి ధర్మకర్తగా, భవిష్యత్ తరాలకు మార్గదర్శకుడుగా నిలిచారని కొనియాడారు. తెలంగాణ ప్రజాప్రభుత్వం రోశయ్యను సముచి తంగా గౌరవించుకొనే విధంగా ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి సూచనలమేరకు ప్రముఖ లకిడీకాపూల్ కూడలిలో రోశయ్య కాంస్య విగ్రహం ఆవిష్కరించడం, ఆయన్ను ఆదర్శంగా తీసుకోవడం, ఇకనుండి ఆయన జయంతిని ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని నిర్ణయించడం జరుగు తుందని స్పష్టం చేశారు. రోశయ్య కుమారుడు శివసుబ్బారావు అతిస్వల్పం కాలంలో లకిడీకాపూల్ కూడలిలో రోశయ్య కాంస్య విగ్రహం ఏర్పాటు, ప్రభుత్వ ప్రకృతి వైద్యలయానికి రోశయ్య పేరుపెట్టడం, ప్రతీ సంవత్సరం ఆయన జయంతిని ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని నిర్ణయించి రోశయ్య తెలుగుజాతి గుండెల్లో కలకాలం నిలిచిపోయేలా కృషిచేసినందుకు కృతజ్ఞతాభినందనలు తెలిపారు. చివరిగా చాగంటి కోటేశ్వరరావును అతిథులంతా కలిసి ఘనంగా సత్కరించారు. తదుపరి చాగంటి కోటేశ్వరరావు తన స్పందనలో ఆజన్మాంతం తాను నమ్మిన సిద్ధాంతాలకు కట్టుబడి ముఖ్యమంత్రిగా, గవర్నరుగా, గొప్ప రాజకీయ దురంధరుడిగా కొణిజేటి రోశయ్య వన్నెకెక్కారని అన్నారు.



## స్వామివారి సేవలో సుప్రీంకోర్టు జడ్జి సూర్యకాంత్

### పూర్ణకుంభ స్వాగతం పలికిన అర్చక స్వాములు

### లక్ష్మీనరసింహస్వామివారిని దర్శించుకోవడం అదృష్టం :సుప్రీంకోర్టు న్యాయమూర్తి సూర్యకాంత్

**యాదగిరిగుట్ట, జూలై 4, ప్రభాతవార్త:** అత్యంత శక్తివంతమైన దైవిక క్షేత్రంలో ఒకటైన యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీ నరసింహస్వామి వారి క్షేత్రంలో దర్శించి పాంచనారసింహస్వామి వారి ఆశీస్సులు పొందడం తన అదృష్టమని సుప్రీంకోర్టు న్యాయమూర్తి సూర్యకాంత్ అన్నారు. శుక్రవారం యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీ నరసింహస్వామి వారిని ఆయన దర్శించుకున్న అనంతరం మాట్లాడారు. ఆలయ నిర్మాణము సాంప్రదాయంలో నిర్వహణ పారిశుభ్రత అద్భుతంగా ఉందని ప్రశంసించారు. శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి వారి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని ఆయన కోరుకుంటున్నట్టు చెప్పారు. అంతకుముందు యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి వారిని శుక్రవారం సుప్రీంకోర్టు జడ్జీ జస్టిస్ సూర్యకాంత్ దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. జడ్జిని ఆలయ ఈవో, కమిషనర్ ఎస్. వెంకట్రావ్ ఆధ్వర్యములో దర్శన, ఆశీర్వచన ఏర్పాట్లు గావించారు. పూర్ణకుంభం స్వాగతం పలికిన ఆలయ అర్చకులు ఆలయంలోకి సాంప్రదాయంగా అర్చకులు మంత్రోచ్చారణలు చేయగా అధికారులు స్వాగతం పలికారు. మొదటగా ధ్వజస్తంభం వద్ద దర్శనం చేసుకున్న జడ్జి, ప్రధాన ఆలయంలోని స్వయంభుల వద్ద ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు గోత్రనామార్చనలు సువర్ణ పుష్పార్చనలతో జడ్జికి ప్రత్యేక పూజలు జరిపారు. శ్రీ స్వామివారి విశేష శాలువా పూలదండతో సత్కరించారు. ఆలయముఖ మంటపంలో వేదాశీర్వచనం చేసిన వేద పండితులు తీర్థ ప్రసాదాలు అందజేయగా, స్వామి వారి చిత్రపటం,లడ్డు ప్రసాదం ఆలయ ఈఓ వెంకట్రావు అందజేశారు. సుప్రీంకోర్టు న్యాయమూర్తి తో పాటు నేషనల్ లీగల్ సర్వీసెస్ అథారిటీ మెంబర్ భరత్ పరషార్, తెలంగాణ లీగల్ సర్వీసెస్ అథారిటీ సభ్యులు పంచాక్షరి, జిల్లా కలెక్టర్ హనుమంతరావు జిల్లా ప్రధాన న్యాయ మూర్తి జయరాజు, పిసిపి ఆకాంక్ష, జిల్లా న్యాయ సేవా సంస్థ కార్యదర్శి మాధవి లత యాదగిరిగుట్ట జూనియర్ సివిల్ జడ్జి చండీశ్వరి అదనపు కలెక్టర్ వీరారెడ్డి ఆర్డిఓ కృష్ణారెడ్డి దేవస్థాన డీఈవో దోర్బల భాస్కరశర్మ పాల్గొన్నారు.

# ఖనిజాల ఉత్పత్తిలో అత్యాధునిక సాంకేతికత

## సింగిల్ విండో ద్వారా లీజు రెన్యువల్స్

### ప్రపంచ మైనింగ్ సదస్సులో కేంద్ర బొగ్గు, గనుల మంత్రి కిషన్‌రెడ్డి

**హైదరాబాద్, జూలై 4, ప్రభాతవార్త :** అత్యాధునిక సాంకేతికత వినియోగించి ఖనిజాలు ఉత్పత్తి చేయబోతున్నామని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి కిషన్ రెడ్డి అన్నారు ఈ ఖనిజాల ఉత్పత్తిలో కోల్ ఇండియా కీలక పోషిస్తోందని చెప్పారు. హైదరాబాద్‌లో శుక్రవారం నిర్వహించిన ప్రపంచ మైనింగ్ సదస్సులో ఆయన పాల్గొన్నారు. ఈ అంతర్జాతీయ సదస్సులో మంత్రి కాపర్ విజన్ డాక్యుమెంట్‌ను విడుదల చేశారు. అనంతరం ఉత్తమ మైన్ క్లోజర్ పద్ధతుల ద్వారా స్థిరమైన మరియు బాధ్యతాయుతమైన మైనింగ్‌పై ఈ సదస్సులో చర్చించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆత్మ నిర్భర్ భారత్ కింద ఖనిజ ఉత్పత్తికి కోల్ ఇండియా అధిక ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. స్థానికుల జీవనోపాధికి ఇబ్బంది లేకుండా కోల్ ఇండియా చర్యలు తీసుకుంటుందని హామీ ఇచ్చారు. ఖనిజాల తవ్వకంలో పారదర్శంగా వ్యవహరిస్తోందని తెలిపారు. 500 మినరల్ బ్లాక్స్‌కు సంబంధించిన లీజ్ రెన్యువల్ సులభతరం అవుతోందని చెప్పారు. ఈ లీజ్ రెన్యూవల్స్ నిమిత్తం సింగిల్ విండో సిస్టం అందుబాటులోకి తెచ్చినట్లు వివరించారు. దీంతో అరుదైన ఖనిజాల ఉత్పత్తిలోకి కూడా కోల్ ఇండియా అడుగుపెట్టిందని చెప్పారు. భారతదేశ ఇంధన పరివర్తన, మౌలిక సదుపాయాల వృద్ధి మరియు విద్యుత్ వాహనాలు, సౌరశక్తి వంటి పర్యావరణ అనుకూల సాంకేతికతలకు అవసరమైన రాగి తదితర గనులపై దృష్టిసారించినట్లు పేర్కొన్నారు. ముడి పదార్థాల భద్రతను నిర్ధారిస్తూ పెరుగుతున్న దేశీయ డిమాండ్‌ను తీర్చడానికి విజన్ డాక్యుమెంట్ దీర్ఘకాలిక వ్యూహాన్ని అందిస్తుందని ఆయన వెల్లడించారు. హిందూస్తాన్ కాపర్ లిమిటెడ్, హిందాలకో ఇండస్ట్రీస్ లిమిటెడ్, కచ్ కాపర్ లిమిటెడ్, వేదాంత



లిమిటెడ్, ఇండో ఆసియా కాపర్ లిమిటెడ్, లోహమ్ వంటి కీలక వాటాదారులతో పాటు, ఇండియన్ ప్రైమరీ కాపర్ ప్రొడ్యూసర్స్ అసోసియేషన్ మరియు ఇంటర్నేషనల్ కాపర్ అసోసియేషన్ వంటి పరిశ్రమ సంఘాలతో విస్తృత శ్రేణి సంప్రదింపుల ద్వారా ఈ డాక్యుమెంట్ అభివృద్ధి చేయబడిందని వివరించారు. 2047 నాటికి డిమాండ్ ఆరు రెట్లు పెరుగుతుందని కాపర్ విజన్ డాక్యుమెంట్ అంచనా వేస్తుందన్నారు. అలాగే 2030 నాటికి సంవత్సరానికి 5 మిలియన్ టన్నుల కరిగించే మరియు శుద్ధి చేసే సామర్థ్యాన్ని జోడించే ప్రణాళికలకు రూపకల్పన జరుగుతోందని వివరించారు. ఇది ప్రపంచ భాగస్వామ్యాల ద్వారా విదేశీ ఖనిజ ఆస్తులను భద్రపరచడం ద్వారా ద్వితీయ శుద్ధిని పెంచడం, దేశీయ రీసైక్లింగ్‌ను మెరుగుపరచడం, బహిరంగ మార్కెట్ దిగుమతులపై ఆధారపడటాన్ని తగ్గించడంపై దృష్టి పెడుతునట్లు వెల్లడించారు.

## డాక్టర్‌డే నాడు జరిగిన దాడిని ఖండించిన జూనియర్ వైద్యులు

**హైదరాబాద్ (గోషామహాల్), జూలై 4, ప్రభాతవార్త:** కరీంనగర్ జిల్లాలో చల్మెడ ఆనందరావుపై మెడికల్ కాలేజ్‌లో మెడికోలపై జరిగిన దాడిని తెలంగాణ జూనియర్ డాక్టర్ అసోసియేషన్స్ ఖండించింది. తమకు రావాల్సిన స్టైఫండ్ కోసం శాంతియుతంగా నిరసన చేస్తున్న హౌస్ సర్జన్‌లపై కళాశాల యాజమాన్యం పోలీసులతో దౌర్జన్యం చేయిందని తెలంగాణ జూనియర్ డాక్టర్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి డాక్టర్ అజయ్‌కుమార్‌గౌడ్ అన్నారు.

హైదరాబాద్ కోఠి మెడికల్ కళాశాల ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మెడికోలు, చేసిన సర్వీస్‌కు చెల్లించాల్సిన స్టైపండ్‌ను కళాశాల యాజమాన్యం ఇవ్వకపోవడం వల్లే వాళ్ల ఆందోళనకు దిగినట్లు చెప్పారు. పోలీసులు మెడికోలపై దుర్భాశలు ఆడుతూ,లాఠీచార్జ్ చేసేందుకు యత్నించారన్నారు. స్టైఫండ్ కోసం ప్రశ్నించిన 64మందిన్ని సస్పెండ్ చేశారని పేర్కొన్నారు.వారి హక్కుల కోసం పోరాడితేప్రైవేట్ మెడికల్ కళాశాల యాజమాన్యాలు పోలీసులను పెట్టించి జూనియర్ డాక్టర్స్‌పై దాడులు చేయించడం ఎంత వరకు సమంజసమన్ని ప్రశ్నించారు. త్వరలోనే ముఖ్య మంత్రి రేవంత్‌రెడ్డిని కలిసి సమస్యను వివరిస్తామన్నారు. ఈసమావేశంలో జూడా అద్యక్షులు ఐజాక్‌న్యూటన్,ఉపాధ్యక్షులు గిరిప్రసాద్,డాక్టర్ సందీప్, ఉస్మానియా మెడికల్ కళాశాల అధ్యక్షులు డాక్టర్ అవినాష్‌రెడ్డి,వినయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



## మాజీ సిఎం రోశయ్య వివాదరహితుడు

### ఎఐసిసి అధ్యక్షుడు మల్లికార్జునఖర్గే

### గాంధీభవన్‌లో రోశయ్య చిత్రపటానికి నివాళులు

**హైదరాబాద్, జూలై 4, ప్రభాతవార్త:** మాజీ ముఖ్యమంత్రి రోశయ్య వివాద రహితుడు ప్రాంతీయ సరిహద్దులు లేని గొప్పవ్యక్తి అని ఎఐసిసి అధ్యక్షుడు మల్లికార్జునఖర్గే అన్నారు. శుక్రవారం గాంధీభవన్‌లో ఎఐసిసి అధ్యక్షుడు మల్లికార్జున్‌ఖర్గే, ఎఐసిసి ప్రధాన కార్యదర్శి కేసి వేణుగోపాల్, రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్, పిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ మాజీముఖ్యమంత్రి రోశయ్య జయంతి ఘనంగా జరిపారు. మాజీ ముఖ్యమంత్రి రోశయ్య చిత్రపటానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. రోశయ్య గొప్ప రాజకీయవేత్త అని కొనియాడారు.

## బిసి రిజర్వేషన్లు పెంచాకే స్థానిక ఎన్నిక నిర్వహించాలి

### బిసి రిజర్వేషన్ల పెంపు కోసం కేంద్రంపై ఒత్తిడి పెంచాలి

### మల్లికార్జునఖర్గేతో బిసి సంఘాల భేటీ

**హైదరాబాద్, జూలై 4, ప్రభాతవార్త:** బిసి రిజర్వేషన్ కోసం కేంద్రంపై ఒత్తిడి పెంచుతామని ఐఎసిసి అధ్యక్షుడు మల్లికార్జునఖర్గే తెలిపారు. శుక్రవారం బిసిసంఘాల నేత జాజుల శ్రీనివాస్‌గౌడ్‌తో ఎఐసిసి చీఫ్ ఖర్గే సమావేశమైనారు. ఈ సందర్భంగా జాజుల శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం ప్రభుత్వం బిసి రిజర్వేషన్లు 42 పెంచుతూ కేంద్రానికి పంపించిన బిల్లును చట్ట రూపంలో దాల్చడానికి జాతీయస్థాయిలో కేంద్రం ప్రభుత్వంపై ఒత్తిడి పెంచాలని సూచించారు. బిసి రిజర్వేషన్లను 42 శాతానికి పెంచిన తర్వాతనే రాష్ట్ర ప్రభుత్వం స్థానిక సంస్థలు ఎన్నికలు నిర్వహించాలని శ్రీనివాస్‌గౌడ్ విజ్ఞప్తి చేశారు. అఖిలపక్షాన్ని కేంద్రంకు తీసుకొని వెళ్ళేందుకు రాష్ట్ర ప్రభుత్వం పూనుకోవాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వంలో జనాభా ప్రకారం నామినేటెడ్ పోస్టులు, ప్రభుత్వ కీలక పదవులలో, బిసిలకు జనాభా ప్రకారం కేటాయించాలన్నారు బిసిలకు ఉపముఖ్యమంత్రి తో పాటు మరో ఇద్దరు బిసిలకు మంత్రివర్గంలో అవకాశం కల్పించాల న్నారు. దేశవ్యాప్తంగా కులగనన కేంద్ర ప్రభుత్వం నిర్వహించిన తర్వాత జనాభా దామస్ ప్రకారం బసి రిజర్వేషన్లు పెంచాలని, దేశంలోని సామాజిక రిజర్వేషన్లపై ఉన్న 50 శాతం పరిమితిని ఎత్తివేయాలని, మహిళా బిల్లులో బిసి మహిళలకు సపోర్టు కల్పించాలని,బిసిలకు చట్టసభలో రాజకీయ రిజర్వేషన్లు కల్పించాలని, ఇందుకోసం దేశవ్యాప్తంగా యుపిఎ పార్టీల పక్షాన పోరాడాలని మల్లికార్జున ఖర్గేను జాజుల శ్రీనివాస్ గౌడ్ కోరారు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తో పాటు పిసిసి అధ్యక్షులు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్, బిసి కుల సంఘాల జేఏసీ చైర్మన్ కుందారం గణేష్ చారి, మాత్మ జ్యోతిబాపూలే జయంతి ఉత్సవ కమిటీ చైర్మన్ చిన్న శ్రీశైలం యాదవ్, ప్రొఫెసర్ బాగయ్యా, కుల్కచర్ల శ్రీనివాస్, తాటికొండ విక్రమ్ గౌడ్, కనకాల శ్యాంకుర్మా, గొడుగు మహేష్ యాదవ్,ఈడిగ శ్రీనివాస్ గౌడ్, నరేష్ ప్రజాపతి, జాజుల లింగ గౌడ్, సంధ్య, సమతా యాదవ్, గూడూరు భాస్కర్, గంగిరెద్దుల నరసింహ, పానుగంటి విజయకుమార్, తదితరులు పాల్గొన్నారు

## 2 కేసుల్లో నాలుగు కిలోలకుపైగా గంజాయిని పట్టుకున్న ఎక్సైజ్ సిబ్బంది

**హైదరాబాద్, జూలై 4, ప్రభాతవార్త:** సరూర్‌నగర్ ఎక్సైజ్‌స్టేషన్ పరిధిలో హాల్మస్‌గూడ ప్రాంతంలో సాబావత్ హనుమ అనే వ్యక్తి గంజాయి అమ్మకాలు జరుపుతుండగా ఎస్‌టిఎఫ్‌సి టీం ఎస్సై శోభారాణి సిబ్బంది 3 కేజీల గంజాయిని పట్టుకున్నారు. నిందితుడు నల్లగొండ జిల్లా పిఏపల్లి మండలం చింతతాండ ప్రాంతానికి చెందినవాడిగా గుర్తించారు. ఈ ప్రాంతంలో నివాసముంటూ గంజాయి అమ్మకాలు జరుపుతున్నట్లు విచారణలో వెల్లడించారని ఎస్‌టిఎఫ్‌సి టీం సిఐ వెంకటేశ్వర్లు తెలిపారు. నిందితుడిని, గంజాయిని సరూర్‌నగర్ స్టేషన్‌లో అప్పగించామన్నారు. అదేవిధంగా ధూల్‌పేటలోని 13 1514/25 నివాసగృహంలో గంజాయి అమ్మకాలు జరుగుతున్నాయనే సమాచారం మేరకు ఎస్‌టిఎఫ్ ఎ టీమ్ సిబ్బంది దాడి నిర్వహించి 1.126 కేజీల గంజాయిని పట్టుకున్నారు. ఈ కేసులో మాయబాయి అనే మహిళను అరెస్టు చేసినట్లు టీమ్‌లీడర్ అంజిరెడ్డి తెలిపారు. బల్‌దేవ్‌సింగ్‌పై కూడ ఈ కేసుతో సంబంధం ఉండడంతో ఆయ నపై కూడ కేసు నమోదు చేసినట్లు తెలిపారు. నింది తురాలిని ధూల్‌పేటలోని ఎక్సైజ్ స్టేషన్‌లో అప్పగించారు.

## వైద్య ఆరోగ్యశాఖలో 2,363 పోస్టుల భర్తీకి గ్రీన్ సిగ్నల్ ఇచ్చిన ఆర్థిక శాఖ

**హైదరాబాద్, జూలై 4, ప్రభాతవార్త:** తెలంగాణలోని నిరుద్యోగులకు ఆర్థికశాఖ శుభవార్త చెప్పింది.వైద్య,ఆరోగ్య శాఖలో దాదాపు 2,363 పోస్టు భర్తీకి ఆర్థిక శాఖ ఆమోదం తెలిపింది. ఈ మేరకు ఈ పోస్టుల భర్తీ కోసం వచ్చిన ప్రతిపాదనలకు స్టేట్ ఫైనాన్స్ డిపార్ట్మెంట్ శుక్రవారం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఈ పోస్టులను కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ పద్ధతిపై భర్తీ చేయనున్నారు. ఇప్పటికే గతంలోని ఉద్యోగులను కొనసాగిస్తూ జీవో ఇవ్వగా తాజాగా కొత్త నియామకానికి సంబంధించి ఆర్థిక శాఖ ఆమోదం లభించడంతో నిరుద్యోగుల్లో ఆనందం వ్యక్తమవుతోంది.

# 50 యేళ్లలో ఒక్క బిసినైనా సిఎం చేశారా?

### కాంగ్రెస్‌పై కేంద్రమంత్రి బండి సంజయ్ ఆగ్రహం

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జూలై 4:** కాంగ్రెస్ పార్టీ నిర్వహించ తలపెట్టిన సభపై కేంద్ర హోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్ తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. కాంగ్రెస్ సభ పేరును 'సామాజిక అన్యాయ సమరభేరి'గా మార్చుకోవాలని ఎద్దేవా చేశారు. ఏ అర్హతతో కాంగ్రెస్ పార్టీ సమరభేరి నిర్వహిస్తోందని ఆయన శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ ప్రశ్నించారు. '50 ఏళ్లకు పైగా దేశాన్ని పాలించిన కాంగ్రెస్ పార్టీ ఒక్క బీసీ నేతకైనా ప్రధాని పదవి ఇచ్చిందా? కనీసం ఒక్క బీసీనైనా ముఖ్య మంత్రిని చేసిందా?' అని సూటిగా ప్రశ్నించారు. రాష్ట్రంలో జనాభాలో సగభాగం ఉన్న బీసీలకు కేబినెట్‌లో ఎన్ని మంత్రి పదవులు కేటాయించారని ఆయన నిలదీశారు. పొన్నం ప్రభాకర్‌కు మంత్రి పదవి ఇవ్వడంతో బీసీల గొంతు వినిపిస్తోందని, అలాంటప్పుడు మిగతా బీసీలకు ఎందుకు అవకాశ మివ్వలేదని అన్నారు. ఇచ్చిన 6 గ్యారంటీలను కూడా అమలు చేయడంలో విఫలమయ్యారని ఆయన ఆరోపించారు. రాష్ట్రంలో యూరియా కొరత అంశంపై కూడా బండి సంజయ్ స్పందించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజలు బీజేపీ వైపు మొగ్గు చూపుతున్నారని, ఇది చూసి ఓర్వలేకే కాంగ్రెస్ ప్రభుత్వం యూరియా కొరత పేరుతో డ్రామాలు ఆడుతోందని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వాన్ని బద్నాం చేసేందుకే ఈ తరహా రాజకీయాలు చేస్తున్నారని మండిపడ్డారు. రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావును అధికారులు తప్పుదోవ పట్టిస్తున్నారని ఆయన ఆరోపించారు. రాష్ట్రం అడిగిన దానికంటే అదనంగా యూరియా సరఫరా చేసేందుకు కేంద్రం సానుకూలంగా ఉందని, ఈ వాస్త వాలను రాష్ట్ర ప్రభుత్వం ప్రజల ముందు ఉంచాలని ఆయన కోరారు.



## స్థానిక సంస్థల్లో 42 శాతం బిసి రిజర్వేషన్లు అమలు చేయకపోతే యుద్ధమే: ఎంపి ఆర్.కృష్ణయ్య

**హైదరాబాద్, జూలై 4, ప్రభాతవార్త:** స్థానిక సంస్థలో 42 శాతం బీసీ రిజర్వేషన్లు అమలు చేయకపోతే రాష్ట్రంలో పెద్ద ఎత్తున ఆందోళనకు సిద్ధంగా ఉండాలని బిసి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్. కృష్ణయ్య బీసీలకు పిలుపు నిచ్చారు.శుక్రవారం విద్యానగర్‌లోని బిసిభవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు."కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో పెట్టింది కామారెడ్డిలో బీసీ డిక్లరేషన్ చేశారు. కాంగ్రెస్ అధినేత రాహుల్‌గాంధీ రాష్ట్రంలోని ప్రతి సభలో జనాభా ప్రకారం రిజర్వేషన్లు పెంచుతామని ప్రకటించారు. రిజర్వేషన్లు పెంచడానికి కులాల వారీగా లెక్కలు తీశారు. అసెంబ్లీలో చట్టం చేశారు. జీవో తీయకుండా కోర్టు కొట్టి వేస్తుందని ఊహాగానాలతో పెండింగ్‌లో పెట్టారు. స్థానిక సంస్థల్లో బిసి రిజర్వేషన్లు పెంచే అధికారం రాష్ట్ర ప్రభుత్వానికి ఉంది. 73,74వ రాజ్యాంగ సవరణ చేసినప్పుడు రాజ్యాంగంలోని ఆర్టికల్ 246 డి6 ప్రకారం స్థానిక సంస్థలోని బీసీ రిజర్వేషన్లు పెంచే అధికారం రాష్ట్ర ప్రభుత్వానికి అధికారం ఇచ్చింది.ఈ నేపథ్యంలో అసెంబ్లీ చట్టం చేశారు. జీవో తీసి వెంటనే ఎన్నికలు జరపవచ్చు. అయితే న్యాయ నిపుణులతో చర్చించి ఏమైనా న్యాయమైన సమస్యలు భావిస్తే సుప్రీంకోర్టుకు ఎవరైనా వెళ్లిన బీసీలు కేసులు గెలిచే అవకాశం ఉంది. ఎందుకంటే జనాభా లెక్కలు ఉన్నవి. అసెంబ్లీ చట్టం చేశారు. అలాగే సుప్రీంకోర్టు ఈడబ్ల్యూ కేసులో 50 సీలింగ్ ఎత్తివేసింది. ఇప్పుడు అన్ని కోణాల్లో చూస్తే గెలిచే అవకాశం ఉంది. చట్ట ప్రకారమైన న్యాయప్రకారములను రాజ్యాంగపరమైన అవరోధాలు లేవు. కావున సుప్రీంకోర్టులో కేసు గెలుస్తుంది. వెంటనే జీవో తీసి ఎన్నికలు జరపాలని విజ్ఞప్తి చేస్తున్నాం. ఒకవేళ కేసు గెలవకపోతే పార్టీ బాధ్యత లోపాలు ప్రజలు కూడా చూసుకుంటారు. బీసీ సంఘాలు చూసుకుంటారు. ప్రజా ఉద్యమాల ద్వారా తాడోపేడో తేలుస్తాం".వెంటనే ప్రభుత్వం జీవో తీసి స్థానిక సంస్థల ఎన్నికలు జరపాలని కృష్ణయ్య డిమాండ్ చేశారు.

## రఘునందన్‌రావును పరామర్శించిన ఎంపి ధర్మపురి అరవింద్

**హైదరాబాద్ జూలై 4 ప్రభాతవార్త:** మెదక్ ఎంపీ రఘునందన్‌రావు కాలికిగాయం కావడంతో శస్త్రచికిత్స చేయించుకుంటున్న సంగతితెలిసిందే. శుక్రవారం ఆయ నను నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అరవింద్ పరామర్శించారు. రఘునందన్‌రావు ఇంటికి వెళ్లి ఆయనతో మాట్లాడారు. ఈ సందర్భంగా సోషల్ మీడియాలో ఫోటో షేర్ చేసి అరవింద్ ఇంట్రెస్టింగ్ పోస్టు పెట్టారు. రఘునందన్ రావును పరామర్శించి, వారి గురించి అడిగి తెలుసుకున్నానని అన్నారు. ఫొటోలో ధర్మపురి అరవింద్ స్టైలిష్ లుక్‌లో కనిపించడంతో స్వాగ్ అంటూ కామెంట్లు పెడుతున్నారు. ఇక గురువారం బండి సంజయ్ సైతం రఘునందన్‌రావును పరామర్శించారు. ఇదిలా ఉంటే తెలంగాణ బిజెపిలో ఇటీవల ఆసక్తికర పరిణామాలు చోటుచేసుకున్నాయి. రఘునందన్‌రావు, ధర్మపురి అరవింద్, ఈటల రాజేందర్, రాజాసింగ్ బిజెపి చీఫ్ పదవిని ఆశించారు. కానీ ఆ పదవి రామచందర్‌రావుకు దక్కడంతో రాజాసింగ్ రాజీనామా చేస్తూ సంచలన నిర్ణయం తీసుకున్నారు. మరోవైపు అరవింద్.. రామచందర్ రావు అధ్యక్ష పదవిబాధ్యతలు స్వీకరించే కార్యక్రమానికి దూరంగా ఉన్నారు.

# సమరభేరి సక్సెస్‌తో కాంగ్రెస్ కేడర్‌లో నయా జోష్

### 50 వేలకుపైగా పాల్గొన్న గ్రామ కాంగ్రెస్ నేతలు

**హైదరాబాద్, జూలై 4, ప్రభాతవార్త:** తెలంగాణ కాంగ్రెస్ నేతృత్వంలో ఎల్‌బి స్టేడియంలో శుక్రవారం మధ్యాహ్నం మూడుగంటలకు నిర్వహించిన సామాజిక న్యాయ సమరభేరి సభ విజయవంతంగా ముగిసింది. టిపిసిసి అధ్యక్షుడు ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ సభకు వేలాదిగా గ్రామ స్థాయి నాయకులు, కార్యకర్తలు హాజరై ప్రాంగణాన్ని జనసంద్రంగా మార్చారు.ఈ సభకు ఎఐసిసి జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే, ప్రధాన కార్యదర్శి కేసి వేణుగోపాల్, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్, టిపిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, పలువురు రాష్ట్ర మంత్రులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.కాంగ్రెస్ పార్టీ పట్ల ప్రజల్లో ఉన్న నమ్మకాన్ని, నైతిక బలాన్ని ఈ సభ మరోసారి రుజువు చేసినట్లైంది. గ్రామీణ స్థాయి నుండి వందలాది బస్సులు, వాహనాల్లో కార్యకర్తలు సభకు తరలివచ్చారు. ప్రతి నియోజకవర్గం నుండి బండి వెనుక బండి కట్టి తరలివచ్చిన తీరుతో సభకు విశేష ఆకర్షణగా నిలిచింది.సభ సక్సెస్ చేసేందుకు పిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ ముందుగానే ఉపాధ్యక్షులను, ప్రధాన కార్యదర్శులను నియోజక వర్గాలకు బాధ్యులుగా నియమించి క్షేత్రస్థాయి పరిశీలన చేయడంతో విజయవంతం అయిన సభ ఈ సభ విజయవంతం కావడంలో టిపిసిసి చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ పాత్ర ముఖ్యమైంది. అధ్యక్ష హోదాలో తొలి భారీ సభను ఘనంగా నిర్వహించి తన నాయకత్వ ప్రతిభను చాటారు. సభలో మల్లికార్జున్ ఖర్గే, రేవంత్ రెడ్డి, భట్టి విక్రమార్క, మహేష్ గౌడ్ ప్రసంగాలు హైలెట్‌గా నిలిచాయి. ప్రజల సమస్యలు, సామాజిక న్యాయం పట్ల కాంగ్రెస్ నిబద్ధతను వారు స్పష్టంగా వ్యక్తీకరించారు. మొత్తం మీద సామాజిక న్యాయభేరి గ్రాండ్ సక్సెస్ తో హస్తం పార్టీ నేతల్లో జోష్ నెలకొంది.



# పుట్టినగడ్డను వదిలినా ఆత్మను వదులుకోలేదు..

## ట్రినిడాడ్ టొబాగోలో ప్రధాని మోడీ

**పోర్ట్‌ఆఫ్ స్పెయిన్, జూలై 4:** ట్రినిడాడ్ అండ్ టొబాగో పర్యటనలో ఉన్న భారత ప్రధాని నరేంద్ర మోదీ అక్కడి భారత సంతతి ప్రజలను ఉద్దేశించి ఉద్వేగభరితంగా ప్రసంగించారు. వారి పూర్వీకుల జీవిత ప్రస్థానం ధైర్య సాహసాలతో కూడుకున్నదని, వారు ఎదుర్కొన్న కష్టాలు ఎవరినైనా కుంగ దీసేవని అన్నారు. అయినా వాటన్నింటినీ ఆశతో, పట్టుదలతో ఎదుర్కొన్నారని కొనియాడారు. మీ పూర్వీకులు గంగ, యమునలను విడిచిపెట్టినా, తమ హృదయాల్లో రామాయణాన్ని మోసుకొచ్చారు. పుట్టిన గడ్డను వదిలినా, తమ ఆత్మను వదులుకోలేదు" అని మోదీ భావోద్వేగంగా అన్నారు. వారు కేవలం వలసదారులు కాదని, శాశ్వతమైన భారత నాగరికత రాయబారులుగా నిలిచారని ప్రధాని ప్రశంసించారు. ట్రినిడాడ్ సాంస్కృతిక, ఆర్థిక, ఆధ్యాత్మిక అభివృద్ధికి భారత సంతతి చేసిన సేవలు అమూల్యమైనవని పేర్కొన్నారు. ఈ దేశ తొలి మహిళా ప్రధానిగా కమలాప్రసాద్ బిస్సెసార్, అధ్యక్షురాలిగా క్రిస్టీన్ కార్లా కంగాలూ, రైతుబిడ్డ నుంచి ప్రధాని గా ఎదిగిన బసదేవ్ పాండే వంటి ఎందరో ప్రముఖులు ఆయన గుర్తు చేసుకున్నారు. "గిర్మిటియాల వారసులుగా ఉన్న మీరు ఇప్పుడు మీ విజయాలు, సేవలతో గుర్తింపు పొందారు. బహుశా ఇక్కడి డబుల్స్, దాల్ పూరీలోనే ఏదో మ్యాజిక్ ఉండేమో, ఎందుకంటే మీరు ఈ దేశ విజయాన్ని రెట్టింపు చేశారు" అని మోదీ చమత్కరించారు. భారత్, ట్రినిడాడ్ మధ్య బంధం తరాలు, భౌగోళిక సరిహద్దులకు అతీతమైనదని మోదీ అన్నారు. ఇక్కడి వీధులకు బెనారస్, పాట్నా, కోల్‌కతా వంటి భారత నగరాల పేర్లు ఉండటం, నవరాత్రి, మహాశివరాత్రి వంటి పండుగలను ఉత్సాహంగా జరుపు కోవడం ఈ బంధానికి నిదర్శనమని చెప్పారు. ఒకప్పుడు లారా ఆటను ఆస్వాదించామని, ఇప్పుడు సునీల్ నరైన్, నికోలస్ పూరన్ మన యువతలో అదే ఉత్సాహాన్ని నింపుతున్నారని క్రికెట్ బంధాన్ని గుర్తుచేశారు. అంతకుముందు పోర్ట్ ఆఫ్ స్పెయిన్ విమానాశ్రయంలో ప్రధాని మోదీకి ఘన స్వాగతం లభించింది. ట్రినిడాడ్ ప్రధాని కమలా ప్రసాద్‌బిస్సెసార్, కేబినెట్ మంత్రులు ఆయనకు స్వాగతం పలికారు. పర్యటనలో భాగంగా మోదీ ఇరుదేశాల ద్వైపాక్షిక సంబంధాల బలోపేతంపై ఉన్నతస్థాయి చర్చలు జరపనున్నారు

# బాసర ట్రిపుల్ ఐటీలో అడ్మిషన్లు

## ఎంపికైన విద్యార్థుల జాబితా విడుదల

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జూలై 4:** తెలంగాణ రాష్ట్రంలోని బాసర, మహబూబ్‌నగర్ ఆర్జీయూకేటీ(రాజీవ్ గాంధీ యూనివర్సిటీ ఆఫ్ నాలెడ్జ్ టెక్నాలజీస్)ల్లో పీయూసీ ప్రథమ సంవత్సరంలో అడ్మిషన్లకు ఎంపికైన విద్యార్థుల తొలి జాబితా విడుదలైంది. ఈ జాబితాను బాసర ఆర్జీయూకేటీ ఇన్‌ఛార్జి వైస్ ఛాన్సలర్ గోవర్ధన్ శుక్రవారం విడుదల చేశారు. ఆరేళ్ల ఇంటిగ్రేటెడ్ బీటెక్ కోర్సుల్లో ప్రవేశాలకు దాదాపు 20 వేల మంది విద్యార్థులు దరఖాస్తు చేశారు. ఫస్ట్ ఫేజ్‌లో 1690 మంది(స్పెషల్ కేటగిరీ సీట్లు మినహాయించి) విద్యార్థులను ఎంపిక చేసినట్లు వెల్లడించారు. ఆర్జీయూ కేటీల్లోని కోర్సులకు ఎంపికైన విద్యార్థులకు జులై 7,8,9 తేదీల్లో యూని వర్సిటీ క్యాంపస్‌లో కౌన్సెలింగ్ నిర్వహించనున్నారు. ఎంపికైన విద్యార్థుల జాబితా అధికారిక వెబ్‌సైట్‌లో అందుబాటులోకి తీసుకువచ్చారు. ఆర్జీయూ కేటీల్లో ప్రవేశాలకు ఎంపికయ్యారో, లేదో తెలుసుకొనేందుకు విద్యార్థులు తమ దరఖాస్తు ఐడీ, పుట్టిన తేదీ నమోదు చేసి వివరాలు తెలుసుకోవచ్చు.

# కేరళలో విజృంభిస్తున్న నిఫా వైరస్

## 38 యేళ్ల మహిళకు పాజిటివ్ నిర్ధారణ

**తిరువనంతపురం, జూలై 4:** కేరళలో మరోసారి నిఫా వైరస్ కలకలం సృష్టిస్తోంది. తాజాగా 38 ఏళ్ల మహిళకు నిఫా పాజిటివ్‌గా నిర్ధరణ అయ్యింది. పుణెలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ వైరాలజీ సదరు రోగి నమూనాలను పరీక్ష చేసి, నిఫా వైరస్ సోకినట్లు నిర్ధారించింది. కేరళ, పాలక్కాడ్ జిల్లాలోని నట్టుకల్‌కు చెందిన సదరు మహిళ ప్రస్తుతం పెరింతల్మన్నలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో




చికిత్స పొందుతున్నారు. ప్రాథమిక పరీక్షలోనే ఆమెకు నిఫా వైరస్ సోకినట్లు గుర్తించారు. తరువాత ఆమె నమూనాలను సేకరించి పుణె ల్యాబ్‌కు పంపించారు. ఇప్పుడు పుణెలోని ఎన్ఐవీ కూడా ఇదే విషయాన్ని నిర్ధారించింది. కేరళలోని కోజికోడ్ జిల్లా, మలప్పురంలోని మంకాడకు చెందిన 18 ఏళ్ల అమ్మాయి జులై 1న నిఫా వైరస్ సోకి మరణించింది. దీనితో కేరళ మరోసారి నిఫా కలకలం చెలరేగింది. కొట్టక్కల్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఆమెకు నిఫా వైరస్ లక్షణాలు ఉన్నట్లు వైద్యులు గుర్తించారు. దీనితో ఆమె నమూనాలను కోజికోడ్ మెడికల్ కాలేజ్ వైరాలజీ ల్యాబ్‌కు పంపించారు. ఆ ల్యాబ్‌లో నిర్వహించిన ప్రాథమిక పరీక్షలో సదరు అమ్మాయికి నిఫా వైరస్ సోకినట్లు నిర్ధరణ అయ్యింది. పుణె ఎన్ఐవీ రిపోర్ట్ కూడా పాజిటివ్‌గానే వచ్చింది. దీనితో సదరు ప్రైవేట్ ఆసుపత్రి నుంచి ఆ అమ్మాయిని మెరుగైన వైద్యం కోసం కోజికోడ్ ఆసుపత్రికి తరలించారు. కానీ అప్పటికే ఆమె బ్రెయిన్ డెడ్ అయినట్లు వైద్యులు పేర్కొన్నారు. కేరళలో నిఫా సెకెండ్ వేవ్‌లో నమోదైన మొదటి మరణం ఇదే కావడం గమనార్హం. దీనితో మృతురాలికి పోస్టుమార్టం నిర్వహించిన వైద్యుడిని ముందు జాగ్రత్తగా క్వారంటైన్‌లో ఉంచారు. కేరళలో నిఫా ఫస్ట్ వేవ్‌లో 24 మంది మరణించారు. ఇప్పుడు సెకెండ్ వేవ్‌లో మరో అమ్మాయి మరణించింది. దీనితో ఈ వైరస్ సోకి మరణించినవారి సంఖ్య 25కు చేరింది. ఈ నేపథ్యంలో కేరళ ప్రభుత్వం అప్రమత్తం అయ్యింది. రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి వీణా జార్జ్, నిఫా వైరస్ వ్యాపించిన రెండు జిల్లాల్లో కంటైన్‌మెంట్ ప్రోటోకాల్‌ను పాటించాలని అధికారులను ఆదేశించారు. వైరస్ వ్యాప్తిపై నిఘాను మరింత పెంచాలని సూచించారు.

# నీళ్లు దోచుకుపోతానంటే చూస్తూ ఊరుకోం..

## మాజీమంత్రి హరీశ్‌రావు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జూలై 4:** నాడైనా నేడైనా తెలంగాణ ప్రయోజనాల ముందు పదవులు బీఆర్ఎస్‌కు తృణప్రాయం అని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు పేర్కొన్నారు. బనకచర్లతో ఏపీ అప్పనంగా నీళ్ళు దోచుకుపోతా అంటే చూస్తూ ఊరుకోం అని ఆయన హెచ్చరించారు. పోలవరం, పోతిరెడ్డిపాడు, పులిచింతల వంటి ఏపీ అక్రమ ప్రాజెక్టులను నిరసిస్తూ 20 ఏళ్ల క్రితం ఇదే రోజున (04.07.2005) మంత్రి పదవులకు రాజీనామాలు చేశాం. కేసీఆర్ ఆదేశానుసారం.. ఉమ్మడి రాష్ట్రంలోనే తెలంగాణ నీటి హక్కుల కోసం పదవులను గడ్డి పోచలుగా భావించి వదులుకున్నం. నీళ్లు, నిధులు, నియామకాలు నినాదంతో కొట్లాడి సాధించుకున్న తెలంగాణలో.. ఆంధ్రప్రదేశ్ బనకచర్ల పేరిట గోదావరి నీళ్ల దోపిడి చేస్తానంటే చూస్తూ ఊరుకుంటామా? అని హరీశ్‌రావు ప్రశ్నించారు. నాడైనా, నేడైనా తెలంగాణ రాష్ట్ర ప్రయోజనాలు దెబ్బ తీసే ఏ కుట్రలనైనా బీఆర్ఎస్ పార్టీ సహించదు. పదవులకు రాజీనామాలు చేయడం మాత్రమే కాదు, పేగులు తెగేదాకా కొట్లాడుతం. తెలంగాణకు అన్యాయం జరగకుండా కాపలా ఉంటం. కంటికి రెప్పలా ఉండి కాపాడుకుంటం. ప్రాంతేతరుడు ద్రోహం చేస్తే..పొలిమేర దాకా తరిమికొడతాం.. ప్రాంతంవాడే ద్రోహం చేస్తే ప్రాణంతోనే పాతర వేస్తం అని హరీశ్‌రావు వ్యాఖ్యానించారు.

# కేంద్రం మెడలు వంచి దేశవ్యాప్తంగా కులగణన సాధించాం

## 2029 ఎన్నికల నాటికి యువత నుంచి కొత్త నాయకత్వం రావాలి

## పార్టీ విస్తృతస్థాయి సమావేశంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

**హైదరాబాద్, జూలై 4, ప్రభాతవార్త:** కేంద్ర ప్రభుత్వం మెడలు వంచి జనగణనలో కుల గణన చేసేలా చేయడంలో మనం విజయం సాధించామని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పునరుద్ఘాటించారు. శుక్రవారం గాంధీభవన్‌లో టిపిసిసి విస్తృతస్థాయి కార్యవర్గ సమావేశంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ కులగణన, సామాజిక న్యాయం, అభివృద్ధి ,సంక్షేమ కార్య క్రమాలు అమలు పరుస్తూ దేశంలోనే అన్ని రాష్ట్రాలకు తెలంగాణ రాష్ట్రం ఆదర్శంగా నిలుస్తోందని అన్నారు. విద్య, ఉద్యోగ, ఉపాధి కల్పనలో మనం చాలా విజయాలు సాధించాం నేను పిసిసి అధ్యక్షుడిగా ఉన్న సమయంలో 45 లక్షల మంది క్రియాశీలక సభ్యత్వం చేసుకున్నామని గుర్తుచేశారు. యూత్ కాంగ్రెస్, ఎన్ఎస్ యుఐ, పార్టీ జిల్లా అధ్యక్షులుగా పనిచేసిన వారికి చాలా మందికి మన ప్రభుత్వంలో పదవులు వరిం చాయని ఆయన తెలిపారు.


పార్టీ పదవులను క్యాజువల్‌గా తీసుకోవద్దు ప్రజల్లోకి వెళ్ళి నాయకులుగా ఎదగడానికి ఉపయోగించుకోవాలని ఆయన హితవు చెప్పారు. పార్టీ పదవులతోనే మీకు గుర్తింపు, గౌరవం ప్రజలతో సంబంధాలు పెంచుకోవడానికి ఒక పని ముట్టుగా ఉపయోగపడి రాజకీయాల్లో మీ ఎదుగుదలకు భవిష్యత్ లో ప్రజాసేవచేయడానికి పోటీ చేసే అర్హతను తీసుకొ స్తాయని తెలిపారు.

రాబోయే రోజుల్లో అసెంబ్లీ, పార్ల మెంట్ సీట్లు పెరగబోతున్నాయి రాబోయే రోజుల్లో నియోజకవర్గాల పునర్విభజన, మహిళా రిజర్వేషను, జమిలి ఎన్నికలు ప్రభావితం చేయబోతు న్నాయి అని ఆయన వివరించారు. నూతన నాయక త్వానికి 2029 ఎన్నికలు వేదిక కావాలి యువత నుంచి కొత్త నాయకత్వం రావాలి అంటే మీరు నాయకులుగా ఎదగాలంటే ఇప్పటి నుంచే కష్టపడాలి అని రేవంత్ ఆకాంక్షను వ్యక్తం చేవారు గ్రామాలకు వెళ్లి క్షేత్ర స్థాయిలో పర్యటించి సమన్వయంతో పనిచేయాలి అపుడు మీకు ప్రజల సమస్యలు తెలుస్తాయని అంతే కాదు మన ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు చేరవేయాలని ఆయన హితవు చెప్పారు.

మనందరం కలిసికట్టుగా ఈరోజు నుంచే ప్రణాళికలు సిద్దం చేసుకుని కష్టపడి మళ్లీ రెండోసారి కాంగ్రెస్‌ని అధికారంలోకి తీసుకురావాలని కోరారు. రాష్ట్రంలో వచ్చే పదేళ్లు కాంగ్రెస్ దే అధికారం అని ఆశాభావం వ్యక్తంచేశారు. సుదీర్ఘ కాలం ప్రజా ప్రతి నిధిగా ఎన్నికైన అరుదైన ఘనత ఖర్గేది వారిని స్ఫూర్తిగా తీసుకుని ముందుకు వెళ్లాలని అన్నారు.

# మోడీ కవితలు చదివి వినిపించిన ట్రినిడాడ్ టొబాగో ప్రధాని!

**పోర్ట్‌ఆఫ్ స్పెయిన్, జూలై 4:** ప్రధాని నరేంద్ర మోదీ పర్యటనలో ఓ అరుదైన, ఆసక్తికరమైన ఘటన చోటుచేసుకుంది. ఆయనలోని పరిపాలనా దక్షుడి గురించే కాకుండా, ఆయనలోని కవి గురించి కూడా ప్రపంచానికి తెలిసేలా ట్రినిడాడ్ అండ్ టొబాగో ప్రధాని వ్యవహరించారు. మోదీ రాసిన కవితలోని పంక్తులను ఆమె స్వయంగా ఉటంకించి, ఆయనకు ప్రత్యేక గౌరవాన్ని అందించారు. ట్రినిడాడ్ అండ్ టొబాగో పర్యటనలో ఉన్న ప్రధాని మోదీ గౌరవార్థం ఏర్పాటు చేసిన ఓ కమ్యూనిటీ కార్యక్రమంలో ఆ దేశ ప్రధాని కమ్లా పెర్సాద్‌బిస్సేస్సర్ పాల్గొన్నారు. కౌవాలోని నేషనల్ సైక్లింగ్ వెలోడ్రోమ్‌లో శుక్రవారం జరిగిన ఈ సభలో ఆమె ప్రసంగిస్తూ, మోదీ రాసిన ఓ గుజరాతీ కవితలోని కొన్ని వాక్యాలను ఉటంకించి అందరినీ



ఆశ్చర్యపరిచారు. ప్రధాని మోదీ గుజరాతీలో రచించిన 'ఆంఖ్ ఆ ధన్య ఛే' (ఈ కళ్లు ధన్యమయ్యాయి) అనే పుస్తకంలోని కవితను ఆమె ప్రస్తావించారు. "గడిచిపోయిన రోజుల్లోకి మనసుతో ప్రయాణించినప్పుడు ఎన్నో జ్ఞాపకాలు కళ్లముందు కదలాడతాయి. కష్టకాలంలో మనతో నడిచిన వారిని ఎప్పటికీ మర్చిపోలేం. ఆ జ్ఞాపకాలే మన ప్రయాణంలో భాగమవుతాయి" అనే భావం వచ్చే కవితా పంక్తులను ఆమె సభలో వినిపించారు. కరేబియన్ దేశమైన ట్రినిడాడ్ అండ్ టొబాగో జనాభాలో దాదాపు 40 శాతం మంది భారత సంతతికి చెందినవారే. భారత విదేశాంగ శాఖ లెక్కల ప్రకారం, ఈ దేశంలో సుమారు 5.56 లక్షల మంది భారతీయ మూలాలున్న ప్రజలు నివసిస్తున్నారు. 1845 నుంచి 1917 మధ్య కాలంలో ఒప్పంద కార్మికులుగా భారత్ నుంచి వలస వెళ్లిన వారి వారసులే వీరిలో అధిక శాతం మంది. ఈ నేపథ్యంలో మోదీ పర్యటన, ఆయన కవితను అక్కడి ప్రధాని ప్రస్తావించడం ఇరు దేశాల మధ్య సాంస్కృతిక బంధానికి నిదర్శనంగా నిలిచింది.

# కొత్త, పాత తేడాలొద్దు.. పార్టీని బలోపేతం చేద్దాం

## విభేదాలు ఉంటే పార్టీలోనే చర్చించుకోవాలి

## స్థానిక సంస్థల ఎన్నికలు, జూబ్లీహిల్స్ ఉపఎన్నికల్లో గెలవాల్సిందే : ఎఐసిసి అధ్యక్షుడు మల్లికార్జునఖర్గే

**హైదరబాద్,జూలై 4,ప్రభాతవార్త:** కాంగ్రెస్‌పార్టీలో కొత్తపాత తేడాలు విడిచిపెట్టఆలి అలాంటి విభేదాలు వద్దని, అణగారిన వర్గాల శ్రేయస్సు కోసం అందరూ ఐక్యంగా వుండి సంస్థాగతంగా గ్రామస్థాయి నుంచి బలోపేతం చేయాలని ఎఐసిసి అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే హితవు చెప్పారు. గాంధీభవన్‌లో శుక్రవారం రాజకీయ వ్యవహారాల కమిటీ సమావేశం ముఖ్యఅతిథిగా హాజరైన ఎఐసిసి అధ్యక్షులు మల్లికార్జున్ ఖర్గే, ఎఐసిసి ప్రధాన కార్యదర్శి కేసి వేణుగోపాల్, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, రాష్ట కాంగ్రెస్ ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్, టిపిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్,డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, పిఎసి సభ్యులు హాజరైనారు.తొలుత పాశమైలారం ఘటనపై నేతలు సంతాపం తెలిపారు. ఈ సమావేశంలో బిసి కులగనణ, ఎస్సీ వర్గీకరణపై ప్రభుత్వవిధానం, జై బాపు జై భీమ్ జై సంవిధాన్ కార్యక్రమాలు, జై సంవిధాన్ బచావో కార్యక్రమాలు, సంస్థాగతంగా పార్టీ నిర్మాణం, జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక, స్థానిక సంస్థలు ఎన్నికలపై ఎఐసిసి అధ్యక్షులు దశదిశను నిర్దే శనం చేశారు. ఖర్గే మాట్లాడుతూ పార్టీకి సంబంధించిన అంశాలపై బయట ఎలాంటి విమర్శలు చేయొద్దనిప్రతిపక్షాలకు అవకాశం ఇవ్వొద్దని సూచించారు. పార్టీ నేతలు ఇష్టానుసారం మాట్లొద్దుడు అని చెప్పారు.పార్టీ నియమ నిబంధనలకు కట్టుబడి ఒకే తాటిపై నిలవాలి పార్టీ బలోపేతం కోసం కమిటీల నియా మకం పూర్తిచేయాల న్నారు. 'నలుగురైదుగురు గ్రూపులు కడితే భయపడతాం అనుకుంటున్నారా?ఇష్టారాజ్యంగా వ్యవహరించే నేతలను నేనూ రాహుల్ అసలు పట్టించుకోం. వాళ్ల సంగతి పార్టీ క్రమశిక్షణా కమిటీ తేలుస్తుంది. అందుకే పార్టీ నేతలు ఇష్టానుసారం మాట్లాడొద్దు. పార్టీ నియమ నిబంధనలకు కట్టుబడి ఒకే తాటిపై నిలవాలి" అని మల్లికార్జుఖర్గే హెచ్చరించారు. "ఈ నెల 30 లోపు పోస్టులన్నీ భర్తీ చేయాలని తుదిగడువు పెట్టడమేకాదు, పదవులు భర్తీ కాకుంటే టిపిసిసి చీఫ్ మహేష్ గౌడ్ దే బాధ్యత" అని ఖర్గే అన్నారు. ఆ సమయంలో సీఎం రేవంత్ కలగజేసుకుని ఇంచార్జ్ మంత్రులు బాధ్యత తీసుకొని పదవుల భర్తీ కోసం లిస్టులు టిపిసిసి చీఫ్ పంపాలని చెప్పారు.' ఖర్గే మాత్రం సిఎం సూచనను తిరస్కరిస్తూ ప్రతిపక్షంలో ఉండగా పార్టీలో పనిచేసిన వారికి,అర్హత ఉన్నవాళ్లకే పదవులు ఇవ్వాలి" అని సూచించారు. పార్టీ మీ అందరికీ ఇచ్చిన పదవులను సద్వినియోగం చేసుకోవాలని ఖర్గే సూచించారు పార్టీ కోసం కష్టపడి పనిచేసిన వారికే..సమర్ధులకు పదవులు ఇవ్వాల్సిందిగా పిసిసి చీఫ్‌కి ఆదేశాలు జారీచేశారు. రాష్ట్ర వ్యవహారాల ఇన్ఛార్జ్ మీనాక్షి నటరాజన్ సమన్వయం చేయాలని దిశానిర్దేశం చేశారు. ఔసీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ జిల్లా ఇన్ఛార్జ్ మంత్రులపై మరోసారి అసంతృప్తి వ్యక్తం చేశారు. ఆయా మంత్రులు నిర్లక్ష్యంగా ఉంటున్నారని సీఎం వ్యాఖ్యానించారు. సీనియర్ నేత వి.హనుమంతరావు మాట్లాడుతూ కొత్త, పాత నేతల మధ్య సమన్వయం లేదన్నారు. కొత్తగా వచ్చినవారు పాతవారితో కలిసి వెళ్తే పార్టీ బలం పెరుగుతుందని చెప్పారు.

రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో మెజారిటీ స్థానాలు గెలుచుకోవడంతో పాటు జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో సత్తా చాటాలని పార్టీ నేతలకు ఏఐసీసీ ప్రెసిడెంట్ మల్లికార్జున ఖర్గే పిలుపునిచ్చారు. గాంధీ భవన్ లో తెలంగాణ కాంగ్రెస్ పొలిటికల్ ఎఫైర్స్ కమిటీ సమావేశం జరిగింది. దాదాపు 2 గంటల పాటు సాగిన ఈ సమావేశానికి ఏఐసీసీ చీఫ్ మల్లికార్జున ఖర్గే ముఖ్య అతిథిగా హాజరు కాగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఏఐసీసీ తెలంగాణ వ్యవహారాల ఇన్ చార్జ్ మీనాక్షి నటరాజన్, పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, పీఏసీ సభ్యులు సమావేశంలో పాల్గొన్నారు. సమావేశం ప్రారంభానికి ముందు ఇటీవల సంగారెడ్డి జిల్లా పాశమైలారం. పారిశ్రామిక వాడలోని సిగాచి పరిశ్రమ పేలుడు ఘటనలో మృతులకు సంతాపం తెలుపుతూ మౌనం పాటించారు.

# రాష్ట్రంలో ఉద్యానపంటల సాగు పెరగాలి

## కూరగాయల దిగుమతిని నియంత్రించాలి

## రైతు కమిషన్ ఛైర్మన్ కోదండరెడ్డి

**హైదరాబాద్, జూలై 4, ప్రభాతవార్త :** తెలంగాణలో ఉద్యాన పంటల సాగు పెరగాల్సిన అవసరం ఉందని, అందుకు అనుగుణంగా చర్యలు తీసుకోవాలని రైతు కమిషన్ ఛైర్మన్ కోదండరెడ్డి అన్నారు. ముఖ్యంగా కూరగాయల పంటల సాగు పెంచాలని చెప్పారు. రాష్ట్రానికి ప్రతీ రోజు లక్షల మెట్రిక్ టన్నుల కూరగాయలు దిగుమతిని అవుతున్నాయని, వాటిని తగ్గించాలంటే రాష్ట్రంలో ఉద్యానవన పంటల సాగు పెరగాలని స్పష్టం చేశారు. హైదరాబాద్‌లోని తన కార్యాలయంలో ఉద్యానవన శాఖ అధికారులతో సమావేశమ య్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పంటల సాగు విస్తీర్ణం పెరగడానికి తీసుకోవాల్సిన చర్యలపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈ సమావేశంలో ఉద్యానవన శాఖలో ఉద్యోగుల కొరత, కూరగాయల సాగు చేసే రైతులకు ఎదురవుతున్న సమస్యలపై అధికారులు ఛైర్మన్ దృష్టికి తీసుకొచ్చారు. ప్రధానంగా గత కొన్నేళ్లుగా ఉద్యానవన శాఖలో ఉద్యోగాల భర్తీ కాకపోవడం, పనిభారం పెరిగిన విషయాలను వివరించారు. రాష్ట్ర వ్యాప్తంగా 60 మంది హార్టికల్చర్ అధికారులే ఉన్నారని దీంతో రైతులకు ఉద్యానవన పంటల సాగుపై అవగాహన కల్పించ లేకపోతున్నట్లు తెలిపారు. మార్కెట్లు అందుబాటులో లేకపోవడం, ఉద్యానవన పంటల సాగులో ఆధునిక పద్ధతులు, యంత్ర పరికరాలు వినియోగించక పోవడంతో దిగుబడిపై ప్రభావం పడుతుందని వారు వివరించారు. అలాగే ఎలాంటి నష్టం లేని పంట పట్టు పురుగుల సాగని, దీన్ని ప్రోత్సహిస్తే రైతులు ఆర్థికంగా బలోపేతం అయ్యే అవకాశాలు ఉన్నాయని అధికారులు ఛైర్మన్ దృష్టికి తీసుకొచ్చారు. ఈసమావేశంలో కమిషన్ సభ్యులు భవానిరెడ్డి, గంగాదర్, సిహెచ్ వెంకన్న, ఉద్యనశాఖ అధికారుల సందీప్, విద్యాసాగర్ తదితరులు పాల్గొన్నారు.

# బిజెపి నేత ఇంటి వద్ద రోహింగ్యాల అనుమానాస్పద సంచారం

## వాహనంలో పెట్రోల్ డబ్బా, సుత్తి, కట్టర్ లభ్యం

## మీర్‌పేట్ పిఎస్‌లో బిజెపి నేత అందెల ఫిర్యాదు

**హైదరాబాద్ (సరూర్‌నగర్), జూలై 4, ప్రభాతవార్త:** హైదరాబాద్ నగర శివార్లలోని ఓ బిజెపి ముఖ్య నేత ఇంటి ముందు రోహింగ్యాల అనుమానాస్పద సంచారం కలకలం రేపింది. పాత సామానులు కొనుగోలు చేయడానికి వచ్చిన వారిలా ఇంటి ముందు తిరుగుతుండడంతో రెక్కీ నిర్వహిస్తు న్నారని అనుమానం వచ్చి వారిని పోలీసులకు అప్పగించారు. బర్మా నుండి శరణార్థులుగా వచ్చిన రోహింగ్యాలను తిప్పి పంపాలనీ అదే విధంగా హైదరాబాద్ శివారు ప్రాంతాల్లో అక్రమంగా మదర్సాలు నిర్వహి స్తున్నారని ఆరోపిస్తూ ఇటీవల కాలంగా పలు ఆందోళన కార్యక్రమాలు చేస్తున్న బిజెపి నేత ఇంటి వద్దే రోహింగ్యాలు తిరుగుతుండడం అదీ గారి వాహనంలో సుత్తి, పెట్రోలు, ఇనుపరాడ్, కట్టర్ లభించడం అది రెక్కీగా అనుమానాలకు బలం చేకూరి నట్లైంది. ఈ నేపథ్యంలో బిజెపి నేత పోలీసులకు ఫిర్యాదు



మీర్‌పేట్ ఇన్‌స్పెక్టర్‌కు ఫిర్యాదు చేస్తున్న మహేశ్వరం బిజెపి ఇన్‌ఛార్జి అందెల శ్రీరాములు యాదవ్, చిత్రంలో రంగారెడ్డి జిల్లా బిజెపి అధ్యక్షుడు రాజ్‌భూపాల్‌గౌడ్ తదితరులు

చేశారు. తీవ్ర కలకలం రేపిన ఈ సంఘటనకు సంబంధించిన పూర్తి వివరాలిలా ఉన్నాయి. హైదరాబాద్ శివార్లలోని నాదర్‌గుల్ విజయలక్ష్మినగర్ కాలనీలో నివసిస్తున్న మహేశ్వరం నియోజకవర్గ బిజెపి ఇంఛార్జి, రాష్ట్ర పార్టీ కార్యవర్గ సభ్యుడైన అందెల శ్రీరాములు యాదవ్ ఇంటి ముందు శుక్రవారం ఉదయం ట్రాలీ ఏర్పాటు ఉన్న ఎపి 29 జె 7464 నెంబరు గల ద్విచక్ర వాహనాన్ని ఆపుకొని ఉన్న గుర్తు తెలియని వ్యక్తి ఆగి ఉన్నాడు. దీంతో గమనించిన అందెల ఇంట్లో ఉన్న వారు అనుమానంతో సదరు వ్యక్తిని ప్రశ్నిస్తూ వాహనాన్ని తనిఖీ చేశారు. పాత సామానులు అమ్ముకు నేలాగా వ్యక్తి, వాహనం ఉన్నప్పటికీ ట్రాలీలోని ఓ బాక్సులో నిండుగా ఉన్న పెట్రోల్ లీటర్ డబ్బా, ఒక సుత్తి, కట్టర్‌తోపాటు రాడ్ కనిపించాయి. దీంతో సదరు వ్యక్తిని నిల దీయగా వాహనాన్ని వదిలి భయంతో పారిపోయాడు.

### మీర్‌పేట్ పిఎస్‌లో ఫిర్యాదు చేసిన అందెల

ఈ నేపథ్యంలో బిజెపి నేత అందెల శ్రీరాములు యాదవ్ మీర్‌పేట్ పిఎస్‌లో ఫిర్యాదు చేశారు. రంగారెడ్డి జిల్లా బిజెపి అధ్యక్షుడు పంతంగి రాజ్‌భూపాల్‌గౌడ్, మాజీ అధ్యక్షుడు బొక్క నర్సింహారెడ్డి, సింగిల్ విండో మాజీ ఛైర్మన్ కొలన్ శంకర్‌రెడ్డితో పాటు పెద్ద ఎత్తునన తరలివచ్చిన పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి ఇన్స్‌పెక్టర్ కీసర నాగరాజుకు ఫిర్యాదు చేశారు.

# ఆర్టీసీలో ఫ్రీ వైఫై..

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జూలై 4:** తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (ఆర్టీసీ) ప్రజారవాణా వ్యవస్థను ఆధునికీకరించడమేకాక, ప్రయాణికుల సౌకర్యాన్ని మెరుగుపర్చే ఉద్దేశంతో కీలక నిర్ణయం తీసుకుంది. ఇకపై రాష్ట్రవ్యాప్తంగా అన్ని బస్సులు, బస్ స్టాప్‌లలో ఉచిత వైఫై సేవలు అందించనున్నట్లు ఆర్టీసీ ప్రకటించింది. ఈ డిజిటల్ కార్యక్రమాన్ని అమలు చేయడానికి ఆర్టీసి ఒక ప్రైవేట్ ఇంటర్నెట్ సర్వీస్ ప్రొవైడర్‌తో భాగస్వామ్యం కుదుర్చుకుంది. ఈ సహకారంతో, ప్రయాణీకులు ప్రయాణించేటప్పుడు లేదా బస్సు కోసం వేచి ఉన్నప్పుడు ఎక్కడైనా అంతరాయం లేని ఇంటర్నెట్ కనెక్టివిటీని పొందగలుగుతారు. ఈ ప్రాజెక్టు సాంకేతిక, ఆర్థిక అంశాలను ఇప్పటికే ప్రతిపాదన రూపంలో రాష్ట్ర ప్రభుత్వానికి సమర్పించారు. రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ సమక్షంలో జరిగిన ఓ సమావేశంలో ఆర్టీసీ ఉన్నతాధికారులు ఈ ప్రణాళికను వివరించారు. ప్రయాణికులకు కలిగే ప్రయోజనాలను చూసిన తర్వాత మంత్రులు అధికారికంగా ఈ ప్రాజెక్టును ఆమోదించడంతో రాష్ట్రవ్యాప్తంగా అమలు చేయడానికి తొలి అడుగుపడింది.

# నటి రన్యారావు రూ.34.12 కోట్ల ఆస్తులు ఇడి జప్తు

**బెంగళూరు, జూలై 18:** బంగారం స్మగ్లింగ్‌తో సంబంధం ఉన్న మనీ లాండరింగ్ కేసులో కన్నడ నటి రన్యా రావుకు చెందిన రూ. 34.12 కోట్ల విలువైన ఆస్తులను జప్తు చేసినట్లు అధికారులు శుక్రవారం ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ అధికారులు ప్రకటించారు.



మనీలాండరింగ్ నిరోధక చట్టం (పీఎంఎల్ఏ) కింద ఈడీ ఈ చర్యలు చేపట్టింది. జప్తు చేసిన ఆస్తులలో బెంగళూరులోని విక్టోరియా లేఅవుట్‌లో ఉన్న ఒక నివాస గృహం, అర్కావతి లేఅవుట్‌లోని నివాస స్థలం, తుమకూరులోని పారిశ్రామిక భూమి, అనేకల్ తాలూకాలోని వ్యవసాయ భూమి ఉన్నాయని అధికారులు తెలిపారు. ఈ ఆస్తుల మార్కెట్ విలువ సుమారు రూ. 34.12 కోట్లు ఉంటుందని అంచనా వేశారు. గతంలో డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్ (డీఆర్ఐ), సీబీఐ నమోదు చేసిన బంగారం స్మగ్లింగ్ కేసుల ఆధారంగా ఈడీ దర్యాప్తు ప్రారంభించింది. ఈ కేసులో భాగంగానే నటి రన్యా రావుపై దృష్టి సారించింది. ఆమె అసలు పేరు హర్షవర్ధిని రన్యా అయిన ఈ నటిని మార్చి 3న దుబాయ్ నుంచి బెంగళూరులోని కెంపెగౌడ అంతర్జాతీయ విమానాశ్రయానికి రాగానే అధికారులు అదుపులోకి తీసుకున్నారు. పక్కా సమాచారంతో జరిపిన తనిఖీలలో ఆమె వద్ద నుంచి రూ. 12.56 కోట్ల విలువైన 14.2 కిలోల బంగారు కడ్డీలను స్వాధీనం చేసుకున్నారు. అక్రమ నగదు లావాదేవీలలో రన్యా రావు ప్రమేయాన్ని నిర్ధారించేందుకు ఆమె డిజిటల్ ఆధారాలను అధికారులు క్షుణ్ణంగా పరిశీలించారు. ఆమె ఫోన్‌లోని ఇన్‌వాయిస్‌లు, ఎగుమతి పత్రాలు, విదేశీ లావాదేవీల రికార్డులు, రికార్డ్ చేసిన చాట్‌లను విశ్లేషించారు. ఈ బంగారం స్మగ్లింగ్ సిండికేట్‌లో ఆమె క్రియాశీలక పాత్ర పోషించినట్లు ఈ ఆధారాల ద్వారా రుజువైందని అధికారులు వివరించారు. ఈ కేసులో దర్యాప్తు కొనసాగుతోంది.

# బిసిలకు కాంగ్రెస్ ఎన్ని సీట్లు ఇచ్చిందో చెప్పాలి

## బిజెపి ఎమ్మెల్యే పాయల్ శంకర్

**హైదరాబాద్, జూలై 4, ప్రభాతవార్త:** ఆదిలాబాద్ బిజెపి ఎంఎల్ఏ పాయల్ శంకర్ తెలంగాణాలోని కాంగ్రెస్ ప్రభుత్వంపై మరోసారి తీవ్ర విమర్శలు చేశారు.శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడారు..కాంగ్రెస్ బిసిలకు అన్యాయం చేస్తోందంటూ మండిపడ్డారు.బిసిలకు ఎన్ని పదవులు ఇచ్చిందో బహిరంగంగా చెప్పాలని డిమాండ్ చేశారు.ప్రభుత్వం బిసి సంఘాలను మోసం చేస్తూ,వారి అవసరాలను పట్టించుకోలేదని విమర్శించారు ఎన్నికల ముందు కామారెడ్డి డిక్లరేషన్‌లో బిసిలకు 42 రిజర్వేషన్ హామీ ఇచ్చి, తూతూ మంత్రంగా సర్వే జరిపి చేతులు దులుపుకుందని మండిపడ్డారు.కేంద్రంలో కాంగ్రెస్ ఎప్పటికీ అధికారంలోకి రాదన్నారు.దేశ ప్రజలు కాంగ్రెస్‌కు ప్రతిపక్ష హోదా కూడా ఇవ్వలేదన్నారు. కాంగ్రెస్ సామాజిక న్యాయం ఎన్నటికీ చేయలేదని తెలిపారు.కేవలం తెలంగాణాను దోచుకునేందుకు,ఢిల్లీకి మూటలు పంపడానికే కాంగ్రెస్ వాడుకుటుందని మండిపడ్డారు.కాంగ్రెస్ పార్టీ మోసం చేసినంత ఏ పార్టీ ప్రజలను మోసం చేయలేదని,బిసిల గురించి మాట్లాడే నైతిక హక్కు కాంగ్రెస్ పార్టీ నాయకులకు లేదని పాయల్ శంకర్ పేర్కొన్నారు.బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్రరావు నియామకంపై టిపిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు.బిసిలను అవమానించిన పార్టీ కాంగ్రెస్ పార్టీ అన్నారు.బిసి వాదాన్ని బలంగా వినిపించేది కేవలం బిజెపి మాత్రమే అని స్పష్టం చేశారు.

# తాలిబన్ ప్రభుత్వాన్ని గుర్తించిన రష్యా

**మాస్కో, జూలై 4:** ప్రపంచ రాజకీయాల్లో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఆఫ్ఘనిస్థాన్ లోని తాలిబాన్ ప్రభుత్వాన్ని రష్యా అధికారికంగా గుర్తించింది. 2021లో తాలిబాన్లు అధికారాన్ని హస్తగతం చేసుకున్నప్పటి నుంచి ఏ దేశం కూడా వారి పాలనను గుర్తించని నేపథ్యంలో, రష్యా తీసుకున్న ఈ నిర్ణయం అంతర్జాతీయ సంచలనంగా మారింది.తాలిబన్లు నియమించిన కొత్త ఆఫ్ఘన్ రాయబారి గుల్ హసన్ హసన్ ను గుర్తిస్తున్నట్టు రష్యా ప్రకటించింది. గుల్ హసన్ నుంచి రష్యా ఉప విదేశాంగ మంత్రి ఆండ్రీ రుడెంకో అధికారిక పత్రాలను స్వీకరించారు. రష్యా విదేశాంగ శాఖ ఈ మేరకు ప్రకటన విడుదల చేసింది. దీంతో పాటు, మాస్కోలోని ఆఫ్ఘన్ రాయబార కార్యాలయంపై గత ప్రభుత్వ జెండాను తొలగించి, తాలిబాన్ల తెల్ల జెండాను ఎగురవేశారు. ఈ గుర్తింపుతో ఇరు దేశాల మధ్య పలు రంగాల్లో నిర్మాణాత్మక ద్వైపాక్షిక సహకారం పెరుగుతుందని ఆశిస్తున్నట్లు రష్యా పేర్కొంది. ముఖ్యంగా వాణిజ్యం, ఇంధనం, రవాణా, వ్యవసాయ రంగాల్లో కలిసి పనిచేయడానికి ఆసక్తిగా ఉన్నట్లు తెలిపింది. రష్యా నిర్ణయాన్ని తాలిబన్ ప్రభుత్వం స్వాగతించింది. ఇది తమ ద్వైపాక్షిక సంబంధాల చరిత్రలో ఒక పెద్ద విజయమని తాలిబన్ తాత్కాలిక విదేశాంగ మంత్రి ఆమిర్ ఖాన్ ముత్తాకి అన్నారు. 2021 ఆగస్టులో తాలిబన్లు కాబూల్‌ను ఆక్రమించుకున్నప్పటికీ, రష్యా మాత్రం తన రాయబార కార్యాలయాన్ని మూసివేయకుండా వారితో సంబంధాలు కొనసాగిస్తూ వచ్చింది. కాగా, మానవ హక్కుల విషయంలో అంతర్జాతీయ ప్రమాణాలను పాటించాలని ప్రపంచ దేశాలు తాలిబాన్లపై ఒత్తిడి తెస్తున్నాయి. ఈ కారణంగానే ఇప్పటివరకు ఏ దేశం కూడా వారి ప్రభుత్వాన్ని అధికారికంగా గుర్తించేందుకు ముందుకు రాలేదు.

# చరిత్ర సృష్టించిన 'హరి హర వీరమల్లు' ట్రైలర్



పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ సినిమా వస్తుందంటే.. తెలుగు సినీ పరిశ్రమలో సరికొత్త రికార్డులు నమోదవ్వడం సహజం. తాజాగా హరి హర వీరమల్లు ట్రైలర్‌తో ఈ విషయం మరోసారి రుజువైంది. ట్రైలర్ విడుదలైన క్షణం నుండి అభిమానులు, ప్రేక్షకులు బ్రహ్మ రథం పడుతున్నారు. పవన్ కళ్యాణ్‌ను మును పెన్నడూ చూడని చారిత్రక యోధుడు పాత్రలో కనిపించడం అందరినీ ఆకర్షించింది. ట్రైలర్‌లో ప్రతి ఫ్రేమ్ అద్భుతంగా ఉందంటూ సినీ ప్రముఖులు సైతం ప్రశంసిస్తున్నారు. పవన్ కళ్యాణ్ కట్టిపడేసే లుక్స్, స్క్రీన్ ప్రజెన్స్‌తో, ఇటీవల కాలంలో వచ్చిన అత్యుత్తమమైన వాటిలో ఒకటిగా హరి హర వీరమల్లు ట్రైలర్ ప్రశంసలు అందుకుంటోంది. హరి హర వీరమల్లు చిత్రం ట్రైలర్ నుంచే ఇండస్ట్రీ రికార్డులను బద్దలు కొట్టడం ప్రారంభిస్తుందని దర్శకుడు జ్యోతి కృష్ణ చెప్పారు. ఆయన మాటే నిజమైంది. హరి హర వీరమల్లు ట్రైలర్ తెలుగులో కేవలం 24 గంటల్లోనే 48 మిలియన్లకు పైగా వ్యూస్ సాధించి, తెలుగు సినిమాల పరంగా సరికొత్త రికార్డును నెలకొల్పింది. అన్ని భాషల్లో కలిపి దాదాపు 62 మిలియన్ల వ్యూస్ సాధించింది. దర్శకుడు జ్యోతి కృష్ణ ట్రైలర్‌ను రూపొందించిన తీరు అందరినీ మంత్రముగ్దుల్ని చేసింది. ట్రైలర్ అందరి అంచనాలకు మించేలా ఉంది. వీరమల్లును ఆయన ఒక పాత్రగా కాకుండా, సినిమాటిక్ శక్తిగా మలిచారు. బలమైన భావోద్వేగాలు, అద్భుతమైన యుద్ధ సన్నివేశాల మేళవింపుతో ట్రైలర్‌ను మలిచిన తీరు మెప్పించింది. దీని ప్రభావం అన్ని వర్గాల ప్రేక్షకులలో ప్రతిధ్వనిస్తోంది. ఆస్కార్ విజేత ఎం.ఎం. కీరవాణి తన నేపథ్య సంగీతంతో ట్రైలర్‌ను మరో స్థాయికి తీసుకెళ్ళారు. విజువల్స్‌కు ప్రాణం పోశారని చెప్పవచ్చు. తన సంగీతంతో అటు భావోద్వేగ సన్నివేశాలు, ఇటు యుద్ధ సన్నివేశాల గాఢతను పెంచారు. చారిత్రక కథకు తగ్గట్టుగా కీరవాణి అందించిన సంగీతం.. ప్రేక్షకులను కథలో లీనమయ్యేలా చేస్తోంది. ఛాయాగ్రాహకులు జ్ఞాన శేఖర్ వి.ఎస్., మనోజ్ పరమహంస సన్నివేశాలను ఎంతో అందంగా చిత్రీకరించారు. ప్రతి ఫ్రేమ్ ఒక పెయింటింగ్ లా ఉంది. చారిత్రక కథకు తగ్గట్టు భారీతనాన్ని చూపిస్తుంటే.. కథలోని భావోద్వేగాన్ని, వీరమల్లులోని ఆవేశాన్ని చక్కగా కెమెరాలో బంధించారు. ఇక ప్రముఖ కళా దర్శకుడు తోట తరణి తన అద్భుతమైన సెట్‌లతో ప్రేక్షకులను మొఘల్‌యుగంలోకి తీసుకువెళ్లారు. మెగా సూర్య ప్రొడక్షన్స్ పతాకంపై ఎ.ఎం. రత్నం సమర్పణలో ఎ.దయాకర్ రావు నిర్మించిన ఈ చిత్ర నిర్మాణ విలువలు అద్భుతంగా ఉన్నాయి.

# యాక్షన్, అమేజింగ్ విజువల్స్ మూవీ 'తమ్ముడు'

సంక్రాంతికి వస్తున్నాం బ్లాక్ బస్టర్ హిట్ తర్వాత ప్రముఖ నిర్మాణ సంస్థ శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ నిర్మాణంలో వస్తున్న మరో సూపర్ హిట్ మూవీ తమ్ముడు. దిల్ రాజు, శిరీష్ నిర్మిస్తున్న ఈ చిత్రానికి శ్రీరామ్ వేణు దర్శకత్వం వహిస్తున్నారు. లయ, వర్ష బొల్లమ్మ, సప్తమి గౌడ కీలక పాత్రలు పోషిస్తున్నారు. తమ్ముడు సినిమా ఈ నెల 4న వరల్డ్ వైడ్‌గా గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్‌కు రాబోతోంది. ఈ నేపథ్యంలో మూవీ హైలైట్స్‌తో పాటు చిత్ర క్యారెక్టర్‌లో నటించిన తన ఎక్సిపీరియన్స్ తెలిపారు హీరోయిన్ వర్ష బొల్లమ్మ. నేను గతంలో ఎస్వీసీ సంస్థలో జాను అనే మూవీలో నటించాను. తమ్ముడు కోసం పిలవగానే వచ్చి ఆడిషన్ ఇచ్చాను. లుక్ టెస్ట్‌లో వెంటనే ఒకే అయ్యాను. దర్శకుడు వేణు ఈ మూవీ గురించి చెబుతూ అడవిలో షూటింగ్ చేయాల్సి ఉంటుంది. మీకు ఇబ్బంది ఉంటే ఇప్పుడే చెప్పండి అన్నారు. నేను ఛాలెంజింగ్‌గా తీసుకుని చేస్తాను అని చెప్పాను. అలా చిత్ర క్యారెక్టర్‌కు నేను సెలెక్ట్ అయ్యాను. హీరో నితిన్ క్యారెక్టర్ జై కు చిత్ర డ్రైవింగ్ ఫోర్స్‌లా ఉంటుంది. జై కు అన్ కండిషనల్‌గా సపోర్ట్ చేస్తుంది చిత్ర. వారి మధ్య ఉన్న రిలేషన్ చాలా బాగుంటుంది. ఈ సినిమా కోసం నేను మార్షల్ ఆర్ట్స్ నేర్చుకున్నా. రియల్ లైఫ్‌లో కూడా మార్షల్ ఆర్ట్స్ నేర్చుకోవాలని ఉండేది. అది ఈ సినిమాతో కుదిరింది. మార్షల్ ఆర్ట్స్ నేర్చుకోవడాన్ని ఎంజాయ్ చేశాను. ఏదైనా చేయాలనుకుంటే వెంటనే అడుగువేసే క్యారెక్టర్ చిత్రది. నా రియల్ లైఫ్‌లో నేను అలా కాదు. తమ్ముడు మూవీ టైటిల్ ఈ కథకు యాప్ట్. పవన్ ఒక సూపర్ హిట్ మూవీ ఈ టైటిల్‌తో ఉండటం మేము హ్యాపీగా ఫీలయ్యే విషయం. నా క్యారెక్టర్‌కు తమ్ముడు కథలో మంచి ప్రాధాన్యత ఉంటుంది. బిగిల్ మూవీ తర్వాత ఫిజికల్‌గా శ్రమించిన చిత్రమిదే. ఈ చిత్రంలో లయ మరో కీ రోల్ చేస్తున్నారు. ఆమె జర్నీ మా అందరికీ ఇన్స్పిరేషన్. హీరోయిన్‌గా ఒక కెరీర్ చూసిన ఆమె పర్సనల్ లైఫ్ లోకి వెళ్లడం, మళ్లీ ఇప్పుడు రీ ఎంట్రీ ఇవ్వడం స్ఫూర్తిగా తీసుకోవచ్చు. ఆమె కెరీర్ లో జరిగిన విశేషాలు మాతో షేర్ చేసుకునే వారు. తమ్ముడు మూవీని ఏదైనా స్టూడియోలో ఉన్న చిన్న అడవిలో కూడా షూట్ చేయొచ్చు కానీ సహజంగా ఉండేలా మారేడుమిల్లి అడవిలో చిత్రీకరించాం. అది దట్టమైన అడవి. వర్షాకాలంలో పాములు, తేళ్లు కనిపించేవి. రాత్రిపూట షూటింగ్‌లో కేవలం కాగడాలు పట్టుకుని నటించాం. షూటింగ్ లో పెద్దవాళ్లు ఉన్నారు, పిల్లలు ఉన్నారు. వాళ్లు కూడా ఇబ్బందిపడ్డారు. లయగారు అమెరికా నుంచి వచ్చారు. అక్కడ సుకుమారంగా ఉండి ఈ అడవిలో చెప్పులు లేకుండా నటించారు. రోజూ ఏదో ఒక గాయం అయ్యేది. అయినా ఉత్సాహంగా షూటింగ్ లో పాల్గొనేవారు. నాకు నితిన్ క్యారెక్టర్స్‌కు షూస్ ఉంటాయి. ఎస్వీసీ సంస్థలో మరోసారి నటించడం హ్యాపీగా ఉంది. జాను మూవీ చేసినప్పుడు నేను కొత్త నటిని. అయినా నాకు మంచి రెస్పెక్ట్ ఇచ్చారు. ఇప్పుడు కూడా అలా గౌరవంగానే చూసుకున్నారు. నేను హీరోయిన్‌గా పలు చిత్రాలు చేశా. హీరోయిన్, క్యారెక్టర్ ఆర్టిస్టు... ఇలాంటి తేడాలు చూడాలని అనుకోవడం లేదు. వర్ష బాగా పర్ ఫార్మ్ చేసింది అనే పేరు తెచ్చుకుంటే చాలు. తమ్ముడు కథ విన్నప్పుడు ఇది కొత్తగా ఉంది ఛాలెంజింగ్‌గా ఉంది అనిపించింది. అందుకే నటించాను. నిత్యామీనన్‌ను ఎగ్జాంపుల్‌గా తీసుకుంటే తనకు పర్ ఫార్మర్‌గా పేరుంది. నేనూ అలాగే పేరు తెచ్చుకోవాలని ఆశిస్తున్నా. హీరో నితిన్ చాలా కామ్‌గా ఉంటారని ఒకఇంప్రెషన్ ఉంది. కానీ ఆయన చాలా ఫన్ పర్సన్. అడవిలో షూటింగ్ చేస్తున్నప్పుడు ఫోన్స్ అవీ ఏమీ లేవు. మేము సరదాగా మాట్లాడుకునేవాళ్లం. చిన్నా, పెద్దా ప్రతి ఆర్టిస్టుకు ఆయన గౌరవం ఇచ్చేవారు. నేను జోక్స్ చెప్పి ఆయనను విసిగించా. నాకు అనిపించింది సోషల్ మీడియా ద్వారా వ్యక్తం చేస్తుంటా. ఈ చిత్రంలో నా క్యారెక్టర్ పర్ ఫార్మ్ చేసేప్పుడు అప్పటికప్పుడు ఏదైనా అనిపిస్తే చెప్పాను. కానీ డైరెక్టర్ డైలాగ్‌లో ఉన్నది ఉన్నట్లు స్ట్రిక్ట్‌గా చెప్పమనేవారు. నేను మిడిల్ క్లాస్ మెలోడీస్ చేసినప్పుడు స్పాంటేనియస్‌గా చాలా ఇంప్రూవ్ చేసి డైలాగ్స్ చెప్పాం. ఆ మూవీకి అలా కుదిరింది.



హీరోయిన్ వర్ష బొల్లమ్మ

# 'మిస్టీరియస్'లో నాగభూషణం మనవడు

అలనాటి రక్త కన్నీరు నాగభూషణం మనవడు అబిద్ భూషణ్ హీరోగా బిగ్ బాస్ ఫేమ్ రోహిత్ సహాని జంటగా వస్తున్న చిత్రం మిస్టీరియస్. ఆష్లీ క్రియేషన్స్ బ్యానర్‌పై ఉషా మరియు శివాని నిర్మించిన ఈ చిత్రానికి మహి కోమటిరెడ్డి దర్శకత్వం వహించారు. రియా కపూర్ మరియు మేఘనా రాజ్‌పుత్ ప్రధాన పాత్రల్లో తెరకెక్కిన ఈ చిత్రం నుండి ఇప్పటికే రిలీజ్ చేసిన రెండు పాటలతో సినిమా మీద అంచనాలు పెరిగాయి. ఇక తాజాగా ఈ చిత్ర టీజర్‌ను ఘనంగా లాంచ్ చేసింది మూవీ టీమ్ ఈ సందర్భంగా డైరెక్టర్ మహి కోమటిరెడ్డి మాట్లాడుతూ, సస్పెన్స్ జానర్ లో వస్తున్న ఈ సినిమా ఆడియన్స్‌కి సరికొత్త ఎక్స్పీరియన్స్ ఇస్తుందని, తాజాగా టీజర్‌కి వచ్చిన రెస్పాన్స్‌తో సినిమా సక్సెస్‌పై మరింత కాన్ఫిడెన్స్ పెరిగిందని చెప్పుకొచ్చారు. ఇక నిర్మాతలు ఉషా మరియు శివాని మాట్లాడుతూ, సినిమాని ఎక్కడా కాంప్రమైజ్ కాకుండా నిర్మించామని, టీజర్ అందరికీ నచ్చడం సంతోషమని, ఫ్యూచర్లో మరిన్ని మంచి సినిమాలతో ఆడియన్స్‌ని ఎంటర్ టైన్ చేస్తామని తెలిపారు. ఇక సినిమాలో జంటగా నటించిన అబిద్ భూషణ్, రోహిత్ సహాని మాట్లాడుతూ, ఇంతమంచి అవకాశాన్ని ఇచ్చిన డైరెక్టర్ ,ప్రొడ్యూసర్స్‌కి చాలా థాంక్స్ అని ,ఇప్పటికే రిలీజ్ అయిన రెండు పాటలు మంచి టాక్ తెచ్చుకోవడంతో పాటు రిలీజ్ అయిన టీజర్ కి కూడా మంచి అప్లాజ్ రావడం ఆనందంగా ఉందన్ని తమ సంతోషాన్ని పంచుకున్నారు. ఇక ఈ టీజర్ లాంచ్ ఈవెంట్లో సినిమా నటీనటులు, యూనిట్ అంతా పాల్గొని సందడి చేయడం విశేషం. నటీనటులు: ప్రధాన తారాగణం, రోహిత్ సహాని (బిగ్ బాస్ ఫేమ్),అబిద్ భూషణ్ (ప్రముఖ నటుడు రక్త కన్నీరు నాగభూషణ్ మనవడు), రియా కపూర్ (హీరోయిన్), మేఘనా రాజపుత్(హీరోయిన్), బలరాజ్ వాడి (కన్నడ నటుడు).



# 'రామాయణ: ది ఇంట్రడక్షన్' గ్రౌండ్ బ్రేకింగ్ ఈస్ట్-వెస్ట్ కొలాబరేషన్

5000 సంవత్సరాల క్రితం జరిగిన గొప్ప ఇతిహాసం ప్రపంచ వ్యాప్తంగా 2.5 బిలియన్ల మంది భక్తికి ప్రతీక నమిత్ మల్హోత్రా రామాయణ రెండు భాగాల లైవ్‌ఆక్షన్ సినిమాటిక్ యూనివర్స్‌గా, ఇప్పటివరకు రూపొందిన అతి పెద్ద టెంట్‌పోల్ సినిమాల స్థాయిని రీఇమాజిన్ చేయనుంది. ఈ చిత్రం హాలీవుడ్, భారతదేశానికి చెందిన ప్రతిభావంతులను ఒకే వేదికపైకి తీసుకొచ్చే, ఇప్పటివరకు ఎప్పుడూ చూడని గొప్ప సినిమాటిక్ ఎక్స్ పీరియన్స్‌ని అందించబోతోంది. నితేశ్ తివారీ దర్శకత్వంలో, నమిత్ మల్హోత్రా ప్రైమ్ ఫోకస్ స్టూడియోస్, 8 సార్లు ఆస్కార్ అందుకున్న విఎఫ్ఎక్స్ స్టూడియో డిఎన్ఇజి సంయుక్తంగా, యాష్ మాన్‌స్టర్ మైండ్ క్రియేషన్స్‌తో కలిసి నిర్మిస్తున్న రామాయణ, ఐఎంఎక్స్ కోసం చిత్రీకరించబడుతోంది. ఈ చిత్రం పార్ట్ 1 - దీపావళి 2026లో, పార్ట్ 2 - దీపావళి 2027లో ప్రపంచ వ్యాప్తంగా విడుదల కానుంది. ప్రపంచంలోనే అత్యంత ప్రతిష్టాత్మకంగా రూపొందుతున్న సినీ ఈవెంట్‌కి నాంది పలికేలా మేకర్స్ రామాయణ: ది ఇంట్రడక్షన్ పేరిట ఈ ఎపిక్ మూవీని గ్లోబల్‌గా ఆవిష్కరించారు. ఇది పురాణాలలోని రెండు అత్యంత ప్రసిద్ధ శక్తులైన రాముడు వర్సెస్ రావణ మధ్య కాలాతీత యుద్ధానికి వేదికగా నిలిచింది. ఈ ప్రయోగం ప్రపంచవ్యాప్తంగా విస్తరించింది ఈ లాంచ్ భారతదేశంలోని తొమ్మిది ప్రధాన నగరాలలో ఫ్యాన్ స్క్రీనింగ్స్ ద్వారా, అలాగే న్యూయార్క్ టైమ్స్ స్క్వేర్ లో భారీ బిల్బోర్డ్ టేకోవర్ ద్వారా వరల్డ్ వైడ్‌గా జరిగింది. విజనరీ దర్శక నిర్మాత నమిత్ మల్హోత్రా నేతృత్వంలో, యాష్ సహనిర్మాతగా రూపొందిస్తున్న ఈ రామాయణ.. ఆస్కార్ అవార్డు పొందిన సాంకేతిక నిపుణులు, హాలీవుడ్ నిపుణులు, భారతీయ నటీనటులు, కథా కళాకారులను ఒకే వేదికపైకి తీసుకొస్తోంది. ఇది మన నాగరికతలోని అత్యంత శక్తివంతమైన ఇతిహాసాన్ని ఆధునిక సాంకేతికతతో, భారతీయ సంస్కృతి మూలాలపై ఆధారపడిన ప్రపంచస్థాయి సినిమాటిక్‌యూనివర్స్‌గా రీడిఫైన్ చేయనుంది. కాలానికిఅతీతమైన యుగంలో, ఈబ్రహ్మాండం సమతుల్యంలో కొనసాగుతోంది. ఈ సమతుల్యాన్ని బ్రహ్మ (సృష్టికర్త),విష్ణు(రక్షకుడు), శివుడు(లయకారుడు) త్రిమూర్తులు కాపాడుతూ ఉంటారు. దేవతలు, ఋషులు, మనుషులు, రాక్షసుల మధ్య సమరసతను ఈ త్రిమూర్తులే నిలుపుతున్నారు. కానీ ఆ సమతుల్యం లోంచి, ఇప్పటివరకు ఎప్పుడూ లేనంతటి ఒక విపరీత శక్తి ఉద్భవిస్తుంది. ఒక రాక్షస శిశువు, సృష్టిలోనే అత్యంత భయంకరుడు, దుర్జేయుడుఅయిన రావణుడిగా మారతాడు. అతని గర్జన ఆకాశాలను కంపింపజేస్తుంది. అతని ఉద్దేశ్యం విష్ణువును నాశనం చేయడం. ఎందుకంటే అతను ఎప్పుడూ తన జాతికి విరోధంగా ఉన్నాడని అతడి నమ్మకం.



# 11న ఓటీటీలోకి 'నరివేట్ట'

రీసెంట్‌గా రిలీజ్ అయిన మలయాళ యాక్షన్‌డ్రామా నరివేట్టచిత్రానికి విమర్శకుల ప్రశంసలు దక్కాయి. అలాంటి బ్లాక్ బస్టర్ ఇప్పుడు ఓటీటీ లోకి రాబోతోంది. జూలై 11 నుంచి నరివేట్ట చిత్రం సోనీలివ్‌లోకి రాబోతోంది. ఇండియా సినిమా కంపెనీబ్యానర్‌పై టిప్పుషన్, షియాస్ హాసన్ నిర్మించిన ఈ చిత్రానికి అనురాజ్ మనోహర్ దర్శకత్వం వహించారు. ఈ నరివెట్ట చిత్రం లోటొవినో థామస్ ఇప్పటి వరకు పోషించిన ఓ పవర్ ఫుల్ పాత్రను పోషించారు. ఓ యంగ్ అండ్ హనెస్ట్ పోలీస్ కానిస్టేబుల్‌గా వర్గీస్ (టొవినో థామస్) నటించారు. వయనాడ్ ప్రాంతానికి వర్గీస్ ట్రాన్స్‌ఫర్ అవ్వడం, అక్కడి పరిస్థితులపై పోరాడటం అనే కాన్సెప్ట్‌ను అద్భుతంగా చూపించారు. ఆదివాసీ సంఘాలు తమకు భూమిని కేటాయించడంలో ప్రభుత్వం ఆలస్యం చేయడంపై తీవ్ర నిరసనలో వెల్లువెత్తుతాయి. ఈ పరిస్థితుల్ని ఆకానిస్టేబుల్ ఎలా చక్కబెట్టాడు అనేది కథ. ఈ చిత్రంలో టోవినో థామస్‌తో పాటు, సూరజ్ వెంజరమూడు, చేరన్, ఆర్య సలీం, ప్రియంవద కృష్ణన్, ప్రణవ్ టియోఫిన్ వంటి వారు నటించారు. ఎన్ ఎం బాదుషా ఎగ్జిక్యూటివ్ నిర్మాతగా, జేక్స్ బెజోయ్ సంగీతం దర్శకుడిగా పని చేశారు. ఇది ఆలోచింప జేసే ఓ ఎంగేజింగ్ డ్రామా. అందరూ చూడవలసిన చిత్రం.



# బాలీవుడ్‌లోనూ శ్రీలీల పాగా

టాలీవుడ్ యంగ్ బ్యూటీ శ్రీలీల క్రేజ్ ప్రస్తుతం ఏ రేంజ్‌లో ఉందో అందరికీ తెలిసిందే. వరుసబెట్టి సినిమాలు చేస్తున్న ఈ బ్యూటీ చిన్నా, పెద్ద సినిమా తేడా లేకుండా సైన్ చేస్తోంది. ఇక కేవలం టాలీవుడ్‌లోనే కాకుండా బాలీవుడ్‌లోనూ పాగా వేసేందుకు ఈ అమ్మడు రెడీ అయింది. హీరో కార్తీక్ ఆర్యన్ సినిమాలో హీరోయిన్‌గా నటిస్తూ బాలీవుడ్ గ్రాండ్ ఎంట్రీకి రెడీ అయింది. అయితే, శ్రీలీల పుష్ప2 సినిమా కిస్సిక్ ఐటెం సాంగ్‌లో కనిపించి అందరినీ ఆశ్చర్యానికి గురిచేసింది. ఆ పాట ఎంతటి పాపులారిటీని సంపాదించిందో మనం చూశాం. ఇక ఆ పాట తర్వాత అమ్మడికి అలాంటి ఆఫర్స్ చాలానే వచ్చాయట. కానీ, శ్రీలీల తనకున్న సినిమాల కారణంగా వాటిని రిజెక్ట్ చేసింది. అయితే, ఇప్పుడు మరో క్రేజీ ప్రాజెక్ట్ కోసం శ్రీలీల మరోసారి స్పెషల్ సాంగ్‌లో చిందులేసేందుకు సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. అక్కినేని నాగచైతన్య, విరూపాక్ష ఫేమ్ దర్శకుడు కార్తీక్ దండు కాంబినేషన్‌లో ఓ మిస్టిక్ థ్రిల్లర్ చిత్రం తెరకెక్కుతోంది. అత్యంత భారీ బడ్జెట్తో రూపొందుతున్న ఈ పాన్ ఇండియా చిత్రంలో ఓ స్పెషల్ సాంగ్ ఉండనుందట. అయితే, ఈ సాంగ్‌లో చిందులేసేందుకు శ్రీలీలను చిత్ర యూనిట్ అప్రోచ్ అయినట్లు తెలుస్తోంది. మరి ఈ సినిమాలోని స్పెషల్ సాంగ్‌కు శ్రీలీల ఓకే చెబుతుందా లేదా అనేది వేచి చూడాలి.






# '666 ఆపరేషన్ డ్రీమ్ థియేటర్' డాలీ ధనుంజయ్ లుక్ సూపర్

సప్త సాగరాలు దాటి సినిమాతో మంచి గుర్తింపు తెచ్చుకున్న దర్శకుడు హేమంత్ రావు, తాజాగా 666 ఆపరేషన్ డ్రీమ్ థియేటర్ అనే టైటిల్‌తో ఒక సినిమాను తెరకెక్కిస్తున్నారు, ఈ చిత్రంలో పుష్ప చిత్రంలో అలరించిన నటుడు డాలీ ధనుంజయ నటిస్తుండగా, కన్నడ చక్రవర్తి శివరాజ్ కుమార్ కీలక పాత్రలో నటిస్తున్నారు. జె.ఫిల్మ్స్ పతాకంపై వైశాక్ గౌడ ఈ సినిమాను నిర్మిస్తున్నారు. ఇటీవల ఈ సినిమా పూజ కార్యక్రమాలు పూర్తి చేసుకుంది, శరవేగంగా షూటింగ్ జరుపుకుం టున్న ఈ సినిమా నుండి డాలీ ధనుంజయ్ న్యూ లుక్‌ను విడుదల చేసారు చిత్ర యూనిట్. డిఫరెంట్‌గా మ్యాన్ లీ లుక్‌లో ఉన్న ధనుంజయ్ లుక్‌కు మంచి రెస్పాన్స్ లభిస్తోంది. పుష్ప 1,2 చిత్రాలతో పాపులర్ అయిన డాలీ ధనుంజర్ 666 ఆపరేషన్ డ్రీమ్ థియేటర్ చిత్రంలో డిఫరెంట్ రోల్‌లో నటించారు.



## 'యువి క్రియేషన్స్ వాళ్లమని తప్పుడు ప్రచారం'

ఒక అనామక వ్యక్తి తాను యువి క్రియేషన్స్‌కు చెందినవాడినంటూ నటీమణులను, వారి ప్రతినిధులను తప్పుడు ఆఫర్లతో కలిసేందుకు ప్రయత్నిస్తున్నాడని మా దృష్టికి వచ్చింది. ఈ వ్యక్తితో మా సంస్థకు ఎలాంటి సంబంధం లేదు. యువి క్రియేషన్స్ తరఫున వచ్చే అన్ని అధికారిక సమాచారం, కాస్టింగ్ ప్రక్రియలు నమ్మదగిన, సరైన మార్గాల ద్వారా మాత్రమే జరుగుతాయి. ఈ విషయాన్ని పరిశ్రమలో ఉన్న ప్రతి ఒక్కరు జాగ్రత్తగా గమనించాలని, ఎవ్వరైనా ఈ తరహా అనామక ప్రతినిధులతో ముందుకు వెళ్లేముందు తప్పకుండా నిజం తెలుసుకోవాలని మనవి. మాకు ఏ అవసరాలు ఉన్నా లేదా కాస్టింగ్ కాల్స్ ఉన్నా, అవి అధికారికంగా, నమ్మదగిన వనరుల ద్వారా మాత్రమే తెలియజేస్తాం.

**- టీమ్ యువి క్రియేషన్స్**

# 'కూలీ' నుంచి అమీర్‌ఖాన్ ఫస్ట్ లుక్

సూపర్ స్టార్ రజనీకాంత్ మోస్ట్ ఎవైటెడ్ మూవీ కూలీకి లోకేష్ కనగరాజ్ దర్శకత్వం వహిస్తున్నారు. ఆయన లోకేష్ సినిమాటిక్ యూనివర్స్ (ఎల్‌సియు)తో తన విజయాలని కొనసాగిస్తున్నారు. ప్రతిష్టాత్మక సన్ పిక్చర్స్ బ్యానర్ నిర్మించిన కూలీలో రీసెంట్ కుబేరతో బ్లాక్ బస్టర్ అందుకున్న కింగ్ నాగార్జున పవర్ ఫుల్ పాత్రలో నటిస్తున్నారు. అలాగే బాలీవుడ్ సూపర్ స్టార్ అమీర్‌ఖాన్ మరో ముఖ్యమైన పాత్రలో కనిపించనున్నారు.మేకర్స్ అమీర్‌ఖాన్‌ని దహాగా పరిచయం చేస్తూ ఫస్ట్ లుక్ రిలీజ్ చేశారు. గోల్డెన్ వాచ్, గోల్డ్ ఫ్రేం వున్న గ్లాసెస్ ధరించి సిగార్ తాగుతూ అమీర్‌ఖాన్ ఇంటెన్స్ లుక్‌లో కనిపించిన ఈ పోస్టర్ అదిరిపోయింది. ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. డి.సురేష్ బాబు, దిల్ రాజు, సునీల్ నారంగ్, భరత్ నారంగ్ యాజమాన్యంలోని ప్రముఖ డిస్ట్రిబ్యూషన్ సంస్థ ఏషియన్ మల్టీప్లెక్స్ ప్రైవేట్ లిమిటెడ్ కూలీ మూవీ తెలుగు థియేట్రికల్ హక్కులను భారీ ధరకు సొంతం చేసుకుంది. ఇది ప్రాజెక్ట్ చుట్టూ ఉన్న మ్యాసీవ్ హైప్‌ను సూచిస్తోంది. రజనీకాంత్, నాగార్జునలతో పాటు సత్యరాజ్, సౌబిన్ షాహిర్, ఉపేంద్ర, శ్రుతీ హాసన్, మహేంద్రన్ వంటి ప్రముఖులు కూడా కీలక పాత్రల్లో నటిస్తున్నారు. తెలుగు రాష్ట్రాల్లో ఈ సినిమాను ఏషియన్ సురేష్ ఎంటర్‌టైన్‌మెంట్స్ గ్రాండ్‌గా విడుదల చేయనుంది. ఇప్పటికే విడుదలైన ఫస్ట్‌లుక్ పోస్టర్లు, టీజర్లు సినిమాపై భారీ క్రేజ్‌ను నెలకొల్పాయి. చికిటు సాంగ్ చార్ట్ బస్టర్ హిట్ అయ్యింది. కలానిధి మారన్ నిర్మిస్తున్న ఈ చిత్రానికి టాప్ టెక్నికల్ టీమ్ పనిచేస్తోంది.



# వయసుకు తగ్గ సమాధానం చెప్పాలి



**తల్లులకు చిన్న పిల్లలు అమ్మా నేనెక్కడి నుంచి వచ్చాను నీ పొట్టలో ఎందుకు ఉన్నానంటూ అడుగుతారు. ఊహించని ఈ ప్రశ్నలకు ఏం చెప్పాలో అర్థం కాదు. ఈ సందర్భం దాదాపు ప్రతి తల్లికీ ఎదురవుతుంది. ఇబ్బందిగా ఉన్నా వారి వయసుకు తగ్గ సమాధానం చెప్పాల్సిందే అంటున్నారు నిపుణులు.**

పిల్లలకు తమకెదురయ్యే ప్రతీదీ కొత్తగా, వింతగా కనిపిస్తుంది. సందేహాలెన్నో వస్తుంటాయి. వారడిగే ప్రతి ప్రశ్నకూ సమాధానం తెలిస్తేనే తృప్తి పడతారు. లేదంటే వారికి సమాధానం చెప్పాల్సిందే.. ఆ ప్రశ్నకు మరో ప్రశ్న వారి మెదడులో చేరి అయోమయానికి గురవుతారు. అందుకే ఎప్పటికప్పుడు వారి సందేహాలను తీర్చాల్సిందే. అవి వారి పాఠ్యాంశాలు, కథలు, వాటిలోని పాత్రలు, అంతరిక్షం, ఆహారం, ఆటలువంటివి మాత్రమే అయితే ఇబ్బంది లేదు. మరికొంత ముందుకుకెళ్లి వారి పుట్టక గురించి, గర్భధారణ వంటివి ప్రశ్నిస్తే మాత్రం ఇబ్బంది అవుతుంది. ఆ వయసులో వారికి అవసరంలేనివి అడుగుతున్నరని కోప్పడి వాళ్ల నోరు మూయించొచ్చు. అయితే ఆ సందేహం వారి మనసు నుంచి దూరం కాదు. అది పెరిగి పెద్దదవుతుంది.

**ఎలా చెప్పాలంటే...** ఏడెనిమిదేళ్లలోపు చిన్నారులకైతే ఏదైనా కథ రూపంలో సమాధానమివ్వాలి. మరొకసారి మరింత సమాచారం చెబుతానని అక్కడితో సంభాషణను పూర్తిచేయొచ్చు. ఎనిమిదేళ్ల దాటిని ఆడప్లిలకు సమాధానం తప్పనిసరి. కొన్ని విషయాలు అర్థం చేసుకోగలుగుతారు. విసుక్కోకుండా మృదువుగా వారికి కావాల్సినంత మేరకు సమాచారాన్నివ్వొచ్చు. అమ్మ గర్భంలో బిడ్డ ఎదుగుదల గురించి వివరించాలి. మరింత అవగాహన తెచ్చుకొనే వయసైతే ప్రసవం గురించీ వివరించొచ్చు.

**చనిపోవడమంటే చెప్పాలి..** అమ్మమ్మ, నాయినమ్మ, జేజమ్మ ఎందుకు చనిపోయారని, వారెక్కడికి వెళ్లారని కొందరు పిల్లలకు సందేహాలొస్తుంటాయి. పదేళ్లవారికైతే జీవితంలో చివరగా వచ్చేమృతువు గురించి మృదువుగా వివరించాలి. అంతకన్నా చిన్నపిల్లలను దేవుడి దగ్గరకెళ్లారని చెప్పి మరిపించొచ్చు. అలానే, అన్నయ్యకన్నా నేనెందుకు భిన్నంగా ఉన్నాననే సందేహం ఆడపిల్లలకొస్తుంది. ప్రతి ఒక్కరి శరీరానికి ప్రత్యేకత ఉందని చెప్పాలి. ఆడపిల్లల్లో ఆయా వయసుకు తగినట్లు శారీరకపరమైన మార్పులెలా వస్తాయో అవగాహన కలిగించాలి. పరిశుభ్రత ప్రాముఖ్యతనూ చెప్పి పాటించేలా చేయాలి. ఇవన్నీ పిల్లల్లో శారీరకంగా ఆరోగ్యాన్నే కాకుండా మానసిక పరిపక్వతనూ పెంచుతాయి. □

## తెలుసుకుందాం..



మగవారితో పోలిస్తే ఆడవాళ్ల బ్రెయిన్ హెల్త్ మీద తక్కువ పరిశోధనలు జరుగుతున్నాయట. దానివల్లే మహిళల్లో వచ్చే న్యూరలాజికల్, సైకలాజికల్ సమస్యలను గుర్తించడం ఆలస్యమవుతోందని అధ్యయనాలు చెబుతున్నాయి. □

# వైద్యంతో పాటు చదువు చెపుతూ..



**అదో ప్రాంగణం.. వరుసగా కుర్చీల్లో కూర్చొని శ్రద్ధగా పుస్తకాలు చదువుతున్నారంతా అలాగని అదేమీ విద్యాలయం కాదు, లైబ్రరీ అంతకన్నాకాదు. ఆసుపత్రి! పాఠకులంతా వైద్యం కోసం వచ్చినవాళ్లు! ఇదంతా ఏంటంటే డాక్టర్ సయ్యద్ రుబీనా గురించి తెలుసుకోవాల్సిందే !**

అది హనుమకొండ జిల్లా, భీమదేవరపల్లి మండలం, వంగరలోని ప్రభుత్వాసుపత్రి మాజీ ప్రధానమంత్రి పీవీ నరసింహారావు స్వగ్రామం అక్కడే సేవలందిస్తున్నారు. నాన్న అబ్దుల్ వహీద్‌ఖాన్, అమ్మ బదురున్నీసా బేగం... సాంఘిక సంక్షేమ శాఖలో వార్డెన్లుగా చేసి ఉద్యోగ విరమణ చేశారు. వాళ్ల ఉద్యోగరీత్యా కొన్నాళ్ల ఆదిలాబాద్ జిల్లా బోథ్‌లో ఉన్నాం. నా బాల్యం, ప్రాథమిక విద్యాభ్యాసం అక్కడే గడిచింది. వసతిగృహాల్లో విద్యార్థులను చేర్చుకోవడానికి అమ్మానాన్నలు ఆదివాసీ తండాలకు వెళ్లినప్పుడు నన్ను వెంట తీసుకెళ్లేవారు. అక్కడ ఆదివాసీల జీవన స్థితిగతులు చూస్తేబాధేస్తుంది. ఇలాంటి వారికి సేవ చేయడానికే డాక్టర్ అవ్వాలనుకున్నా'నంటారు. రుబీనా. ఖమ్మంలో ఎంబీబీఎస్ పూర్తిచేసి, వరంగల్‌లోని ప్రభుత్వ ప్రసూతి ఆసుపత్రిలో ఒప్పంద వైద్యురాలుగా చేరారు. అక్కడ పరిచయమైన రెహమాన్‌ని పెద్దల అంగీకారంతో పెళ్లి చేసుకున్నారు. 'పట్టణ ప్రజలకు వైద్యం సేవలందిస్తున్నా సంతృప్తి లేదు. పల్లెలకు వెళ్లాలన్న కల ఆరేళ్ల తరవాత తీరింది. రెగ్యులర్ వైద్యురాలుగా వంగర్ ఆసుపత్రిలోఅడుగుపెట్టా. కానీ పెద్దగా వచ్చేవారు కాదు. దీనితో వేరుగా వారి వద్దకే వెళ్లి వైద్య సేవలందించాలని నిర్ణయించుకున్నాను. నా భర్త, ఏఎన్ఎంలు, ఆశావర్కర్లతో కలిసి పల్లెల్లో తిరిగేదాన్ని మహిళ ఆరోగ్యంగా ఉంటే కుటుంబమంతా సురక్షితంగా ఉంటుంది. అందుకే వారిపై దృష్టిసారించి క్యాన్సర్, టీబీ, హెచ్ఐవీ, బాలికల వ్యక్తిగత పరిశుభ్రత, దీర్ఘకాలిక వ్యాధులపై అవగాహన సదస్సులు నిర్వహించబడతాయి. ఆరోగ్య శిబిరాలూ ఏర్పాటుచేశాం. క్రమంగా ఆసుపత్రికి వచ్చే సంఖ్య పెరిగింది. దాతల సాయంతో బాలికలకు శానిటరీ నాప్కిన్లనీ అందించేవాళ్లం. ఇటుక బట్టి కార్మికులు, గ్రామ శివార్లలో ఉండే వారి వద్దకే వెళ్లి చికిత్స అందిస్తున్నాం. పిల్లలు కలగట్లేదని బాధపడుతున్న 10మంది దంపతులకు కౌన్సెలింగ్ చేసి, చికిత్స అందిస్తే, ఆరుగురు మాతృత్వం పొందడం మరచిపోలేని సంఘటనగా చెబుతారు రుబీనా. ఆమె ప్రయాణంలో ఇలాంటి సంఘటనలు ఎన్నో.



**వైద్యాలయమే గ్రంథాలయంగా...**

సరైన వైద్యం దొరుకుతుందన్న ఆశ కలిగాక రోగుల సంఖ్య పెరిగింది. అయితే వైద్యులను కలవడానికి వేచి ఉండే సమయాన్ని వృథా పోనివ్వడం ఎందుకని ఆలోచించారీమె. ఆ సమయంలో సామాజిక అవగాహన పెంచాలనుకున్నారు. ఆరోగ్య విద్య అందించాలనే లక్ష్యంతో పుస్తక నిధిని ఏర్పాటు చేశారు. రోగి, వాళ్లతో వచ్చిన సహాయకులకు ఈ పుస్తకాలను ఇచ్చి చదివిస్తున్నారు. 'ఆరోగ్యం యోగాపై అవగాహన కలిగించే పుస్తకాలు, కథల పుస్తకాలు అందుబాటులో ఉంచాం. పుస్తక ప్రదర్శనలు, హైదరాబాద్ లోని కోఠి, ఇతర ప్రాంతాల నుంచి ఈ పుస్తకాలు కొని తీసుకొస్తున్నాం. ప్రస్తుతం 80 ఉన్నాయి. వీటిని 200 వరకు పెంచాలన్నది నా ప్రయత్నం. కానీ వైద్య సంబంధిత పుస్తకాలు తెలుగులో దొరకడం లేదు. అదే పెద్ద ఇబ్బంది అనే ప్రభుత్వం అందజేస్తున్న ఆరోగ్య సేవపై సందేశాత్మక లఘుచిత్రాలను తీసి, సామాజిక మాధ్యమాల్లో అందుబాటులో ఉంచారు: ఎయిడ్స్ గంజాయి, గుట్కా, టీబీ, బాలికల అక్రమ రవాణా వంటి వాటిపై అవగాహన కల్పిస్తున్నారు. తెలంగాణ అవతరణ దినోత్సవం నాడు జిల్లా. అక్కడ జరిగిన వేడుకల్లో 'సుఖప్రసవం ప్రభుత్వ సేవలు'పై ఇచ్చిన ప్రదర్శనకు జిల్లా స్థాయిలో ప్రథమ బహుమతి ని అందుకున్నారు. ఈమె సేవలను గుర్తించిన ముఖ్యమంత్రి .. వైద్యారోగ్యశాఖ మంత్రి ఆమె సామాజిక మాధ్యమం 'ఎక్స్' వేదికగా ప్రశంసించారు. 'వైద్యురాలిగా సేవలందిస్తూనే సామాజిక చైతన్యం కోసమూ కృషి చేస్తున్న రుబీనా ఎందరికో మార్గదర్శి' అంటూ అభినందించారు. ఆమె భర్త సిబ్బంది అండతోనే ఇదంతా సాధ్యమైందంటారు. స్త్రీ వైద్య నిపుణురాలిగా మరింత మందికి సేవచేయడం తన లక్ష్యమంటారు. □



**ఎండల నుంచి ఉపశమనంగా లేత రంగులూ, కాటన్ దుస్తులూ వేసుకుంటాం. చలిని తట్టుకునేందుకు ముదురు వర్ణాలు, లేయర్‌న డ్రెస్‌లు, ఉన్ని కోట్లు వంటివాటికి ప్రాధాన్యం ఇస్తాం. వానాకాలం వచ్చే సరికి మాత్రం చినుకులకు భయపడి పక్కన పెట్టేస్తాం. ఫ్యాషన్లనీ రంగుల్నీ పట్టించుకోం. గొడుగో, రెయిన్‌కోటో వేసుకుని కాలేజీలకు, ఆఫీసులకు వెళ్లాల్సిందే. అలాంటివారికి స్టైల్‌తో పాటు సౌకర్యాన్నీ అందించే చిట్కాలివి.**

ఈ కాలంలో వర్షంలో తడిసినా త్వరగా ఆరిపోయే ఫ్యాబ్రిక్ డ్రెస్‌లను ఎంచుకోవాలి. ఖాదీ, క్రేప్ సిల్క్, షిఫాన్, సింథటిక్ వస్త్రంతో తయారుచేసిన దుస్తులను వాడటం మంచిది. అలానే, లేయర్డ్ ప్యాటర్న్‌వి కాకుండా కాస్త తేలిగ్గా ఉండేవాటికి ప్రాధాన్యం

# చినుకుల్లో ఫ్యాబ్రిక్ డ్రెస్

ఇవ్వాలి. వర్షాకాలంలో సౌకర్యంగా ఉండటమే కాదు. సింపుల్‌గా, స్టైలిష్‌గా కనిపించేలా వాటిల్లో ట్రెంచ్ కోట్ ఒకటి. దీనినజీన్స్ మీదకు జత చేసుకుంటే మీ లుక్కే మారిపోతుంది. అలానే ఫుల్ లెంత్ జీన్స్, లాంగ్ గౌన్‌లు వంటివాటిని వేసుకోకపోవడమే మంచిది. బదులుగా కాఫ్‌లెంత్, నీలెంత్ స్కర్టులు, ప్యాంటులు ఎంచుకుంటే మేలు. ఎంత గొడుగు పట్టుకెళ్లినా చినుకులకు ఎంతో కొంత తడవాల్సి వస్తుంది. ఇలాంటప్పుడు ఒంటికి అతుక్కుపోయే దుస్తులను ధరిస్తే.. ఆ తేమ కారణంగా బ్యాక్టీరియల్, ఫంగల్ ఇన్ఫెక్షన్లు ఇబ్బంది పెట్టొచ్చు. అలానే, కాటన్ వస్త్రాలు తడిస్తే ఓపట్టాన ఆరవు. దుస్తులూ వాసన వస్తాయి. కాబట్టి వాటికి దూరంగా ఉండాలి. ప్యాంటుల్లో చుడీ, పటియాలా వంటివి అసౌకర్యంగా ఉంటాయి. బదులుగా కాఫ్‌లెంత్ పలాజో, లెగ్గింగ్స్ వంటివి చక్కటి ఎంపిక. ట్రెంచ్ కోట్లు, వైడ్ లెడ్ ట్రౌజర్లు, మిడీస్, మ్యాక్సీ, కోఆర్డ్ సెట్స్ వంటివీ వేసుకోవచ్చు. అయితే, ఏవి ఎంచుకున్నా పారదర్శకంగా ఉండేవి మాత్రం వాడొద్దు.



**కంటి కింపుగా...**

వర్షాకాలంలో మబ్బులూ, చిరుజల్లులతో వాతావరణం కాస్త డల్‌గా ఉంటుంది. అందుకు తగ్గట్లే మనలోనూ కాస్త చురుకుదనం తగ్గుతుంది. ఆ ప్రభావం మనపై పడకుండా ఉండాలంటే వేసుకునే దుస్తులు కాస్త కలర్‌ఫుల్‌గా ఉండేలా చూసుకోండి. ఇవి మనసును ఉల్లాసంగా ఉంచుతాయి. వేసవిలో లేత రంగులు వాడేశాం కాబట్టి మరీ ముదురు ఛాయల జోలికి పోకుండా కాస్త కాంతివంతంగా ఉండే వాటికి ప్రాధాన్యం ఇవ్వండి. మోనోక్రోమ్ కలర్స్ వాడండి. పసుపు, ఆరెంజ్, ఎరుపు, గులాబీ, ఆకాశ నీలం, మట్టి, ఇసుక వర్ణాలు బాగుంటాయి. మోనోక్రోమ్ కలర్స్ వాడండి. పసుపు, ఆరెంజ్, ఎరుపు, గులాబీ, ఆకాశ నీలం, మట్టి, ఇసుక వర్ణాలు బాగుంటాయి. ఆకుపచ్చ విషయానికి వస్తే మింటీ పేస్టల్స నుంచి ముదురు ఆకుపచ్చ వరకూ అన్ని టోన్‌లూ ఈ కాలానికి చక్కటి ఎంపిక. □

## గుమ్మడికాయ పుడ్డింగ్



**కావలసినవి :** గుమ్మడికాయ ముక్కలు-4 కప్పులు, నెయ్యి-4 టేబుల్ స్పూన్లు, చిక్కటి పాలు, పంచదార-ముప్పావు కప్పు చొప్పున, యాలకుల పొడి-పావు చెంచా, కుంకుమ పువ్వు-కొద్దిగా, బాదం, పిస్తా, కిస్‌మిస్, జీడిపప్పులు- అన్నీ కలిపి అర కప్పు.

**తయారీ :** బాదం, పిస్తా కిస్‌మిస్, జీడిపప్పులను నేతిలో వేయించి పక్కన ఉంచాలి. అడుగు భాగం మందంగా ఉన్న గిన్నెలో రెండు టేబుల్ స్పూన్ల నెయ్యి వేసి, గుమ్మడికాయ ముక్కలను మూడు నిమిషాలు వేయించాలి. పచ్చి వాసన పోయాక.. పాలు పోసి ఉడికించాలి. ఆరేడు నిమిషాల తర్వాత ముక్కలను పప్పుగుత్తితో మెత్తగా మెదపాలి. అందులో పంచదార వేసి, రెండు నిమిషాల పాటు కలియ తిప్పుతూనే ఉండాలి. దగ్గరగా అయ్యాక మిగిలిన నెయ్యి, యాలకుల పొడి, డ్రైఫ్రూట్స్, కుంకుమ పువ్వు వేసి ఇంకో నిమిషం ఉంచి దించేయాలి. అంతే..రుచికరమైన గుమ్మడికాయ పుడ్డింగ్ రెడీ. దీన్ని గిల్ఫ్ ఫిర్‌దౌస్ అని కూడా అంటారు. అంటే స్వర్గంలో చిన్న తునక అని అర్థం. □

# ఆకుకూరల ప్రయోజనాలు

ఆరోగ్య భాగ్యం



డాక్టర్ కె.ఉమాదేవి
తిరుపతి

శరీరం సరిగ్గా పనిచేయడానికి సమతుల్య ఆహారంలో ముఖ్యమైన భాగంగా అవసరమైన అన్ని పోషకాలుండడం తో వీటిని కూరాకులు అని అంటారు. ప్రకృతి మనకు ఇచ్చిన వరం ఆకుకూరలు అని చెప్పవచ్చు. ఆకు కూరలు కొన్ని సీజన్స్‌లో ప్రత్యేకంగా పెరుగుతాయి. ఎక్కువగా వర్షాకాలంలో, తేమవాతావరణంలో, వేసవిలో పెరిగే ఆకుకూరల్ని కాలానుగుణంగా తీసుకోవాలిలి. చిన్నవి, పెద్దవి, లేత, ముదురు ఆకులు వివిధ సైజ్‌లో ఉండేవి తీసుకోవచ్చు. సాధారణంగా ఏడాది పొడవునా అందరికి అందుబాటులో ఉండే ఆకుకూరలు కొన్ని, స్థానికంగా దొరికే ఆకుకూరలు కొన్ని వారానికి 3 రోజులు తీసుకోవడం వల్ల చాలా వరకు వ్యాధులు తగ్గి ఆరోగ్యపరంగా అనేక అద్భుతాలు కల్గుతాయి. ఎందుకంటే ఇవి ఆరోగ్యానికి వరంలాంటివి. ప్రాంతం, సీజన్ ఆధారంగా 80 వివిధ రకాల ఆకుకూరలు వినియోగింపబడుతున్నాయని చెప్పవచ్చు.

100 గ్రాముల వివిధ ఆకుకూరల్లో ఉండే రమారమి పోషకాలు: తేమ:70-80, సోడియం : 79 మిగ్రా, ప్రోటీన్స్ : 2.9 గ్రా, కాల్షియం : 99మి.గ్రా. పీచు: 2.2 గ్రా. కేలరీలు : 23 కేలరీలు పొటాషియం : 558 మి.గ్రా.

**కార్బోహైడ్రేట్స్** : 3.6 గ్రా. మెగ్నీషియం : 79 మిగ్రా ఐరన్: 2.7 మి.గ్రా ఉంటాయి.

ఇవి పోషకాల పవర్ హౌస్‌లాంటివి అని చెప్పవచ్చు. ఆకుకూరలు రోజువారీ ఆహారంలో పిల్లలు: 50 గ్రా రోజుకి 1/2 1 కప్పు ఆకుకూరలు మితంగా తీసుకుంటే మంచిది.

ఆకుకూరల్లోని పోషక ప్రయోజనాలు : ఆకుకూరల్లోని మినరల్స్ విటమిన్స్ పోషణకు జీవక్రియలకి శరీర అవయవాల ఎదుగుదలకి, పనితీరుకి అవసరం. దీని వల్ల పోషణ లోపం, విటమిన్ల లోపాలు ఏర్పడవు. కాబట్టి పిల్లలు, పెద్దలు రోజూ ఆకుకూరల్ని మితంగా తీనడం మంచిది. ఆకుకూరల్లోని ఎసెన్షియల్ మైక్రోన్యూట్రిమెంట్స్ అయిన బీటా కెరోటిన్, ట్యాటిన్, జియాంకినసతిన్, బయోటిన్ మొదలైన వాటివల్ల కణాల డ్యామేజిని ఆరికట్టి కన్ను, జుట్టు, చర్మం ఆరోగ్యాన్ని కాపాడుతుంది. కెరోటినాయిడ్స్ రక్షణ కవచాలుగా పని చేసి నీలికాంతి యు.వి. కిరణాల ద్వారా కలిగే నష్టాన్ని తగ్గిస్తాయి. దాంతో ఇవి నేచురల్ సన్‌స్క్రీన్స్‌గా పనిచేస్తాయి. ఆకుకూరల్లోని పీచుపదార్థం ఐరన్ ఎక్కువగా ఉండడం వల్ల ఆకలికి, ఆహారం అరుగుదలకి, జీర్ణక్రియ కార్యకలాపాలకి పోషణకి ఉపయోగపడతాయి. దీనివల్ల ఇవి జీర్ణకోశవ్యాధుల నివారణకి, మలబద్ధకం లేకుండా విరేచనం సాఫీగా జరిగేలా చేస్తాయి. ఇది హెల్త్‌కి మంచిది. ఇవి మంచి చెడు బ్యాక్టీరియాని బ్యాలెన్స్ చేస్తాయి. ఇవి ఎర్రరక్తకణాల తయారీకి, శరీరం అంతటా అవసరమైన పోషకాల్ని రవాణా చేయడంలో సహాయపడతాయి. ఆకుకూరల్లో తక్కువ కేలరీలుండి అవసరమైన అనేక విటమిన్స్ (పోలేట్, ఐరన్), మినరల్స్ వల్ల స్త్రీలలో రక్తహీనతని తగ్గించి, గర్భధారణ అవకాశాల్ని పెంచుతాయి. అండోత్పత్తిని పెంపొందిస్తాయి. ఇవి గర్భిణీల ఆరోగ్యానికి మంచివి. ఇవి శిశువుల్లో పుట్టుకతో వచ్చే లోపాల్ని నివారిస్తాయి. దీంతో ఇవి తల్లిబిడ్డల ఆరోగ్యానికి, బాలింతలకి పథ్యంగా, పాలుపడానిక సహాయపడతాయి. ఆకుకూరల్లోని కేలరీలు మనలో అలసట, నీరసం, తరచు అంటువ్యాధులు రావడం, సీక్‌కావడం ఉంటే ఎనర్జీ బూస్టర్స్‌గా పనిచేస్తూ మీ శక్తి స్థాయిల్ని పెంపొందించుతాయి. స్ట్రెస్‌ని తగ్గించి, ఏకాగ్రత, జ్ఞపకశక్తిని పెంచి మెదడు పనీతీరుని, నరాల పని తీరుని మెరుగుపరుస్తాయి. ఎందు కంటే వీటలో హ్యాపీ హార్మోన్స్‌ని పెంచే ఫోలేట్స్, మెగ్నీషియం, కాపర్, బికాంప్లెక్స్ విటమిన్లు, ఖనిజాలుంటాయి. ఆకుకూరల్లోని కాల్షియం, ఫాస్ఫరస్, మెగ్నీషియం, మాంగనీస్‌లు ఖనిజాలు దంతాలు గోర్లు, ఎముకల పెరుగుదలకి, ఆరోగ్యానికి ఉపయోగపడ తాయి. వీటిలో ఎముకల బలాన్ని పెంచి, ఎముకల సాంద్రతని మెరుగుపర్చడానికి అవ సరమైన ఆస్టియోకాల్సిన్ ఉత్పత్తికి అవసరమైన విటమిన్ కె, పొటాషి యం ఎక్కువగా ఉంటుంది. ఆకు కూరల్లో రోగనిరోధకశక్తిని పెంచే టి కణాల్ని పెంపొందించే విటమిన్ సి, ఆంటీ ఆక్సిడెంట్స్ ఉండడం వల్ల మనల్ని అంటువ్యాధుల బారిన పడకుండా, ఆటోఇమ్యూన్ వ్యాధుల్ని తగ్గించి వేసే శక్తి ఉంది. ఆకు కూరల్లోని ఆంటి ఆక్సిడెంట్స్, రెరో టినాయిడ్స్, ఫ్లేవనాయిడ్స్ వల్ల ఇండోల్స్, సల్ఫోరాఫెన్ ఐసోథియో సైనేట్స్ వంటి కేన్సర్ పోరాట సమ్మేళనాలు ఆంటికేన్సర్ ఏజెంట్స్ గా కడుపు, ప్రేవులు, చర్మం, రొమ్ము కేన్సర్లతో పోరాడు తాయి. ఆకుకూర ల్లోని గ్లూకోథయినిన్ వంటి రసాయ నిక సమ్మేళనాల వల్ల డీటా క్సిఫైర్ గా రక్తంలోని టాక్సిన్స్‌ని, ఫ్రీరాడికల్స్‌ని తగ్గించి కాలేయం, రక్తశుద్ధికి ఉపయోగపడుతుంది.

# కొన్ని జ్ఞాపకాలు వదిలేయాలి.!

**ఉదయం లేచింది మొదలు...** మళ్లీ నిద్రపోయే వరకూ ఎన్ని విషయాలు తారస పడతాయో. అన్నింటితోనూ ఎమోషనల్‌గా కనెక్ట్ అయి ఉంటారు అమ్మాయిలు అవి వస్తువులైనా, మనుషులైనా మరి ఇష్టాన్ని పెంచుకోవడం మాత్రమే తెలుసుకుంటే ఎలా? అవసరం అయినప్పుడు వాటిని వదిలేయడమూ తెలియాలి... అప్పుడే మానసిక సమస్యలు దరిచేరవు. దీన్నే ఇప్పుడు పూప్ రూల్ గా చెబుతున్నారు.

✦ జ్ఞాపకాలను పదిలం చేసుకోవడంలో మనకు మనమే సాటి. ఊహ తెలిశాక జడకు వేసుకున్న రిబ్బన్ నుంచీ నిన్న మొన్న మనకు నచ్చిన రబ్బర్ బ్యాండ్ అంతా మనకు అపురూపమే... ఇవేనా... గ్రీటింగ్ కార్డులు, బొమ్మలు, నచ్చిన బట్టలు, బాక్సులు, పుస్తకాలు తరచి చూస్తే... ఒక్కో దానితో ఒక్కో అనుభవం... అవే జ్ఞాపకాలుగా దాచుకుంటాం. కానీ వీటన్నింటి వల్లా వార్డ్‌రోబ్ నిండిపోతుంది. రూమ్ సర్దిన ప్రతిసారి వాటిని పంపించి అనుకుంటాం అవి ఇచ్చిన అనుభూతులు గుర్తొచ్చి పడేయలేం. అవన్నీ బాగుంటే పర్లేదు. కానీ, వాటిల్లో కొన్ని చెదలు పడుతుంటాయి. అయినా వాటిని పడేయడానికి మనసు రాదు మనకు. మిగిలినవి పాడవకూడదు అంటే ఈ కొన్నింటిని తీసేయాల్సిందే.



✦ కొందరమ్మాయిలు తొందరగా ఎవ్వరినీ నమ్మలేరు. స్నేహమైనా, ప్రేమైనా ఒకసారి నమ్మిన జీవితాంతం కొనసాగించాలనుకుంటారు. అవతలి వ్యక్తి అదే ఉద్దేశంతో ఉంటే ఫర్వాలేదు. కానీ, అలా లేకుంటేనే సమస్యంతా. వాళ్ల నడవడిక, మాటతీరు అన్నింట్లోనూ తేడా వస్తుంది. అన్నీ తట్టుకుని నిలబడటం ఆషామాషీ కాదు. అయినా నెమ్మదిగా అలవాటు చేసుకుని అలాంటి వారిని దూరం పెట్టమంటోంది.

✦ రోజూ మనం వాడే షూ, చెప్పులు, ఇంట్లో వస్తువులు ఇలా అవసరమైనవి చాలానే ఉంటాయి. వాటివల్ల మిగిలినవి పాడవుతున్నాయి అనిపిస్తే వాటిని వదిలేయడమే మేలంటోంది 'పూప్ రూల్'. □

# వాల్మీకి మదిలో..

ఆధ్యాత్మికం



**వాల్మీకి మహర్షికి తన ఆరాధ్య దైవమైన** శ్రీరామచంద్రుడిపై ఎంత పూజ్యభావమో ఆ అవతారపురుషుడు ఆవిర్భవించిన అయోధ్య అంటే కూడా అంతే ఆరాధనా భావం. అందుకే తన రామాయణ బాలకాండలో ఆ నగరాన్ని అమోఘంగా కీర్తించాడు. ప్రజారంజకరమైన పాలనకే కాదు పారమార్థిక చింతనకు కూడా నెలవైన ఆ నగరం సనాతన భారతీయ సాంస్కృతిక సందపకు పెట్టని కోటలాంటిది. ఆ భావనతోనే వాల్మీకి మహర్షి 'యోద్ధుం అశక్యా ఇతి అయోధ్య.. జయించటానికి వీలు కానిది అయోధ్య' అని శ్లాఘించాడు. అంతేకాదు తన అంతరంగాన్నే అయోధ్యగా చేసుకుని ఆ ఆజాను బాహుణ్ణి అందులో ప్రాణప్రతిష్ఠ చేసుకున్నాడు. రామాయణ కాలం ప్రకారం అయోధ్య పొడవు 12, వెడల్పు 3 యోజనాలు. అప్పట్లో దాదాపు 7 వేల కిలోమీటర్లు. వాల్మీకి అయోధ్యను రాజకీయ, సామాజిక, ఆర్థిక, సాంస్కృతిక, ఇలా అన్ని రంగాల్లోనూ ఆదర్శప్రాయం అంటూ అభివర్ణించాడు. కేవలం శ్రీరాముణ్ణి, ఆయన అవతరించిన అయోధ్యను ఆరాధించటమే కాదు.. ఆ గుణగణాలను అనుసరించటం ప్రధానమని చెప్పకనే చెప్పాడు. భౌగోళికంగా కాదు భక్తిభావంతో అయోధ్యను అర్థం చేసుకునేందుకు ప్రయత్నించాలి. అప్పుడే దర్శనభాగ్యం లభిస్తుందంటారు తాత్త్వికులు. □

# ఇంటి కాలుష్య నివారణ కోసం..

**కాలుష్యం ఇప్పుడు బయట కాదు. ఇంట్లోనే తిష్ఠ వేస్తుందంటున్నారు శాస్త్రవేత్తలు. గ్యాస్ స్టవ్, ఫర్నిచర్, కార్పెట్, ఎయిర్ కండిషనర్, ఫ్రిజ్, పెయింట్లు.. ఇవన్నీ కాలుష్యాన్ని వెద జల్లుతున్నాయని చెబుతున్నాయి.**

కొన్ని నగరాల్లోనైతే బయటికన్నా ఇంట్లో ఐదురెట్లు ఎక్కువగా కలుష్యం ఉంటోందట. జలుబూ దగ్గుల నుంచీ ఉబ్బసం దాకా పలు సమస్యలకి ఇది దారితీస్తోందట. వీటికి విరుగుడుగా కొందరు ఇళ్లలోనే ఎయిర్ ప్యూరిఫయర్‌లుకొంటున్నారుకానీ. ఓ చిన్న మొక్కనే అలా ఎయిర్ ప్యూరిఫయర్‌గా మారిస్తే ఎలా ఉంటుందన్న ఆలోచన వచ్చింది. యూనివర్సిటీ ఆఫ్ ప్యారిస్‌కి చెందిన పరిశోధకులకి. ఇందుకోసం ఓ మనీప్లాంట్‌ని ఎంచుకుని దానికి జన్యుమార్పు చేశారు. మనకి మంచి చేసే బ్యాక్టీరియాకి ఆశ్రయమిచ్చేలా ఆ మొక్కని మార్చారు. ఆ బ్యాక్టీరియా గాలిని కాలుష్య కారకాల్ని తింటూనే బతుకు తాయట. అలా మామూలు మొక్కకన్నా వెయ్యిరెట్లు ఎక్కువగా కాలుష్యాన్ని పీల్చి గాలిని శుభ్రం చేస్తాయన్నమాట.



ప్యారిస్ యూనివర్సిటీ శాస్త్రవేత్తలు ఈ మొక్కని ఆవిష్కరించడంతోనే ఊరుకోలేదు. దానితో నియోప్లాంట్స్ అనే స్టార్టప్‌ని పెట్టి అలాంటి మొక్కల్ని విక్రయిస్తున్నారు కూడా ! □

# మళ్లీ టి20 ఛాంపియన్స్ లీగ్

## • టైటిల్ విన్నర్స్ జట్ల మధ్య బిగ్ ఫైట్ • రాయల్ ఛాలెంజర్స్‌కు మరో ఛాన్స్





**న్యూఢిల్లీ:** ఐపిఎల్ సక్సెస్ తరువాత దాదాపు ప్రతి దేశం ఈ లీగ్స్‌ని జరుపుతున్నాయి. ప్రస్తుతం ఇంటర్నేషనల్ లీగ్స్ ఏకంగా 25పైనే ఉన్నాయి. అయితే ఒక్కప్పుడు టి20 ఛాంపియన్స్ లీగ్ ఉండేది. అది కేవలం ఐపిఎల్, బిగ్‌బాష్ లీగ్, ఇంగ్లాండ్ కౌంటీల్లో టాప్ 2 టీమ్స్ అంటే విన్నర్, రన్నర్స్ మాత్రమే ఆడేవి. ఇలా టి20 లీగుల్లో టాప్ 2 టీమ్స్ ఆడేవి. మొదట 2009లో ప్రారంభమైన చాంపియన్స్ లీగ్, 2014 వరకు నడిచింది. అయితే 2015లో టెలివిజన్ రేటింగులు తక్కువగా ఉండటం, స్పాన్సర్షిప్ స్ట్రగుల్స్ కారణంగా ఈ లీగ్‌ను రద్దు చేశారు. ఇక ఈ లీగ్‌లో చెన్నై సూపర్ కింగ్స్, ముంబై ఇండియన్స్ రెండు టైటిళ్లతో అత్యంత విజయవంతమైన జట్లుగాకూడా నిలిచాయి. ఆ తర్వాత ఈలీగ్‌ను నిర్వహించటం ఆపేశారు. చివరగా ఈ లీగ్ 2014లో జరిగింది. అయితే ఇప్పుడు ఇదే లీగ్ మళ్లీ నిర్వహించటానికి ప్లాన్ చేస్తున్నారు. వరల్డ్ క్లబ్ టి20 ఛాంపియన్‌షిప్ పేరిట ఒకలీగ్‌ను 2026 నుంచి నిర్వహించబో తున్నారు. ఇందులో ఐపిఎల్, బిగ్ బాష్ లీగ్, పాకిస్థాన్ సూపర్ లీగ్, ది హండ్రెడ్, ఎస్ఎ టి20 లీగ్స్‌లో ఛాంపియన్స్‌గా నిలిచినజట్లు తలపడతాయి. ఇలా ప్రపంచవ్యాప్తంగా ఉన్న టాప్ 20 లీగ్స్ నుంచి టైటిల్ విన్నర్ జట్లను తీసుకుంటారు. వారందరూ ఇక్కడ మరోసారి తలపడతారు. ఇంగ్లాండ్ ఇకపై హండ్రెడ్ లీగ్‌లో విన్నర్‌గా నిలిచిన జట్టునే పంపనుంది. అంతకు ముందు ఛాంపియన్స్‌లీగ్ టైంలో టి20 బ్లాస్ట్ టైటిల్ విన్నర్ జట్టునే పంపేవారు. అయితే ఇప్పుడు ఆ జట్లను కాకుండా హండ్రెడ్ లీగ్ టైటిల్ విజేతను పంపనున్నట్లు తెలుస్తోంది. ఈ టోర్నీ ఖాయమైతే ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపిఎల్) ఛాంపియన్ రాయల్ ఛాలెంజర్స్ బెంగుళూరు- పాకిస్థాన్ సూపర్ లీగ్ (పిఎస్ఎల్) విజేత లాహోర్ ఖలందర్స్ తలపడే ఛాన్స్ ఉంటుంది. ఐపిఎల్ 2025లో రాయల్ ఛాలెంజెర్స్ బెంగుళూరు జట్టు మొదటిసారిగా ఛాంపియన్స్‌గా అవతరించగా, పిఎస్ఎల్ 2025 విజేతగా లాహోర్ ఖలందర్స్ నిలిచింది. ఈ క్రమంలో ఈ మ్యాచ్ సైతం భారత్ పాకిస్థాన్ లెవెల్‌లో క్రేజ్ సాధించే ఛాన్స్ ఉంది. రాయల్‌ఛాలెంజర్స్‌నుంచి విరాట్ కోహ్లీ, పెషావార్ నుంచి అజాం బాబర్ మధ్య తగ్గ పోటీ ఖాయం. ఈ మ్యాచ్‌తో టోర్నమెంట్ క్రేజ్, రెవెన్యూ, స్పాన్సర్లు కూడా అమాతం పెరుగుతారు. మొత్తం టోర్నీలోనే అత్యధిక రెవెన్యూ జనరేట్ చేసే మ్యాచ్ ఇదే అవుతుందనడంలో సందేహం లేదు.




### సూపర్ యునైటెడ్ రాపిడ్ బ్లిట్జ్‌లో..

## గుకేష్ సంచలన విజయం

### వరల్డ్ నెంబర్ 1 కార్ల్‌సెన్ ఓటమి

**న్యూఢిల్లీ:** సూపర్ యునైటెడ్ రాపిడ్ బ్లిట్జ్-2025 టోర్నమెంట్‌లో భారత్ గ్రాండ్ మాస్టర్ దొమ్మరాజు గుకేష్ ప్రపంచ నెంబర్ 1ను ఓడించి సంచలన విజయం సాధించాడు. రెండు రోజుల రాపిడ్ తర్వాత గుకేష్ వరుసగా ఐదు విజయాలు నమోదు చేసి పోటీలో ముందంజ వేశాడు. ఈ చెస్ టోర్నమెంట్ ఆరో రౌండ్‌లో ప్రపంచ ఛాంపియన్ గుకేష్ తన ప్రత్యర్థి ప్రపంచ నంబర్ 1 మరియు ఐదుసార్లు ప్రపంచ ఛాంపియన్ మాగ్నస్ కార్ల్‌సెన్‌పై ఘన విజయం సాధించాడు. ఈ సంవత్సరం ప్రారంభంలో నార్వే చెస్‌లో క్లాసికల్ విజయం తర్వాత మాగ్నస్‌పై గుకేష్ సాధించిన రెండవ వరుస విజయం ఇది. ఈ విజయం ఆరు రాపిడ్ రౌండ్ల తర్వాత 10 పాయింట్లతో లీడర్‌బోర్డ్‌లో అగ్రస్థానానికి చేరుకుంది. ఈ ఈవెంట్‌లో గుకేష్ వరుసగా ఐదు మ్యాచ్‌ల విజయాల పరంపరను కొనసాగిస్తున్నాడు. రెండవ రోజు త్రీ ఫర్ త్రీ తో సహా, ఇది మూడు చివరి రౌండ్లతో ర్యాపిడ్ సెగ్మెంట్‌ను గెలుచుకునేందుకు తన స్థానాన్ని బలపరుస్తుంది. గుకేష్ తదుపరి చివరి మూడు రాపిడ్ మ్యాచ్‌లలో నెదర్లాండ్స్‌కు చెందిన అనిష్ గిరి, క్రొయేషియాకు చెందిన ఇవాన్ సారిక్, ఆపై అమెరికాకుచెందిన వెస్లీ సోతో తలపడతాడు. లీడర్ బోర్డ్‌లో తన 2 పాయింట్ల ఆధిక్యాన్ని కొనసాగించాలనే లక్ష్యంతో గుకేష్ వ్యూహాత్మకంగా ప్రత్యర్థులను ఇరుకున పెట్టాలని భావిస్తున్నాడు. మరోవైపు ఆర్ ప్రజ్ఞానంద డ్రా ల పరంపర కొనసాగుతోంది. ఆరు రౌండ్లలో ఐదు డ్రాలతో, ఐదవ రౌండ్‌లో మాగ్నస్ కార్ల్‌సెన్‌తో జరిగిన మ్యాచ్‌తో సహా, 5 పాయింట్లతో అతను ఏడవ స్థానంలోనిలిచాడు. అతను ఇంకా ఈటోర్నమెంట్‌లో తన తొలివిజయాన్ని నమోదు చేసుకోలేదు.

## వింబుల్డన్ టోర్నీలో పావోలిని ఓటమి



**న్యూఢిల్లీ:** ఇప్పటికే రెండో సీడ్ కోకో గాఫ్, మూడో సెజ్సికా పెగూలా, ఐదో సీడ్ కిన్‌వెన్ జెంగ్, తొమ్మిదో సీడ్ పౌలా బదోసా తొలి రౌండ్‌లోనే నిష్క్రమించగా, తాజాగా వీరి సరసన గత ఏడాది రన్నరప్, నాలుగో సీడ్ జాస్మిన్ పావోలిని చేరింది. శుక్రవారం జరిగిన మ్యాచ్‌లో రష్యాకు చెందిన ప్రపంచ 80వ ర్యాంకర్, అన్‌సీడెడ్ కామిలా రఖీమోవా అద్భుత ఆటతో పావోలిని ఆటకట్టించి మూడో రౌండ్‌లోకి దూసుకెళ్లింది. కామిలా రఖీమోవా 4-6, 6-4, 6-4 తేడాతో ప్రపంచ ఐదో ర్యాంకర్, నాలుగో సీడ్ పావోలినిపై సంచలన విజయం సాధించింది. తద్వారా తన కెరీర్‌లో మూడోసారి ఓ గ్రాండ్‌స్లామ్ టోర్నీలో మూడో రౌండ్‌కు చేరుకుంది. గత ఏడాది ఫ్రెంచ్ ఓపెన్ ఫైనల్లో స్వియాటెక్ చేతిలో వింబుల్డన్ టోర్నీ ఫైనల్లో క్రెజికోవా చేతిలో ఓడిపోయి రన్నరప్‌గా నిలిచిన పావోలిని ఈ ఏడాది మాత్రం ఆవించిన స్థాయిలో రాణించలేకపోయింది. రఖీమోవాతో జరిగిన పోరులో తొలి సెట్‌ను నెగ్గిన పావోలిని ఆ తర్వాత తడబడింది. 2 గంటల 19 నిముషాల పాటు జరిగిన ఈ మ్యాచ్‌లో పావోలిని 40 అనవసర తప్పిదాలు చేసి, 23 విన్నర్స్ కొట్టింది. తన సర్వీస్‌ను మూడుసార్లు కోల్పోయి, ప్రత్యర్థి సర్వీస్‌ను రెండుసార్లు బ్రేక్ చేసింది. రఖీమోవా 26 విన్నర్స్ కొట్టింది. నెట్ వద్దకు 12 సార్లు దూసుకొచ్చి ఎనిమిదిసార్లు పాయింట్లు గెలిచింది. మరోవైపు డిఫెండింగ్ ఛాంపియన్ చెక్ రిపబ్లిక్‌కు చెందిన క్రెజికోవా మాజీ నంబర్ వన్, జపాన్‌కు చెందిన నయోమి ఒసాకా, ఏడో సీడ్, రషాన్యకు చెందిన మిరా అంద్రీవా, ఎనిమిదో సీడ్, పోలెండ్‌కు చెందిన ఇగా స్వియాటెక్, మాజీ ఛాంపియన్, కజకిస్తాన్‌కు చెందిన రిబాకినా, పదో సీడ్, అమెరికాకు చెందిన ఎమ్మా నవారో మూడో రౌండ్‌లోకి అడుగు పెట్టారు.

### ఫుట్‌బాల్ టోర్నమెంట్‌లో..

## మెక్సికో విజయం

### 1-0 తేడాతో హోండురాస్ ఓటమి

**న్యూఢిల్లీ:** ఫుట్‌బాల్ టోర్నమెంట్‌లో మెక్సికో సూపర్ విజయంసాధించింది. రౌల్ జిమెనెజ్ 50వ నిమిషంలో 16ఏళ్ల గిల్బర్టో మోరా సహాయంతో గోల్‌చేశాడు. దీంతో మెక్సికో శుక్రవారం హోండురాస్‌పై 1-0 తేడాతో విజయం సాధించి 12వ గోల్డ్ కప్ ఫైనల్‌కు చేరుకుంది. రెండవ అర్ధభాగం ప్రారంభంలో అలెక్సిస్‌వేగా బాక్స్ పైభాగంలో మోరాకు పాస్ ఇవ్వడంద్వారా ప్రారంభించిన ఆటతో మెక్సికో విజయం సాధించింది. అతను తన కెరీర్‌లో ఎడ్రిక్ మెంజివర్‌ను ఓడించి తన 42వ అంతర్జాతీయ గోల్‌ను నమోదు చేశాడు. కొన్ని నిమిషాల తర్వాత 17వ ర్యాంక్‌లో ఉన్నమెక్సికో ఆధిక్యాన్ని పెంచుకుంది, ఎడ్సన్ అల్వారెజ్ సెట్‌పీస్‌లో గోల్ కొట్టాడు, కానీ వీడియో రివ్యూలో అతను ఆఫ్‌సైడ్ అని తేలిన తర్వాత అది తిరస్కరించబడింది. గత రెండు ఆటల్లో గోల్ వైపు ఎటువంటి షాట్‌లను ఎదుర్కోకపోవడంతో, మెక్సికన్ గోలీ లూయిస్ మలగాన్ బాక్స్ వెలుపల నుండి డిక్సన్ రామిరెజ్ కొట్టినషాట్‌నుసులభంగా సేవ్‌చేశాడు. ఆట చివరిలో ఎల్ ట్రైస్‌కు రెండు మంచి ఛాన్స్ దక్కాయి.

### వెస్టిండీస్ రెండో టెస్టులో..

## ఆస్ట్రేలియా 286 రన్స్‌కు ఆలౌట్



**న్యూఢిల్లీ:** వెస్టిండీస్‌తో ప్రారంభమైన రెండో టెస్టు తొలి ఇన్నింగ్స్‌లో ఆస్ట్రేలియా 286 పరుగులకు ఆలౌట్ అయింది. గ్రెనడాలోని నేషనల్ క్రికెట్ స్టేడియంలో జరిగిన రెండో టెస్ట్‌లో మొదటిరోజు ఆస్ట్రేలియన్ టాప్‌ఆర్డర్‌ను వెస్టిండీస్ పేసర్లు చిత్తు చేశారు, కానీ లోయర్ ఆర్డర్ సహకారం పాట్ కమ్మిన్స్ జట్టును 286 పరుగులకు ఆలౌట్ చేయడంలో సహాయపడింది. మూడు మ్యాచ్‌ల సిరీస్‌లో 1-0 ఆధిక్యంలో ఉన్న ఆస్ట్రేలియా, టాస్ గెలిచి మొదట బ్యాటింగ్ ఎంచుకుంది. ఓపెనర్లు సామ్ కాన్‌స్టాస్ మరియు ఉస్మాన్ ఖవాజా మొదటి 11 ఓవర్లలో 47 పరుగులు జోడించారు, కానీ వెస్టిండీస్ తిరిగి పుంజుకుని పర్యాటక జట్టును 50/3కి తగ్గించింది. ట్రావిస్ హెడ్ మరియు కామెరాన్ గ్రీన్ కలిసి జట్టును ఎదురుదాడి చేసి 61 బంతుల్లో 43 పరుగులు జోడించారు. అయితే, లంచ్ సమయానికి ట్రావిస్ హెడ్ 37బంతుల్లో 26 పరుగులు చేసి అవుట్ అయ్యాడు. మొదటి సెషన్‌లో ఆస్ట్రేలియా నాలుగు కంటే ఎక్కువ పరుగుల రేటుతో స్కోరు చేసింది, కానీ నాలుగు వికెట్లు కూడా కోల్పోయింది. ఆస్ట్రేలియా జట్టులో 110 పరుగులకే కోల్పోయిన తర్వాత బ్యూ వెబ్‌స్టర్ మరియు అలెక్స్ కారీ 150 బంతుల్లో 112 పరుగుల కీలకమైన భాగస్వామ్యాన్ని నెలకొల్పారు. ఈ భాగస్వామ్యం కేవలం 150 బంతుల్లోనే 112 పరుగులు చేసింది. జస్టిన్ గ్రీవ్స్ కేవలం 81 బంతుల్లో 10 ఫోర్లు మరియు ఒకే ఒక సిక్సర్‌తో 63 పరుగులు చేశాడు. దీనితర్వాత, పాట్ కమ్మిన్స్ 20బంతుల్లో 17 పరుగులు చేసి వెస్టిండీస్ బౌలర్లను నిరాశపరిచాడు. విండీస్ ఆస్ట్రేలియా ఇన్నింగ్స్‌ను త్వరగా ముగించాలని చూస్తుండగా, మిచెల్ స్టార్క్ ఆరు పరుగులు చేసి నిష్క్రమించాడు. వెబ్‌స్టర్ 115 బంతుల్లో 60 పరుగులు చేసి ఘన విజయం సాధించి దురదృష్టవశాత్తు రనౌట్ అయ్యాడు. నాథన్ లియాన్ మరియు జోష్ హేజిల్‌వుడ్ మధ్య చివరి వికెట్ భాగస్వామ్యం 16 బంతుల్లో 19 పరుగులు జోడించింది, చివరికి ఆస్ట్రేలియా 66.5ఓవర్లలో 286 పరుగులకు ఆలౌట్ అయింది. వెస్టిండీస్ బౌలర్లలో అల్జారి జోసెఫ్ నాలుగు వికెట్లు పడగొట్టాడు.

# యుఎస్ సంస్థ జేన్‌స్ట్రీట్‌పై సెబి మార్కెట్ బ్యాన్!

### రూ.4844 కోట్లకు లెక్కలు చెప్పాలని ఉత్తర్వులు

**ముంబై,జూలై 4:** అమెరికా ట్రేడింగ్ సంస్థ జేన్‌స్ట్రీట్‌ను మార్కెట్లలో పాల్గొనేందుకు సెబి నిషేధం విధించింది. అమెరికా ట్రేడింగ్ సంస్థ అయిన జేన్‌స్ట్రీట్ అత్యాధునిక విశ్లేషణలు తీసుకుని దేశీయ సెక్యూరిటీ మార్కెట్లను తన పరిధిలోకి తీసుకుని మార్కెట్లలో అవకతవకలకు పాల్పడుతున్నట్లు గుర్తించిన సెబి తాత్కాలికంగా నిషేధించాలని ఆదేశాలు జారీచేసింది. చట్టవ్యతిరేకంగా 4844 కోట్ల మేర నిధులు దుర్వినియోగం చేసిందని సెబి ప్రకటించింది. అక్రమంగా సంపాదించినట్లుగా నిర్ధారణ అయిన ఈ సొమ్ముకు ఆధారాలు చూపించేంతవరకూ జేన్‌స్ట్రీట్‌పై నిషేధం కొనసాగుతుందని సెబీ ప్రకటించింది. ఇకపై స్టాక్ మార్కెట్లు కూడా జెఎస్‌గ్రూప్ లావాదేవీలు కార్యకలాపాలను నిశితంగా గమనించాలని ఉత్తర్వులు జారీచేసింది. ప్రత్యక్షంగా కానీ పరోక్షంగా కానీ ఎలాంటి మార్కెట్ లావాదేవీల్లో జెఎస్‌గ్రూప్ పాల్గొనేందుకు వీలులేదని సెబి తన 105 పేజీల ఉత్తర్వుల్లో వెల్లడించింది. సెబి పూర్తికాలపు సభ్యులు అనంత్‌నారాయణ్ ఈ ఉత్తర్వులు జారీచేసారు. జెఎస్‌గ్రూప్ ఆప్షన్స్ విభాగంలో భారీ పొజిషన్లు తీసుకుంటున్నది. తర్వాత స్టాక్ మార్కెట్లను ప్రభావితంచేసేవిధంగా ఈ పొజిషన్లు తీసుకుంటున్నట్లు తేలింది. వారం సూచీ ఆప్షన్, పరిమితి ముగుసునతన్న రోజులను చూసి నగదు, ఫ్యూచర్ మార్కెట్లలో చెప్పుకోదగిన సంఖ్యలో ప్రభావితంచేసేవిధంగా లావాదేవీలున్నట్లు సెబి గుర్తించింది. స్టాక్‌సూచీల స్థాయిలను తారుమారు చేయడం ద్వారా భారీ లాభాలను ఆర్జించినట్లు సెబి తన విచారణ నివేదికలో పేర్కొంది. 12 బ్యాంకు నిఫ్టీ స్టాక్స్‌కొనుగోలు ద్వారా ఈ లావాదేవీలునిర్వహించింది. భారీ కొనుగోళ్లుచేసి ఈ స్టాక్‌పై ప్రభావం చూపించింది. తద్వారా ఇతర ట్రేడర్లు కూడా భారీ కొనుగోళ్లు చేయడంద్వారా లాభాలను ఆర్జించినట్లు తెలుస్తోంది. జేన్‌స్ట్రీట్‌గ్రూప్ నిబంధనలకు విరుద్ధంగా అత్యధికసంఖ్యలో కొనుగోలు ఆర్డర్లు ఇచ్చింది. బ్యాంకు నిఫ్టీ సంబంధిత స్టాక్స్‌లోనగదు, ఫ్యూచర్ సెగ్మెంట్లలో కూడా ఇదేవిధంగా ఆర్డర్లు ఇచ్చినట్లు సెబి తన నివేదికలో వెల్లడించింది. దీనివల్ల స్టాక్‌ధరలు గణనీయంగా పెరిగిపోతాయన్నారు. పిఎఫ్‌యుటిపి నిబంధనలను ఉల్లంఘించి ట్రేడింగ్‌లో అవకతవకలకు పాల్పడిందని సెబి తన నివేదికలోప ఒందుపరిచింది. జనవరి 2023 నుంచి 2025 మార్చి మధ్యకాలంలోజేన్‌స్ట్రీట్ సుమారు 44,358 కోట్లు ఆర్జించింది. స్టాక్ ఫ్యూచర్స్‌లో 7208కోట్లు నష్టపోయింది. 191కోట్లుసూచీ ఫ్యూచర్స్‌లోను నగదు విభాగంలో 288 కోట్లు నష్టపోయి నట్లు తేలింది. మొత్తంగాచూస్తే 36,671 కోట్లు లాభపడిందని, ఇదంతా కూడా తన వద్ద ఉన్న అధునాతన టెక్నాలజీని ఉపయోగించి సూచీలను తన అధీనంలోకి తీసుకోవడం ద్వారా నియమవిరుద్ధంగా లావాదేవీలు సాగించి అనుచిత లబ్ధిని పొందిందని సెబి ప్రస్తావించింది.





## నిధుల సమీకరణలో ఫిన్‌టెక్ స్టార్టప్‌లు టాప్!

**ముంబై, జూలై 4:** భారత్ ఆర్థికరంగంలో ఫిన్‌టెక్ స్టార్టప్ నిధులసమీకరణ ప్రపంచంలోనే మూడోస్థానంలో నిలిచింది. 2025 మొదటి ఆరునెలల్లో అమెరికా, బ్రిటన్‌ల తర్వాత భారత్ ఫిన్‌టెక్ స్టార్టప్‌లు భారీ నిధులు సమీకరించాయి. మొత్తం 889 మిలియన్ డాలర్ల నిధులు సమీకరించినట్లు ట్రాక్షన్ జియో సెమీ యాన్యువల్ ఇండియా ఫిన్‌టెక్ రిపోర్టు ప్రస్తావించింది. అయితే 2024 రెండో అర్ధభాగంలో 1.2 బిలియన్ డాలర్లతో పోలిస్తే 26శాతం క్షీణించింది. గత ఏడాది ఆరునెలల కాలంతో చూసినా ఐదుశాతం తగ్గినట్లు సర్వేలో తేలింది. ఇతర దేశాల్లో కూడా అదే స్థాయిలో నిధుల సమీకరణ ఉండటంతో 2025 మొదటి అర్ధభాగంలో భారత్ మూడో స్థానంలో నిలిచింది. 2024 రెండో అర్ధభాగంలో 10శాతంపెరిగి 361 మిలియన్ డాలర్లకు చేరింది. అలాగే గత ఏడాది మొదటి అర్ధభాగంతో పోలిస్తే 9శాతం పెరుగుదల నమోదు చేసినట్లు ట్రాక్షన్ జియో సర్వేలో తేలింది. సీడ్‌స్టేజ్ పెట్టుబడులపరంగా చూస్తే మందగించాయి. 91.2 మిలియన్ డాలర్లు మాత్రమే ఉన్నట్లు తేలింది. గత ఏడాది అర్ధబాగంతోపోలిస్తే 27శాతం మందగించినట్లు తేలింది. ట్రాక్షన్ జియో సహవ్యవస్థాపకులు నేహా సింగ్ మాట్లాడుతూ ఇన్వెస్టర్ల సెంటిమెంట్ మాత్రం బలంగా ఉందని కొత్తకొత్త సృజనాత్మక ఆవిష్కరణలవైపు ఇన్వెస్టర్లు ఫోకస్ పెడుతున్నట్లు తేల్చారు. ఇక విలీనాలు, కొనుగోళ్ల (ఎంఅండ్ఎ) పరంగాచూస్తే మొదటి అర్ధసంవత్సరంలో 16 డీల్స్ జరిగాయి. 2025 మొదటి ఆరునెలల్లో గత ఏడాదితోపోలిస్తే 45శాతం పెరిగాయి. కీలక లావాదేవీలు పరంగాచూస్తే గ్రోసంస్థ 150 మిలియన్ డాలర్ల ఫిస్‌డమ్, ఇన్‌క్రెడ్‌మనీ సంస్థలను 35 మిలియన్ డాలర్లతో స్టాకో డీల్ వంటివి ముఖ్యంగా చెప్పుకోవచ్చు. మొదటి అర్ధభాగంలో కేవలం ఒకే ఒక్కయూనికార్న్ వచ్చింది. ఇక రెండో అర్ధభాగంలో గత ఏడాది ఒక్క యూనికార్న్ కూడా నిధుల సమీకరణలో అంచనాలను అధిగమించలేకపోయింది.



## ఎన్ఎస్ఇ ఐపిఒ వస్తే దమానీకి రికార్డులే!

**ముంబై, జూలై 4:** నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజీ (ఎన్ఎస్ఈ) పబ్లిక్ ఇష్యూకు వస్తే.. ప్రముఖ మదుపరి, డీమార్ట్ అధినేత రాధా కిషన్ దమానీకి లాభాలపంటే!. ఎందుకంటే ఎన్ఎస్ఈలో దమానీకి 1.58శాతం (3.91 కోట్ల షేర్లు) వాటా ఉంది. 2020 జనవరి మార్చిలో విదేశీ పెట్టుబడిదారు నార్వెస్ట్ వెంచర్ పార్ట్‌నర్స్ నుంచి ఈ వాటాను దమానీ కొనుగోలు చేశారు. ఎన్ఎస్ఈ షేర్ల విలువ ఎం? ఎన్ఎస్ఈ షేరు ఎక్స్ఛేంజీల్లో నమోదు కాలేదు. అయితే అన్‌లిస్టెడ్ షేరు ధర ఒక్కోటి రూ.2,389 పలుకుతోంది. ఫలితంగా దమానీ దగ్గర ఉన్న ఎన్ఎస్ఈ షేర్ల నికర విలువే రూ.9,341 కోట్లు అవుతుంది. కాగా.. ఎంతో కాలంగా ఐపీఓకు వచ్చేందుకు, సెబీ అనుమతుల కోసం ఎన్ఎస్ఈ వేచిచూస్తోంది. ఈ ఆర్థిక సంవత్సరంలో ఈ కల నెరవేరుతుందని భావిస్తున్నారు. దమానీ వాటా విక్రయిస్తారా? సాధారణంగా పెద్ద సంస్థలు ఐపీఓ ద్వారా నిధులు సమీకరించేప్పుడు, ఆఫర్ ఫర్ సేల్ కింద ప్రమోటర్లు - ప్రస్తుత వాటాదార్లు కొంత వాటాలు విక్రయించి, ప్రయోజనం పొందుతారు. ఎన్ఎస్ఈ ఐపీఓలో దమానీ తన వాటా షేర్లను విక్రయిస్తారా? లేదంటే కొనసాగిస్తారా? అనే దానిపై స్పష్టత లేదు. విక్రయిస్తే మాత్రం, ఆయన తన పెట్టుబడిపై గణనీయ ప్రతిఫలాన్ని పొందుతారనేది మార్కెట్ వర్గాల విశ్లేషణ. పెద్ద కంపెనీలు ఐపీఓ సమయంలో ద్వారా ప్రమోటర్లు, వృద్ధి చెందిన వాటాదారులు షేర్లు విక్రయిస్తారు.




## భారత్‌లో తొలి యుపిఐ బ్యాంకు

# వాణిజ్యం

**ముంబై, జూలై 4:** ఈ రోజుల్లో టెక్నాలజీ పెరిగిపోయింది. ఒకప్పుడు బ్యాంకులకు వెళ్లి పనులు చేసుకునే వారు నేడు ఇంట్లోనే ఉండి అన్ని పనులు చేసుకునే టెక్నాలజీ వచ్చేసింది. ఇక ప్రస్తుతం ఆన్‌లైన్ చెల్లింపుల పద్ధతుల్లో సులభమైన మార్గాలు వచ్చాయి. దేశంలో యూపీఐ వ్యవస్థ ఎంతగానో విస్తరించింది. ప్రతి రోజు కోట్లాది రూపాయలు యూపీఐ లావాదేవీలు జరుగుతున్నాయి. దేశంలో యూపీఐ సేవలు వచ్చిన తర్వాత మరింత సులభం అయిపోయింది. ఇక దేశంలోని ప్రతి ఒక్కరికీ బ్యాంకింగ్ సేవలను అందించాలనే ఉద్దేశంతో స్లైస్ బ్యాంక్ యుపిఐ ఆధారిత క్రెడిట్ కార్డును విడుదల చేసింది. దీని ద్వారా భారతదేశంలో బ్యాంకింగ్ విధానాన్ని మార్చాలని భావిస్తోంది. భారతదేశంలోనే మొట్టమొదటి యూపీఐతో పనిచేసే భౌతిక బ్యాంక్ శాఖను, ఎటిఎంను ప్రారంభించింది. వేగంగా బ్యాంకింగ్ సేవలు అందించడమే లక్ష్యంగా పెట్టుఉంది. స్లైస్ సూపర్ కార్డ్ పేరుతో విడుదల చేసిన ఈ యూపీఐ క్రెడిట్ కార్డు ద్వారా వినియోగదారులు సులభంగా క్రెడిట్ పొందవచ్చు. ఈ కంపెనీ ఇటీవలే ఎన్ఇఎస్ఎఫ్‌బితో విలీనం అయిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో బ్యాంకింగ్ సేవలను మరింత విస్తరించడంతో పాటు టెక్నాలజీ వినియోగాన్ని పెంచాలని భావిస్తోంది. ఈ స్లైస్ బ్యాంక్ బెంగళూరులోని కోరమంగళలో సరికొత్త యూపీఐ ఆధారిత బ్యాంక్ శాఖను ప్రారంభించింది. ఇది బ్యాంకింగ్ అనుభవాన్ని మరింత సులభతరం చేస్తుంది. వినియోగదారులు ఇప్పుడు డిజిటల్ బ్యాంక్ శాఖకు వెళ్లి, వేగవంతమైన సేవలను పొందవచ్చని స్లైస్ బ్యాంక్ తెలిపింది. ద్వారా డబ్బులు తీసుకోవచ్చు. డిపాజిట్ కూడా చేయవచ్చు. అంతే కాదండోయ్ దీని ద్వారా బ్యాంకు అకౌంట్ ఓపెన్ చేయడం, ఇతర బ్యాంకింగ్ సేవలను కూడా ఈ యూపీఐ ఆధారిత బ్రాంచులో పొందే అవకాశం ఉందని బ్యాంకు తెలిపింది.





## ఈ బ్యాంకుల్లో మినిమమ్ బ్యాలెన్స్ ఛార్జీల్లేవ్!

**న్యూఢిల్లీ, జూలై 4:** దేశంలోని కోట్లాది మంది బ్యాంకు ఖాతాదారులకు పలు ప్రభుత్వ రంగ బ్యాంకులు భారీ ఊరట అందించాయి. పొదుపు ఖాతాల్లో కనీస సగటు నిల్వ (మినిమమ్ బ్యాలెన్స్) లేకపోతే విధించే అపరాధ రుసుమును (పెనాల్టీ) రద్దు చేస్తూ కీలక నిర్ణయం తీసుకున్నాయి. పంజాబ్ నేషనల్ బ్యాంక్ (పీఎన్‌బీ), బ్యాంక్ ఆఫ్ బరోడా, కెనరా బ్యాంక్ తో పాటు తాజాగా ఇండియన్ బ్యాంక్ కూడా ఈ జాబితాలో చేరింది. తమ బ్యాంకు పరిధిలోని అన్ని సేవింగ్స్ ఖాతాలపై మినిమమ్ బ్యాలెన్స్ ఛార్జీలను ఎత్తివేస్తున్నట్లు పంజాబ్ నేషనల్ బ్యాంక్ ప్రకటించింది. ఈ నిర్ణయం జులై 1 నుంచే అమల్లోకి వచ్చిందని, ముఖ్యంగా మహిళలు, రైతులు, అల్పాదాయ వర్గాలకు మద్దతుగా ఈ చర్య తీసుకున్నామని బ్యాంకు ఎండీ, సీఈఓ అశోక్ చంద్ర తెలిపారు. ఇదే బాటలో కెనరా బ్యాంక్ కూడా మే నెలలోనే నిర్ణయం తీసుకోగా, జులై 1 నుంచి ఆ నిబంధనను అమలు చేస్తోంది. మరోవైపు బ్యాంక్ ఆఫ్ బరోడా కూడా తమ ఖాతాదారులకు ఊరట కల్పించింది. ఈ జాబితాలో తాజాగా ఇండియన్ బ్యాంక్ చేరింది. జులై 7వ తేదీ నుంచి అన్ని రకాల పొదుపు ఖాతాలపై ఈ ఛార్జీలను మినహాయిస్తున్నట్లు స్పష్టం చేసింది. దేశంలోని అతిపెద్ద ప్రభుత్వ రంగ బ్యాంక్ అయిన స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) ఇప్పటికే ఈ సౌకర్యాన్ని తన ఖాతాదారులకు అందిస్తోంది. 2020లోనే ఎస్‌బీఐ తమ పొదుపు ఖాతాలపై మినిమమ్ బ్యాలెన్స్ ఛార్జీలను పూర్తిగా రద్దు చేసింది. ఇప్పుడు ఇతర ప్రభుత్వ బ్యాంకులు కూడా అదే మార్గాన్ని అనుసరించడం పట్ల సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది.




## ట్రేడ్ డీల్‌పై ఇన్వెస్టర్ల ఫోకస్.. సూచీలకు స్వల్ప లాభాలే..

**ముంబై, జూలై 4:** దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు ఈ వారాంతాన్ని స్వల్ప లాభాలతో ముగించాయి. అంతర్జాతీయ మార్కెట్ల నుంచి సానుకూల సంకేతాలు ఉన్నప్పటికీ.. భారత్-అమెరికా ట్రేడ్ డీల్ వార్తలపై దృష్టిపెట్టిన ఇన్వెస్టర్లు అప్రమత్తత పాటించారు. దీంతో ట్రేడింగ్‌లో తీవ్ర ఊగిసలాటకు గురైన సూచీలు చివరకు స్వల్ప లాభాలను దక్కించుకున్నాయి. సెన్సెక్స్ దాదాపు 200 పాయింట్లు పెరగ్గా.. నిఫ్టీ 25,450 మార్క్ దాటింది. ఉదయం 83,306.81 పాయింట్ల వద్ద లాభాలతో ప్రారంభమైన సెన్సెక్స్.. కాసేపటికే ఒత్తిడికి గురైంది. ఒక దశలో 83,015.83 వద్ద ఇంట్రాడే కనిష్ఠానికి పడిపోయిన సూచీ చివర్లో కాస్త కోలుకుంది. మార్కెట్ ముగిసే సమయానికి 193.42 పాయింట్లు లాభపడి 83,432.89 వద్ద స్థిరపడింది. అటు నిఫ్టీ కూడా 25,331.65 25,470.25 మధ్య కదలాడింది. చివరకు 55.70 పాయింట్లు పెరిగి 25,461 వద్ద ముగిసింది. డాలర్‌తో రూపాయి మారకం విలువ 17 పైసలు బలపడి 85.38గా స్థిరపడింది. ఆటో మొబైల్, టెలికాం, లోహ రంగాలు మినహా మిగతా అన్ని రంగాల సూచీలు లాభపడ్డాయి. బ్యాంకింగ్, ఫార్మా, చమురు, ఐటీ, రియల్టీ, మీడియా రంగ సూచీలు 0.4 నుంచి 1 శాతం మేర పెరిగాయి. నిఫ్టీలో బజాజ్ ఫైనాన్స్, ఇన్ఫోసిస్, రెడ్డీస్ ల్యాబ్స్, ఐసీఐసీఐ బ్యాంక్, హిందుస్థాన్ యునిలివర్ షేర్లు రాణించగా, ట్రెంట్, టాటా స్టీల్, ఐషర్ మోటార్స్, టెక్ మహీంద్రా, ఇండస్ ఇండ్ బ్యాంక్ షేర్లు నష్టపోయాయి. బీఎస్ఈ మిడ్‌క్యాప్, స్మాల్‌క్యాప్ షేర్లు స్వల్పంగా పెరిగాయి.



Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.